Nabiyon-ke-Haalaat- IV
(Telugu)

దైవప్రవక్తలు

(నాలుగవ భాగం)

హజ్రత్ మూసా (అలైహిస్సలాం) జీవిత చరిత్ర

మూలం

మౌలానా అబూ సలీం అబ్దుల్ హై

అనువాదం

ముహమ్మద్ ఇక్బాల్ అహ్మద్

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ఈజిప్టులో ఇస్రాయీల్ సంతతి

దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్(అలైహిస్సలామ్) తన తండ్రి హజ్రత్ యాఖూబ్ (అ)ను, తన సోదరులనందరినీ సిరియా నుండి ఈజిప్టుకు పిలిపించుకున్న విషయం పాఠకులు, హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్)గాధలో చదివే ఉన్నారు. ఆ రోజుల్లో ఈజిప్టులో సామాన్య పౌరులంతా ముష్రికులే (దేవునికి ఇతరులను సహవర్తులుగా నిలబెట్టేవారు). వారు అనేక దేవతల్ని పూజించేవారు. "ఆమన్‌ర" అనే సూర్యదేవతను వారు తమ పెద్ద దేవతగా కొలిచేవారు. వారు తమ చక్రవర్తులను దైవాంశ సంభూతులని తలంచేవారు. దేవుడు పాదుషా రూపంలో భూమికి దిగి వస్తాడనే నమ్మకం వారిలో కలిగించబడింది. అందువల్ల వారిచేత రాజులకు పూజలు జరిపించబడేవి. వీరు రాజులను ఫిర్ఔన్‌లు అనేవారు. ఫిర్ఔన్ అంటే సూర్యదేవత అని అర్థం. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) తన కుటుంబంవారిని ఆ బహు దైవారాధకులకు దూరంగా ఒకచోట నివాసం కల్పించారు. హజ్రత్ యాఖూబ్(అ)కు కూడా, తన సంతానం ఆ విగ్రహారాధకులతో కలిసి కాఫిర్లు అయిపోతారేమోననే విచారం పట్టుకుంది. ఆయన తన అవసానదశలో ప్రత్యేకంగా తమ కుటుంబంలోని వారందర్ని పిలిచి, "చూడండి! నా తరువాత మీరు మీ విశ్వాసాన్ని చెడగొట్టకండి. బహుదైవా రాధకుల ఆచారాలను పాటించకండి" అని హితబోధ చేశారు. "అల్లాహ్ మార్గంలో స్థిరంగా ఉంటామ"ని వారందరి వద్ద ప్రమాణాలు తీసుకున్నారు. ఈ సంఘటనను దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రస్తావించాడు.

యాఖూబ్(అ) మృత్యుదశలో తన సంతానాన్ని పిలిచి అడిగాడు, "బిడ్డలారా! నా తరువాత మీరు ఎవర్ని ఆరాధిస్తారు?" వారంతా సమాధానం చెప్పారు, "మీరూ, మీ పెద్దలయిన ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ మరియు ఇస్‌హాఖ్

ఎవరినైతే దైవంగా భావించారో, ఆ ఒక్క దైవాన్నే మేమూ ఆరాధిస్తాము, మేము ఆయనకే ముస్లిములమై ఉంటాము". (అల్ బఖర: 133)

హజ్రత్ యాఖూబ్(అలైహి)ను 'ఇస్రాయీల్' అని కూడా అనేవారు. కాబట్టి ఆయన సంతతివారు 'బనీ ఇస్రాయీల్ వంశీయులు' అని పిలువ బడ్డారు. ఇస్రాయీల్ సంతతివారి ఎన్నో కుటుంబాలు ఈజిప్టులో నివసించ సాగాయి. వారి సంఖ్య పెరిగినకొద్ది ఈజిప్టులో వారొక శాశ్వత జాతిగా పరిగణించ బడేవారు. సుమారు 400 ఏండ్ల తరువాత దైవప్రవక్త హజ్రత్ మూసా(అలైహిస్స లామ్) ఈ జాతిలో జన్మించారు. ఆ 400 ఏండ్ల వ్యవధిలో ఇస్రాయీల్ సంతతి వారి స్థితి చాలా దిగజారిపోయింది. ఒకవైపు వారి విశ్వాసంలో మాంద్యం ఏర్ప డింది. ధర్మం (ఇస్లామ్) బలహీనమవసాగింది. మరోవైపు వారి ఆర్థికస్థితి క్షీణించ సాగింది. క్రమంగా అదొక బానిస జాతిలా అయిపోయింది. ఈజిప్టువారు రాజ్య మేలగా ఇస్రాయీల్ వంశీయులు వారికి సేవకులుగా, బానిసలుగా మారి పోయారు. అన్నివిధాలా హీనులైపోయారు వారు. అధికారం, సిరిసంపదలు ఈజిప్టువారి హస్తగతమయ్యాయి. వారు ఇస్రాయీల్ జాతిపై అనేక విధాలుగా జులుం చేసేవారు. అంతేకాదు, ఈజిప్టు రాజు ఫిర్ఔన్, బనీ ఇస్రాయీల్ శక్తి సామర్థ్యాలు, వారి జనాభా పెరగడాన్ని సహించలేక పోయేవాడు. వీరు అధిక సంఖ్యాకులయితే శత్రుపక్షాన చేరి తన దైవత్వ పీఠానికి ఎక్కడ ఎసరు పెడతారోనన్న భయం అతనికి ఉండేది కాబోలు. అంచేత ఆ దుష్టుడు వారి శక్తిని అణిచివేయడం కోసం వారిపై పెద్ద మొత్తంలో పన్నులు విధించడమేగాక వారిచేత అడ్డమయిన చాకిరి చేయించడం, ఇంకా పొలాలలో కఠినతరమైన పనులు చేయించి వారి జీవితం దుర్భరం, దుస్సహం చేశాడు. అంతటితో తృప్తి పడక బనీ ఇస్రాయీల్ బలం తగ్గాలంటే వారి సంఖ్యను కూడా తగ్గించాలని నిర్ణయించుకున్నాడు. ఆ దుర్మార్గుడు బనీ ఇస్రాయీల్ వారి ఇండ్లలో దాదులుగా (మంత్రసానులు) పనిచేసే స్త్రీలకు ఓ ఆజ్ఞ జారీ చేశాడు- ఆ ఇండ్లలో మగ పిల్లవాడు జన్మిస్తే వెంటనే గొంతు పిసికి చంపేయమని; ఆడపిల్ల పుడితే ఉండ నివ్వమని!

చాకిరీ చేయించుకోవడానికి బాలికలు చాలని, ఈరకంగా చేస్తే కొంత కాలానికి ఇస్రాయీల్ వంశమే నశిస్తుందని ఫిర్ఔన్ ఉద్దేశ్యం.

దీన్నిబట్టి ఆనాటి ఈ రెండు జాతుల స్థితిగతులు ఎటువంటివో అర్థం చేసుకోవచ్చు. ఓవైపు కొద్దిమంది ముస్లిములు- ఇస్రాయీల్ వంశీయులు- ఎవరి ధార్మిక విశ్వాసం అయితే సన్నగిల్లిందో, వారిలో ఎన్నో చెడులు చోటు చేసుకున్నప్పటికీ ఈజిప్టువారికి ఇష్టమయిన పంథాలో నడవడానికి వారు ఎంతమాత్రమూ సిద్ధపడలేదు. మరోవైపు దేవతల్ని పూజించే ముష్రిక్ జాతి. దేశంలో జీవించడానికి ఒకే జాతికి హక్కు గలదని, రెండో జాతివారిని ఏవిధంగానైనా తుదముట్టించాలని కృతనిశ్చయమై ఉన్న జాతి. అటువంటి అపవిత్ర లక్ష్యం కోసం ఈజిప్టువారు అన్నిరకాల కుయుక్తుల్ని ఆచరణలో పెట్టసాగారు. కొట్టడం, తిట్టడం, దోచుకోవడమైతే సరేసరి. ఇప్పుడు వారిని సమూలంగానే తుడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారు- అంతటి నాజూకు పరిస్థితులలోనూ దిగజారిపోతున్న ఒక జాతికి అల్లాహ్ ఉన్నతిని ప్రసాదించాడు. జులుం చేసేవారి శక్తిని నిర్వీర్యం చేసి పతనావస్థలో ఉన్నవారిని పైకి లేవనెత్తాడు. గర్వాంధకారంతో విర్రవీగేవారు మట్టి కరవాల్సివచ్చింది.

ఈ విషయాలన్నీ హజ్రత్ మూసా(అలైహిస్సలామ్) గాథలో వస్తాయి. ఒక జాతి హీనదశకు, క్షీణ దశకు ఎందుకు చేరుతుందో, దాన్ని అవమానం, అష్టకష్టాల నుండి కాపాడి ఐహిక ప్రపంచంలోనూ ఉన్నత శిఖరాగ్రానికి చేర్చే పరిస్థితులేవో పాఠకులకు సవివరంగా తెలియగలవు. అంతేకాదు, దైవధిక్కారానికి పర్యవసానమేమిటో సమయం వచ్చినప్పుడు ఒక అగ్రరాజ్యం ఎలా నలిపి దూరంగా గిరవాటు వేయబడుతుందో కూడా ఈ గాథలో విశదం కాగలదు.

రాజమహలులో పెంపకం

ఈజిప్టు రాజు ఫిర్ఔన్, ఇస్రాయీల్ వంశంలో మగపిల్లలు పుట్టగానే చంపివేసి వారి వంశ నాశనానికి పూనుకున్నాడు. కాని దైవలీల చూడండి- సరిగ్గా ఆ కాలంలోనే హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) జన్మించారు. ఎవరి చేతులపై

సుదూర భవిష్యత్తులో ఫిర్ఔన్ అంతం కావాల్సి ఉందో, ఎవరి శిక్షణ ద్వారా బనీ ఇస్రాయీల్ వంటి బలహీన జాతికి ప్రపంచాధిపత్యం లభించనున్నదో ఆ మహావ్యక్తే జన్మించారు. ఇంకా, మూసా(అలైహి) ఆ పట్టణంలోనే జన్మించారు- ఎక్కడయితే ఫిర్ఔన్ రాజ్యమేలుతున్నాడో, మరెక్కడయితే ఇస్రాయీల్ సంతతిని పుట్టగానే చంపివేయమనే శాసనం అమల్లో ఉన్నదో, జనన సమయంలో ఆయన తల్లి దాదిని పిలువలేదో లేక మరేం జరిగిందో గాని హజ్రత్ మూసా(అలైహిస్సలామ్) జన్మించారు. ఆయన పుట్టగానే, రాజభటులు వచ్చి పిల్లవాణ్ణేం చేస్తారో అని తల్లికి భయమేసింది. ఆమె ఈ విషయంలో చింతిస్తూ ఉండగా దైవసందేశం వినిపించింది.

"ఎంతమాత్రం భయపడవలసిన పనిలేదు. నువ్వు పిల్లవాడికి పాలు పట్టు. ఒకవేళ ఎప్పుడయినా ఎటువంటి భయం కలిగినా పిల్లవాణ్ణి నిస్సంకోచంగా నదిలో వదిలిపెట్టు, మేమతన్ని తిరిగి నీ ఒడిలోనే చేర్చనున్నాము. ఇంకా అతణ్ణి దైవప్రవక్తగా చేయనున్నాము."

ఈ సందేశం విన్నాక హజ్రత్ మూసా(అలైహి) తల్లి మనసు కాస్త కుదుటపడింది. ఆమె అల్లాహ్‌పై భారం వేసి పిల్లోణ్ణి ఒక పెట్టెలో పడుకోబెట్టి నదిలో విడిచిపెట్టేసింది. వెంటనే తన కూతురితో (హజ్రత్ మూసా(అలైహి) అక్కతో), "చూడమ్మా, నీవు నది ఒడ్డునే నడుస్తూ, ఈ పెట్టె ఎక్కడకు పోతుందో గమనించు". మూసా (అలైహి) సోదరి నది ఒడ్డు నుండి నదిలో పోతూ ఉన్న ఆపెట్టెను అనుసరించసాగింది.

ఆ పెట్టె నదిలో ప్రవహిస్తూ పోయి ఫిర్ఔన్ మహలును సమీపించింది. ఫిర్ఔన్ సేవకులు ఆ పెట్టెను ఒడ్డుకు తీసుకువచ్చి పెట్టెను తెరచి చూడగా లోపల ఓ చిన్నారి బాబు కేరింతలు కొడుతున్నాడు. ఆ బాలుడు ఎవరి పిల్లవాడో వారికి తెలీదుగా! పిల్లవాణ్ణి ఎత్తుకుని మహలులోనికి తీసుకువెళ్ళారు. ఆ పిల్లవాడు ఇస్రాయీల్ సంతతికి చెందినవాడు కావచ్చు అన్న అనుమానం ఫిరౌన్‌కు కలిగింది. బాలుణ్ణి చంపివేయాలని నిశ్చయించాడు. కాని ఫిర్ఔన్

భార్య అందగస్తుడయిన ఆ బాలుణ్ణి చూసి ముచ్చట పడింది. బహుశా ఆమెకు పిల్లలు లేరేమో, ఆ బాబును పెంచుకోవాలని ఉబలాటపడింది. ఆమె ఫిర్‌ఔన్‌తో, "చూడండి! ఈ పిల్లోడు మన కంటి వెలుగులా అగుపిస్తున్నాడు. ఇతణ్ణి చంపనక్కరలేదు. వీడి వల్ల మనకేదయినా లాభం చేకూరవచ్చు లేదా మనమే ఇతన్ని పెంచుకోవచ్చు" అంది.

ఎవరిని పెంచుకోవాలని తలపోస్తున్నారో వారికేం తెలుసు? ఒక పక్క ఫిర్‌ఔన్‌కు తానే దైవాన్ననే అభిప్రాయం ఉంది. మరోవైపు అతడు భవిష్యత్తులో తన వంశపార్యంపర్య దైవత్వభాండం బద్దలుకొట్టబోయేవాణ్ణి, ఫిర్‌ఔన్ పదవికే చరమగీతం ఆలపించేవాణ్ణి తన మహలులోనే పెంచుకోవడానికి సిద్ధమవుతున్న విషయం ఫిర్‌ఔన్ గ్రహించకపోవడం గమనార్హం.

దేవుడు చేసే ఏర్పాట్లు కూడా బహు విచిత్రంగా ఉంటాయి. ఆయన ప్రజ్ఞను ఎవరెరుగు? ఏ ప్రభుత్వాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలో, బూటకపు దైవత్వ దర్పాన్ని ఎలా అణచాలో, దానికి ఎటువంటి అంతర్గత విషయ పరిజ్ఞానం కావలసి ఉందో అదంతా హజ్రత్ మూసా(అలైహి)కెలా లభ్యమవుతుంది? ఇస్రాయీల్ వంశీయులు ఈజిప్టులో అత్యంత అధములుగా పరిగణించబడు తున్న రోజుల్లో ఆయన బాల్యం, పోషణ ఏర్పాటు రాజమహలులోనే గనక జరగకపోతే దేశ రాజకీయాలు, రాజుగారి అంతరంగిక విషయాలు తెలుసుకునే అవకాశం బనీ ఇస్రాయీల్ కుర్రవాడికి ఎలా లభిస్తుంది!?

ఇటు ఫిర్‌ఔన్ , అతని భార్య ఆ పిల్లవాణ్ణి పెంచుకునేందుకు నిశ్చ యించుకున్నారు. అటు, మూసా(అలైహి) తల్లికి, తన బాబును రాజమహలులోకి తీసుకెళ్ళారని తెలియగానే ఆమెలో ఆరాటం ఎక్కువ కాసాగింది. అల్లాహ్ ఆమెపై అసాధారణ కరుణ చూపి ఆదుకున్నాడు గనక సరిపోయింది. లేకపోతే, కడుపు తీపి కొద్దీ ఆమె అన్నీ మరిచిపోయి, 'ఈ పిల్లవాడు నా కొడుకే' అని చెప్పివేసేది. అల్లాహ్ ఆమెకు ఓర్పునూ, సహనాన్ని ప్రసాదించాడు. ఆమె ఎంతో ఓరిమి వహించినా, ఫిర్‌ఔన్ మనుషులు పిల్లవాడిని ఏం చేశారో, కాస్త చూసి రమ్మని తన కూతురిని పురమాయించింది.

ఇక అల్లాహ్ చేసే ఏర్పాట్లు చూడండి. రాజు, రాణి పిల్లవాణ్ణి పెంచుకోవాలని నిశ్చయించుకోగానే ఆ పసికందుకు పాలు పట్టే స్త్రీకోసం అన్వేషణ ప్రారంభమయింది. ఎందరో స్త్రీలు వచ్చారు. కాని పిల్లవాడు ఎవరి పాలనూ ఇష్టపడలేదు. ఈ విషయం మూసా(అలైహి) సోదరికి తెలిసింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. "మీ కోసం పిల్లవాణ్ణి ప్రేమాదరాలతో పెంచే కుటుంబాన్ని వెతకమంటారా?" అని ఆమె అడిగింది.

ఫిర్‌ఔన్ మనుషులు ఆ ఆదుర్దాతోనే ఉన్నారు కదా! వెంటనే ఒప్పుకున్నారు. మూసా(అలైహి)గారి తల్లి పాలు త్రాగించేందుకు పిలువబడింది. ఇక ఆవిధంగా మూసా(అలైహి) తిరిగి తన తల్లి ఒడిలోకి చేరుకున్నారు. ఆ తల్లి కళ్ళు చల్లబడ్డాయి. ఆమె దుఃఖం దూరమయింది. అల్లాహ్ వాగ్దానం ఎంత సత్యమయినదో ఆమెకూ తెలిసివచ్చింది.

హజ్రత్ మూసా(అలైహి) రాజమహలులో పెరగసాగారు. రాకుమారుల్లాగా ఆయనకు విద్యాబుద్ధులు గరిపే ఏర్పాట్లు జరిగాయి. పెరిగి పెద్దవారయ్యారు. కాని ఆయనపై రాజమహళ్ళలోని దురలవాట్లు ఏవీ అబ్బలేదు. రాకుమారులకు సర్వసాధారణంగా సంక్రమించే ఏ దురలవాటూ ఆయన దరిచేరలేదు.

ఇదంతా అల్లాహ్ అసాధారణ కరుణా కటాక్షాల ఫలితమే. హజ్రత్ మూసా(అలైహి) దైవప్రవక్త కానున్నారు. కనుకనే ఆయనకు ప్రసాదించబడిన మేధోసంపత్తి, ఉన్నత ప్రవర్తనల ద్వారా కేవలం సత్ప్రభావమే ఆయనపై పడింది. రాజకుటుంబాలలో పెరిగేవారిలో సర్వసాధారణంగా జనించే చెడులకు ఆయన పూర్తిగా దూరమయ్యారు.

ఖిబ్తీ హత్య

మూసా(అలైహి) పెరిగి పెద్దవారయ్యారు. ఒకరోజు రాత్రి అయన అందరూ నిద్రకు ఉపక్రమించే వేళ బజారుకు ఏదో పనిమీద వెళ్ళారు. ఒకచోట

ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడటం చూశారాయన. వారిని సమీపించగా వారిలో ఒకడు తన జాతికి చెందినవాడు, మరొకడు ఫిర్ఔన్ జాతికి చెందినవాడు. హజ్రత్ మూసా(అలైహి) జాతికి చెందిన ఇస్రాయీలీయుడు ఆయన్ని చూడగానే ఫిర్యాదు చేశాడు- తరతరాలుగా ఫిర్ఔన్ జాతికి చెందినవారు- ఖిబ్తీలు[1] ఇస్రాయీల్ వంశస్థుల్ని బాధిస్తూనే ఉన్నారుగదా, ఆ ఇస్రాయీల్ వంశస్థుడు మొరపెట్టుకోగా హజ్రత్ మూసా(అలైహి) తన జాతికి చెందిన వ్యక్తిపై జులుం జరుగుతుందని తలపోశారు. ఖిబ్తీని దుష్టుడుగా భావించి అతన్ని ఒక్క గుద్దు గుద్దారు. ఆ దెబ్బకు ఖిబ్తీ నేలకూలాడు. ఇస్రాయీలీయుడిపై దౌర్జన్యం జరుగుతున్నదని భావించిన హజ్రత్ మూసా(అలైహి) ఖిబ్తీని శిక్షించే ఉద్దేశ్యంతో కొట్టారేగాని వాణ్ణి చావ గొట్టాలన్న ఉద్దేశ్యం ఆయనకు ఎంత మాత్రం లేదు. ఖిబ్తీ చనిపోయి నందుకు ఆయన ఎంతో విచారించారు. ఆ తర్వాత తెలిసింది అసలు సంగతి- ఖిబ్తీ చేసిన తప్పేమీ లేదు, తప్పంతా ఇస్రాయీలీయునిదేనని. ఆయన మరింత కృంగి పోయారు. ఆయన గద్గద స్వరంతో, "నా వల్ల ఒక షైతాన్ చేష్ట జరిగి పోయింది." అంటూ వెంటనే అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరారు. తౌబా చేశారు (పశ్చాత్తాపం చెందారు) "ఓ ప్రభూ! ఇంకెప్పుడూ ఏ నేరస్తుణ్ణి సమర్థించను. నీవు నన్ను క్షమించి నాపై దయ చూపావు."

అల్లాహ్ మానవుల మనసుల్లోని మర్మం ఎరిగినవాడు. మూసా(అలైహి) ఉద్దేశపూర్వకంగా హత్య చేయలేదని ఆయనకు తెలుసు. యాదృచ్ఛికంగా అపోహపడినందువల్లనే ఇలా జరిగింది కనుకనే దైవం ఆయన మన్నింపును స్వీకరించి ఆయన తప్పిదాన్ని క్షమించాడు.

మరునాడు కూడా మూసా(అలైహి) బజారుకు వెళ్ళినప్పుడు ఆ ఇస్రాయీలియుడే మరో వ్యక్తితో ఘర్షణ పడుతున్నాడు. అతను మళ్ళీ మూసా (అలైహి) సహాయం కోరాడు. "నువ్వొక జగడాలమారివి, ప్రతి ఒక్కరితో పోట్లాడుతావు" అన్నారు మూసా(అలైహి).

1. ఈజిప్టులోని ప్రాచీనుల్ని ఖిబ్తీలు అని అంటారు.

మూసా (అలైహి) వారి తగవుకు కారణం ఆరాతీయుగా ఈ రోజు ఇస్రాయీల్ వంశస్థునిపైనే దౌర్జన్యం జరిగిందని తెలిసింది. ఖిబ్తీ దౌర్జన్యం చేస్తున్నాడు. మూసా(అలైహి) బాధితుడికి సహాయపడే ఉద్దేశ్యంతో అడుగు ముందుకు వేశారు. ఇస్రాయీల్ వంశీయుడు బహుశా మూసా(అలైహి) తననే కొట్టవస్తున్నారని భావించి కంగారుగా, "ఏయ్ మూసా! నిన్న ఒక మనిషిని చంపినట్లే నన్ను కూడా చంపాలనుకుంటున్నావా? నీ ధోరణి చూస్తుంటే, దేశంలోకెల్లా పెద్ద దుండగునిగా కావాలని నువ్వు నిశ్చయించుకున్నట్లుంది. (ప్రజల్ని) సంస్కరించాలన్న ఉద్దేశ్యమే నీకు లేనట్లుంది" అన్నాడు. అతనా మాటలు అనగానే ఖిబ్తీకి, అంతకుముందు రోజు జరిగిన హత్యకు కారకులెవరో తెలిసిపోయింది. ఈ విషయం నిమిషాల్లో ఊరంతా ప్రాకిపోయింది.

మూసా(అలైహి)కు తామంటే ఇష్టంలేదని ఆయన ప్రవర్తన ద్వారా ఫిర్ఔన్ దర్బారువారు గమనించి ఉండవచ్చు. ఫిర్ఔన్‌కు కోపం కలిగించడానికి మూసా (అలైహి) చేసిన ఈ ఒక్క పని చాలు. రాచకుటుంబానికి చెందిన ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ఇస్రాయీల్ జాతివాణ్ణి- బానిస జాతివాణ్ణి- మూసా(అలైహి) సమర్థించడాన్ని వారు సహించలేకపోయారు.

దీని సాకుతోనే మూసా(అలైహి)ను తుదముట్టించాలని ఫిర్ఔన్ అంతరంగీకులు పన్నాగాలు పన్నసాగారు. కాని చెడ్డవాళ్ళున్న చోటే ఎవరో ఒకరు మంచివారు కూడా ఉండకపోరు. వారిలోని వాడే అయిన ఒక వ్యక్తి- పురుషులందు పుణ్య పురుషులు వేరయా అన్నట్లు- మూసా(అలైహి)లోని సద్గుణాలను తెలిసినవాడవటం వల్ల, ఈ హత్య స్వరూప స్వభావాలు కూడా ఎరిగినవాడు గనక హుటాహుటిన హజ్రత్ మూసా(అలైహి) వద్దకు వెళ్ళి ఫిర్ఔన్ దర్బారులో జరిగే కుట్రను గురించి ఆయన చెవిన వేశాడు. "ఫిర్ఔన్ సలహాదార్లు నిన్ను తుద ముట్టించాలని కుట్రపన్నుతున్నారు. నేను నీ శ్రేయాన్ని కాంక్షించేవాడిని గనక చెబుతున్నాను. నా సలహా మేరకు నువ్వు పట్టణం విడిచి దూరంగా ఎక్కడికైనా పారిపో".

మూసా(అలైహి) ఇది విన్న వెంటనే ఆ నగరం విడిచిపెట్టారు. వెనుక నుంచి ఎవరయినా వచ్చి పట్టుకుంటారేమో అని భయపడ్డారు. అల్లాహ్‌ని ఈవిధంగా ప్రార్థించారు.

"ఓ ప్రభువా! ఈ దుష్టుల బారి నుండి నన్ను రక్షించు."

నిజమే, విశ్వాసి అన్నివేళలా అల్లాహ్‌నే ఆశ్రయిస్తాడు.

మద్‌యన్(యమన్)లో శిక్షణ

మూసా(అలైహి) ఈజిప్టు నుండి బయలుదేరి మద్‌యన్ (యమన్) వైపుకు సాగిపోయారు. ఈ ప్రదేశం ఎర్ర సముద్రానికి తూర్పు వైపున, ఫిర్‌ఔన్ రాజ్యానికి వెలుపల ఉంది. ఇక్కడ నివసిస్తున్నవారు హజ్రత్ ఇబ్రాహీమ్(అలైహి) వంశానికి చెందినవారే. ఆవిధంగా వారు హజ్రత్ మూసా(అలైహి)కు దగ్గరి బంధువులే. అందుకే కాబోలు, ఆయన తగిన ప్రదేశంగా నిర్ణయించుకున్న ఈ ప్రాంతాన్ని చేరుకోవడానికి ఆయత్తమయ్యారు. మూసా(అలైహి) ఒంటరిగా పయనమయ్యారు. తోడుగాని, సహాయకులుగాని ఎవరూ లేరు. పైగా శత్రువు వెనుక నుండి వచ్చి చుట్టుముట్టే భయం అనుక్షణం వెంటాడుతోంది. కాని హజ్రత్ మూసా(అలైహి) హృదయంలో, "నా ప్రభువు నన్ను సరయిన మార్గం (సన్మార్గం)లోనే నడిపిస్తాడు" అనే విశ్వాసం దృఢమైంది. అందుకే నిస్సంకోచంగా ముందుకు సాగారు.

అలా నడుస్తూ నడుస్తూ ఆయన మద్‌యన్(యమన్)కు చెందిన ఒక బస్తీ సమీపానికి చేరుకున్నారు. అక్కడ ఒక బావి ఉంది. బావి వద్ద చాలామంది గుమిగూడి తమ తమ పశువులకు నీరు త్రాగిస్తూ ఉన్నారు. అక్కడే కాస్త దూరంలో ఇద్దరు బాలికలు తమ పశువుల్ని నిలబెట్టి నిరీక్షిస్తూ కనిపించారు. మూసా(అలైహి) వారితో, "ఏం మీరిలా దూరంగా ఎందుకు నిలబడ్డారు?" అనడిగారు.

"ఈ పశువుల కాపరులు వారి పశువుల్ని నీరు త్రాగించనిదే మేమెలా త్రాగించగలం? వారికంటే మేము బలహీనులము, మా నాన్నగారు కూడా ముసలివారు" అన్నారా బాలికలు.

బలవంతులు, బలహీనుల హక్కులను దోచుకోవడాన్ని హజ్రత్ మూసా (అలైహి) చూచి సహించలేకపోయారు. వెంటనే ఆయన ఆ పశువులను బావి దగ్గరకు తీసుకెళ్ళి నీరు త్రాగించారు. పశువులు నీరు త్రాగాక ఆయన దగ్గర్లోని ఒక చెట్టు నీడను ఆశ్రయించి తన ప్రభువుతో, "ఓ ప్రభూ! నీవు నా వైపు పంపే శ్రేయస్సును కాంక్షిస్తున్నాను" అని వేడుకున్నారు.

చూడ్డానికిది చాలా చిన్న విషయమే. దైవప్రవక్త మూసా(అలైహి) బలహీనులయిన బాలికలకు సాయపడ్డారు. వారి పశువులకు నీరు త్రాగించారు సరే! అదొక సత్కార్యం చేశారు. అయితే కాస్త సావధానంగా ఆలోచించినట్లయితే, అల్లాహ్ ఈ చిన్న విషయం ప్రసక్తి తీసుకువచ్చి ఒక పెద్ద వాస్తవాన్ని మానవులకు స్పష్టం చేశాడని అర్థమవుతుంది. మొదటి విషయం; గాలి, నీరు, సూర్యరశ్మి, వర్షం, సముద్రాలు, కొండలు, దానంతట అదే మొలిచే గడ్డి, అడవులు, భూమి లోని నిక్షేపాలు మొదలగునవి దైవప్రసాదితాలు గనక, వాటిని అనుభవించడానికి మానవుడు ఎలాంటి శ్రమ పడనవసరంలేదు. కనుక అవి ఓ ప్రత్యేక వ్యక్తి యొక్క వ్యక్తిగత ఆస్థి కాకూడదు. ఇలాంటి పదార్థాల పంపకంలో "కర్ర గలవాడిదే బర్రె" అనే సిద్ధాంతం సరయినదికాదు. ఇవి సాధారణంగా మానవుల అవసరాలను బట్టి పంపకం కావాలి. కాని కల్లోలం అసలు ఇక్కణ్ణుంచే ఆరంభమవుతుంది. తమ కున్న బలంచేత కొందరు వ్యక్తులు దైవానుగ్రహాల్ని చేజిక్కించుకుని, ఇతరుల హక్కుల పట్ల నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. దైవసమ్మతమైన జీవన వ్యవస్థ మాత్రమే మానవుల్ని ఈ శాపం నుండి విముక్తిని ప్రసాదిస్తుంది. మూసా(అలైహి) భవిష్యత్తులో ఇటువంటి వ్యవస్థనే సుస్థాపితం చేయవలసి ఉంది. అందుచేతనే బలవంతులు బలహీనుల హక్కుల్ని దోచుకోవడాన్ని ఆయన సహించలేక పోయారు.

ఆ బాలికలు ఇంటికి వెళ్లి తండ్రికి జరిగిన విషయమంతా వివరించారు. కృతజ్ఞతాభావం వెల్లివిరియగా తమ కుమార్తెలకు సహాయపడిన ఆ సానుభూతి పరుణ్ణి కలుసుకోవాలని తలచాడా తండ్రి. ఆ యువకుణ్ణి తన దగ్గరికి పిలుచుకు రమ్మని ఒక అమ్మాయిని పంపారు. ఆ బాలిక మూసా(అలైహి) దగ్గరకు వచ్చి, "మా పశువులకు నీరు త్రాగించి మాకు చేసిన మేలుకు కృతజ్ఞతగా ప్రతిమూల్యం చెల్లించేందుకు మా నాన్నగారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అన్నది.

మూసా(అలైహి) ఆ బాలిక వెంట నడిచారు. ఆ బాలికల తండ్రితో తన గాధనంతా చెప్పుకున్నారు. అంతా విని ఆయన "మీరేమీ భయపడనవసరం లేదు. నిశ్చింతగా ఉండండి. ఇక మీరు ఆ దుర్మార్గుల కబంధ హస్తాల నుండి విముక్తి పొందినట్లే" అన్నారు.

వారి ఇంటనే మూసా(అలైహి) కొన్నాళ్ళు ఆగారు. ఒకరోజు ఇద్దరు కుమార్తెలలో ఒకామె తండ్రితో, "ఆ యువకుణ్ణి మన వద్ద ఎందుకు కొలువు ఉంచుకోరాదూ! పైగా బలవంతుడూ, అమానతుదారుడు అయిన నౌకరే కదా మనకు కావాల్సింది!!" అన్నది. ఈ ప్రతిపాదన ఆ తండ్రికి ఎంతో నచ్చింది. ఆయన బాగా ఆలోచించి ఒక మంచి నిర్ణయానికి వచ్చారు. ఓరోజు ఆయన మూసా(అలైహి)తో అన్నారు, "నా ఇద్దరమ్మాయిలలో ఒకామెను నీకిచ్చి నికాహ్ (వివాహం) జరిపించాలనుకుంటున్నాను. అయితే ఒక షరతు, నువ్వు ఎనిమిదేండ్లు నా దగ్గర ఉద్యోగం చేయాలి. ఒకవేళ పదేళ్ళు గనక పూర్తిచేస్తే నువ్వు నాకు మేలు చేసినవాడవవుతావు. అలా అని నీపై ఎక్కువ భారం వెయ్యడం నాకు ఇష్టం లేదు కూడా. దైవచిత్తమయితే ఈ వ్యవధిలో నీవు నన్నొక మంచి మనిషిగా గుర్తిస్తావు. హజ్రత్ మూసా(అలైహి) ఆ పెద్దాయన చేసిన ప్రతిపాదనకు తన అంగీకారం తెలుపుతూ, "మనిద్దరి మధ్య ఈ ఒప్పందాన్ని నేను అంగీకరిస్తున్నాను. ఈ రెండు గడువుల్లో మీరు కోరిన గడువును పూర్తి చేయడానికి నాకేమీ అభ్యంతరం లేదు. మనం ఏ ఒప్పందమయితే కుదుర్చుకుంటున్నామో దానికి అల్లాహ్‌ను సాక్షిగా చేసుకుందాం. ఆయన మీదే మనకు విశ్వాసం" అన్నారు.

ఆ బాలికల తండ్రి దైవప్రవక్త హ్రజత్ షుఐబ్(అలైహి)యే అని అంటారు. అల్లాహ్ చేసే ఏర్పాట్లు చూడండి! ఇప్పటివరకు మూసా(అలైహి)ను ఫిర్ఔన్ దర్బారులో పెంచాడు. దేశ రాజకీయ వ్యవహారాల్ని, అందలి మెలకువల్ని నేర్చుకునే అవకాశం ఆయనకు కల్పించాడు. ఇక ఇప్పుడు మరో ఎనిమిది లేక పది సంవత్సరాలు మరొక ప్రవక్త సహచర్యంలో గడిపే వీలు కల్పించాడు. వాస్తవానికి ఈ 8 లేక 10ఏళ్ళ వ్యవధి కేవలం మేకల్ని, ఒంటెల్ని మేపడానికి మాత్రమే కాదు. అల్లాహ్ తన ఏ ఉన్నత కార్యం కొరకయితే హ్రజత్ మూసా(అలైహి)ను ఎన్నుకున్నాడో దానికోసం ఆయన్ని సన్నద్ధం చేయవలసి ఉన్నది. ఇదొక తర్ఫీదు కాలమన్న మాట.

దైవదౌత్యం

హ్రజత్ మూసా(అలైహి) నౌకరీ చేయవలసిన గడువు పూర్తయింది. వివాహం కూడా జరిగిపోయింది. అప్పులు ముఖ్యంగా సోదరుడు హారూన్ (అలైహి)ను చూడాలని మనస్సు తహతహలాడింది. దాంతో మూసా(అలైహి) స్వదేశం వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. మామగారి అనుమతితో, భార్య వెంటరాగా ఈజిప్టుకు పయనమయ్యారు. దారిలో ఒక అద్భుత సంఘటన-

చీకటి రాత్రి, మంచు బాగా కురుస్తోంది. ఎటు వెళుతున్నారో దారి తెలియటం లేదు. అకస్మాత్తుగా ఆయనకు కొండ మీద అగ్ని మంట కనిపించింది. ఆయన తన అర్థాంగితో, "నువ్విక్కడే ఉండు, నేను వెళ్ళి కొద్దిసేపట్లో నిప్పు తీసుకువస్తాను. దాంతో నువ్వు చలి కాచుకోవచ్చు. ఆ మంట దగ్గర ఎవరయినా కనబడితే బహుశా దారి కూడా తెలుసుకోవచ్చు" అని ఆమెను అక్కడే విడిచి మంట కనబడిన వైపుకు వెళ్ళారు.

హ్రజత్ మూసా(అలైహి) నిప్పు తెచ్చుకోవాలన్న ధ్యాసతో ముందుకు సాగిపోతున్నారు. దైవధర్మాన్ని గురించి ఆయనకు ఏ మాత్రం తెలియదు. నిజమే, తనకు ప్రవక్త పదవి లభించనుంది అని ఆయనకు మాత్రం ఏం తెలుసు? మంట

ఎదురుగా కనబడుతోంది. దగ్గరగా వెళ్ళేసరికి ఎవరో పేరు పెట్టి పిలిచారు, "ఓ మూసా!" అని. ఆయన ఉలిక్కిపడ్డారు. తెలిసినవారు ఎవరూ లేనిచోట, నన్నెరిగినవాళ్ళు, పేరుపెట్టి పిలిచేవాళ్ళు ఎవరయివుంటారా? అని ఆలోచనలో పడ్డారు. అంతలో మరోసారి అదే పిలుపు!

"మూసా! నీ ప్రభువును నేనే. పాదరక్షలు విడువు. ఇప్పుడు నీవు పవిత్ర మైన తువా లోయలో ఉన్నావు. ఇటు చూడు! నిన్ను ప్రవక్త పదని కోసం ఎన్ను కున్నాను. ఇప్పుడు నేను చెప్పేదంతా సావధానంగా విను.

"నేనే అల్లాహ్‌ను, నేను తప్ప ఆరాధనీయులు ఎవరూ లేరు. కాబట్టి నన్నే ఆరాధించు.

"నా స్మరణ కోసం నమాజ్‌ను స్థాపించు."

"ఖియామత్ (తుది దినం) తప్పక వస్తుందని నమ్ము. కాని నేను ఆ విషయాన్ని గుప్తంగా ఉంచాను. తద్వారా ఎవరు ఎలా పనిచేస్తారో తెలిసిపోవాలని అలా చేశాను."

"మరణానంతరం ప్రతి వ్యక్తికి అతని కర్మల ప్రతిఫలం ఇవ్వబడు తుంది."

"ఇంకా విను, ఒకవేళ ఎవరయితే ఆరోజు వస్తుందని విశ్వసించరో, తమ కోర్కెలకు దాసులై ఉంటారో, వారు నా ఆరాధనా విధేయతల నుండి నిన్ను నిరోధిస్తారేమో!"

"ఒకవేళ నువ్వలా చేస్తే, నాశనమైపోతావు." (సూరయె తాహా)

మూసా(అలైహి) ఆ మాటలు విన్నారు. తనకు ఎటువంటి గౌరవోన్న తులు ప్రసాదించబడుతున్నాయో గ్రహించారు. మానవులందరిలో తనకు ఎంతటి అత్యున్నత స్థానం లభించబోతున్నదో, దాంతోపాటు తనపై మోపబడు తున్న బాధ్యత ఎటువంటిదో కూడా ఆయన తెలుసుకున్నారు. హజ్రత్ మూసా (అలైహి) మౌనంగా నిలబడి వినసాగారు.

ఒకవేళ ఆయనతో సూటిగా ఒక ప్రశ్న వేయబడకుండినట్లయితే బహుశా ఆయన అలాగే మౌనదశలో నిలబడి ఉండేవారేమో!

సరే, అల్లాహ్ ప్రశ్న, దానికి మూసా(అలైహి) జవాబు చదివేముందు, కాస్త ఆ వహీ(దైవ సందేశం) ఏమిటో తెలుసుకుందాం. మూసా(అలైహి)ను ఎన్నుకుని, ఆయన ద్వారా ఇతర మానవాళికి అందజేయబడనున్న ఆ దివ్య సందేశాన్ని అర్థం చేసుకుందాం.

అన్నింటికన్నా ముందు, ఈ శబ్దం ఎవరిదో, ఎక్కణ్ణుంచి వస్తున్నదో పరి చయం చేయబడింది. ఇంకా మూసా(అలైహి) నిలబడి ఉన్న స్థలం ఏ ప్రాంతం లోనిదో తెలుపబడింది. దివ్యఖుర్ఆన్‌లో మరొక చోట ఇదే విషయాన్ని ఇలా కూడా ప్రస్తావించడం జరిగింది.

ఆయన మంటకు దగ్గరగా వెళ్ళినప్పుడు ఇలా వినబడింది: "మంట దగ్గర ఉన్నవానికి, ఇంకా, ఇదంతా జరుగుతున్న ఆ పరిసర ప్రదేశానికి శుభం కలుగుగాక!

"ఇహపర లోకాల ప్రభువైన అల్లాహ్ అన్నిరకాల చెడుల నుండి పవిత్ర మయినవాడు - ఓ మూసా! నిన్ను పిలుస్తున్నది నేనే- నేనే అల్లాహ్‌ని, గొప్పవాణ్ణి, అత్యంత వివేకవంతుణ్ణి".

ఈ పరిచయం తర్వాతే, ముమ్ముందు చెప్పబడే విషయానికి ప్రాముఖ్యత లభిస్తుంది. ఇక్కడ దేవుడు మూసా(అలైహి)కు ఒక కార్యం అప్పగిస్తున్నాడు. తనకు వినయ విధేయతలు ప్రకటించమని అడుగుతున్నాడు. వినేవాడు చెప్పేవాణ్ణి గుర్తించనట్లయితే ఆ మాటలన్నీ అర్థరహితమే.

ఇక్కడ మరో విషయం కూడా గమనించండి. భూమ్యాకాశాలు, సూర్య చంద్రులు, గాలి, మేఘం, వర్షం, భూమిపై మొలిచే మొక్కలు, పశువులు, పక్షులు, క్రిమికీటకాలు, స్వయంగా మానవుని ఉనికి, అతని శరీర నిర్మాణం, అతని మనుగడకు కావలసిన ఆధారాలు, అతని ఆహార సామగ్రి, నీరు గాలి ఒకటేమిటి సృష్టిలో అణువణువు కూడా సాక్ష్యమిచ్చే విషయమేమంటే-

ఇదంతా (సృష్టి)తనకుతానుగా ఉనికిలోనికి రాలేదు, దాని సృష్టికర్త ఒకడున్నాడు. ఈ సృష్టి అంతా ఎంత చక్కగా, మరెంత నియమబద్ధంగా నిర్వ ర్తించబడుతున్నదో గమనిస్తే, ఈ విశ్వ వ్యవస్థను నడిపేవాడు, దాని నియమా వళిని రూపొందించిన వాడు అసాధారణ శక్తిసంపన్నుడని, అసామాన్య వ్యూహ రచనా గరిష్టుడని ఒప్పుకోక తప్పదు. సృష్టికర్త, యజమానిని గుర్తించే, తెలుసు కునేందుకు అవసరమైన సామగ్రి ప్రతి మానవునికి అతని చుట్టుప్రక్కల ఎంతగా వ్యాపించి ఉన్నదంటే, అతడు ఏ విధమయిన శిక్షణ, సలహాల ప్రమేయం లేకుండానే అతని మస్తిష్కంలో ప్రభువు, యజమాని యొక్క భావన ఏ కాస్తయినా వచ్చి తీరుతుంది. ఆలోచించవలసిన విషయమేమంటే, ఒక వ్యక్తిపై ఎల్లప్పుడూ దేవుని కరుణాకటాక్షాల వర్షం వర్షిస్తూ ఉంటే అతను ఇదంతా ఏర్పాటు చేసేవారెవరూ లేకుండానే జరుగుతున్నదని భావించడంగాని, ఒకరి పోషణకు కావలసిన ఏర్పాటు, ఆలోచించినకొద్దీ సంభ్రమాశ్చర్యాలు కలిగే అద్భుత రీతిలో జరుగుతూ ఉంటే, అతడు ఇదంతా ఏ పరిపోషకుడు లేకుండానే జరుగుతున్నదనే నిర్ణయానికి రావడంగాని, లేదా సృష్టిలోని ప్రతి వస్తువూ, ఒక నియమానికి లోబడి, ఒక నిర్ణీత విధానం ప్రకారం పని చేస్తూ ఉండటాన్ని చూసిన వ్యక్తి ఇదంతా ఏ ప్రభువూ, ఏ నిర్వాహకుడూ లేకుండానే దానంతట అదే నడుస్తోందని అనుకోవడం మానవ స్వభావానికే వ్యతిరేకం. ఈ కారణం చేతనే ప్రతికాలంలోనూ మానవుడు ఈ సత్యాన్ని గుర్తించాడు, కనుగొన్నాడు. మానవుడు తన మనోకాంక్షలకు బానిసై లేదా తన భావోద్రేకాలకు లోనై కేవలం మంకుతనం కారణంగా తిరస్కరిస్తే అది వేరే విషయం. మానవుడికి దేవుని అస్తిత్వం గురించి సరయిన పరిచయం కావడానికి ఇప్పటివరకు అడ్డు, అవరోధం అవుతూ వచ్చిన విషయమేమన్నా ఉన్నదా అంటే అది మానవుని వికృత కోరికలు, తప్పుడు భావోద్రేకాలే. కొందరు దేవుని ఉనికినయితే అంగీ కరిస్తారు. కాని అలా దైవాన్ని అంగీకరించినందున అతనికి ఇష్టమయిన పనిని చేయవలసి వచ్చినప్పుడు వారు ఒకవైపు దైవాన్ని విశ్వసిస్తూనే, మరోవైపు తమ వికృత కోరికలను, దుష్ట ఆశయాలను కూడా నెరవేర్చుకుంటున్నారు. లేదా అసలు దైవాన్నే తిరస్కరిస్తారు.

మొదటి తరహా ఆచరణ వల్ల తప్పుడు మతం ఆవిర్భవిస్తే, రెండో తరహా ఆచరణ వల్ల నాస్తికత్వం లేదా భౌతిక ఆరాధన ఉనికిలోనికి వచ్చింది.

దేవుని పరిచయం, గుర్తింపు కోసం ప్రతి మానవుడికి తన బుద్ధీజ్ఞానాలను బట్టి, ఈ సృష్టిలో నలువైపులా సమకూర్చబడి ఉన్న నిదర్శనాలు ముక్తసరిగా దైవత్వ స్వరూపాన్ని సూచిస్తాయి. కాని ఇది మాత్రమే చాలదు. ఆయన ఉనికి, ఆయన గుణవిశేషాల అసలు జ్ఞానం దీని ద్వారా ప్రాప్తం కాదు. అల్లాహ్ తన దాసులపై ఎంతటి దయగలవాడంటే ఆయన వారి సౌలభ్యం కోసం కోట్లాది ఏర్పాట్లు చేశాడు. ఆయన మరో కష్టమైనదాన్ని కూడా సులభతరం చేశాడు.

తన దాసుల కోసం ఆయన తాను పరిచయం చేసిన మానవులలో నుండే కొందరిని ఎన్నుకున్నాడు. వారికి సద్బోధల వెలుగును ప్రసాదించాడు. వారే దైవప్రవక్తలు. వారి ద్వారానే మానవుడు దేవుని అస్తిత్వాన్ని, గుణవిశేషాల సరయిన జ్ఞానాన్ని పొందగలుగుతాడు. అప్పుడే ఆయన ప్రసన్నత, అప్రసన్నతల విషయాల్ని తెలుసుకోగలడు.

అల్లాహ్ హజ్రత్ మూసా(అలైహి)కు అందరికంటే ముందు ఆ పరిచయ భాగ్యాన్నే అనుగ్రహించాడు. ఇంకా, "మేము నిన్ను ఒక ప్రత్యేక కార్యం కొరకు ఎన్నుకున్నాము, ఇక దానికోసం నడుం బిగించు. దానికి సంబంధించిన అవసర మైన సూచనల్ని విను" అనే శుభవార్త ఆయనకు విన్పించబడింది.

అన్నింటికంటే ముందుగా ఆయనకు ఇవ్వబడిన సూచన ఎంత ముఖ్యమైనది!

ఆ సేవ ఏమిటో, దేనికోసమయితే మూసా(అలైహి) ఎన్నుకోబడ్డారో, మున్ముందు వివరంగా తెలియగలదు-

ఒకవైపు :

- ఫిర్ఔన్ యొక్క తిరుగుబాటు (దైవతిరస్కార) వైఖరి మానవుణ్ణి మాన వుడికే దాసునిగా చేసింది. అతని మంత్రి హామాన్ ద్వారా వ్యాప్తిలోకి

తేబడిన (తప్పుడు) మతతత్వపు వలలో మానవుని శరీరమే కాదు, అతని ఆత్మ సయితం చిక్కుకుని ఉంది -ఇంకా

- జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ క్రింద మానవత విలవిల్లాడుతోంది. ఆ శాపానికి ప్రతినిధి-ఖారూన్- ప్రజాకంటకుడయ్యాడు.

రెండోవైపు :

ఒక పీడిత జాతి- మార్గభ్రష్టతకు గురయిన ముస్లిమ్ జాతి- స్వదేశస్థుల చేతనే అవమానించబడుతూ, అణిగిపోయి, జీవితం అంటేనే విసిగిపోయిన జాతి. దాన్ని బానిసత్వపు కోరల్లోకి లాగి, దాని రక్తం చివరి బొట్టు వరకు పీల్చివేసినా శత్రువుకు తృప్తి కలగడం లేదు. పైగా ఆ జాతి సంతానాన్నే అంతమొందించే ప్రణాళికలు తయారయ్యాయి.

మూసా(అలైహి) ఒకవైపు ఫిర్ఔన్, హామాన్, ఖారూన్‌లను ఎదుర్కోవాల్సి ఉంది. మరోవైపు వారికి, వారి జాతికీ దైవసందేశం అందజేయాల్సి ఉంది. ఇంకోవైపు అణిచివేయబడిన ఆ జాతిని ఉద్ధరించాలి. ఆ జాతిలోని చెడులను దూరంచేసి మరిచిపోయిన పాఠం గుర్తు చేయవలసి ఉంది- ఆలోచించండి! ఎంత కఠినమైన పని అప్పగించబడుతోందో. అయితే, ఇది కొత్త విషయమేమీ కాదు. ఈ కార్యాన్ని నిర్వర్తించడానికే ఎల్లప్పుడూ ప్రవక్తలు వస్తుండేవారు. ఈ కార్యం పూర్తి చేయడానికి ఆయా ప్రవక్తల అనుయాయులు తమ ప్రాణాలొడ్డి పనిచేశారు.

ఈ ముఖ్యమయిన పనికి ఇవ్వబడే ఉపదేశం (ఉత్తర్వు) ఎంత ముఖ్యమైనదో గమనించండి.

అల్లాహ్ ప్రవచిస్తున్నాడు:

"లా ఇలాహ ఇల్లా అనా ఫాబుద్‌నీ వ అఖీముస్సలాత లిజిక్రీ"

"అల్లాహ్ తప్ప మరొక దైవం లేడు. ఆధిక్యత ఆయనకే. బలపరాక్రమాల్లో ఆయన్ని మించినవారు లేరు. కోర్కెలు తీర్చడం, రక్షణ ఇవ్వడం, శాంతిని ప్రసాదించడం ఆయన వల్లనే సాధ్యం. సర్వాధికారి ఆయనే."

"కనుక దాస్యానికి అర్హుడు ఆయనే. కేవలం ఆయనే. ఆజ్ఞాపించడం ప్రభువు హక్కు, ఆయనకు విధేయత చూపటమే సమంజసం."

యావజ్జీవితమూ ఆయన విధేయతలో స్థిరంగా ఉండటానికి, ఎల్లవేళలా ఆయన ఆజ్ఞల్ని పాలించేందుకు, తన నిజప్రభువు ఎవరో, తాను ఎవరి దాసుడో, ఎవరి దాస్యం, విధేయతలు తనకు తగినవో మానవుడు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ఇది చాలా అవసరం. ఈ విషయాలన్నీ గుర్తుంచుకోటానికి నమాజ్‌ను సుస్థాపితం చేయడం అవసరం. నమాజ్‌ను సంరక్షించుకోని వ్యక్తి దైవ విధేయతా మార్గంలో ఎన్నటికీ స్థిరంగా ఉండలేడు. నమాజ్ సకల ఆరాధనలకూ మూలం. ఇంకా ఎవరయితే అల్లాహ్‌ను తన ప్రభువుగా అంగీకరించి, ఆయనకే దాస్యం చేయడానికి నిర్ణయించుకుని కూడా నమాజ్‌ను సంరక్షించుకోడో, ఆ వ్యక్తి నిర్ణయంలోనే ఏదో లోటు ఉందన్నమాట.

ఇది ఆ ప్రథమ ఉపదేశానికి తాత్పర్యం. ఈ ఉపదేశమే మానవ సంస్కరణకు మొదటి మెట్టు. ఇది వినా మానవుణ్ణి మానవునిగా మలచడం సాధ్యం కాదు. ఈ మౌలిక అంశాన్ని తిరస్కరించిన మానవుడు అవమానం, ఘోర వైఫల్యం తప్ప మరేమీ పొందలేడు. ఇహలోక విజయానికీ, ఇంకా శాశ్వతమైన పరలోక సుఖశాంతుల కోసం కూడా ఈ నియమాన్నే అనుసరించాలి.

హజ్రత్ మూసా (అలైహి) ఏ ఉద్యమం నిమిత్తం పంపబడుతున్నారో ఆ ఉద్యమం పరిపూర్ణత సాధించడానికి అన్నింటికన్నా మొదటి ఆయుధం ఈ దివ్య దృష్టే. మానవ దైవత్వాన్ని రూపుమాపడం, దురాచారభూయిష్టమయిన మత శాపాన్ని తుదముట్టించడం, సంపద ప్రాతిపదికపై మానవుల రక్తాన్ని పీల్చే పెట్టుబడిదారీ జలగల నుండి మానవాళిని కాపాడటం, ఇంకా అణగారి ఉన్న ఒక పీడిత జాతికి దాని హక్కును ఇప్పించడం- ఇవన్నీ కూడా, (1) మానవుడు మొదట తన ప్రభువు (దైవం)ను గుర్తించి, (2)కేవలం ఆయనకే విధేయత చూపి, దైవాన్ని విస్మరించడం వలన జరిగే అనర్థాల నుండి తన్నుతాను కాపాడుకోవడానికి నమాజ్‌ను స్థాపించడం అత్యవసరమని గుర్తించే వరకూ సాధ్యంకాదు.

జీవితం మరణంతో అంతంకాదు. నాణానికి లాగే జీవితానికి బొమ్మా బొరుసు ఉన్నాయి. ఈ రెంటి మధ్య మరణం హద్దు మాత్రమే. ఆ హద్దుకు ఇవతల సముపార్జనకు, ప్రయత్నానికి వ్యవధి, హద్దుకు ఆవలి ప్రక్క సంపాదించిన ఫలాన్ని అనుభవించే కాలం ఉన్నాయి. ఈ వాస్తవమే గనక మానవుని దృష్టిలో ఉండివుంటే ఏ చెడులను రూపమాపడానికి మూసా (అస్సలామ్) నియమింపబడుతున్నారో ఆ చెడులు అసలు పుట్టేవే కావు. కాని మానవుడు ఈ యదార్థాన్ని విస్మరిస్తున్నాడు. కోర్కెలు అతడి కళ్ళను కప్పేస్తాయి. తాత్కాలికంగా లభించే ప్రయోజనాల మధురిమల్లో అతడు మునిగిపోయి ప్రస్తుతం కంటికి కానరాని "శాశ్వత" జీవితాన్ని మరచిపోతాడు. ఈ మరిచి పోవడమే అతని వినాశానికి కారణం. కోరికలకు బానిసలయినవాళ్ళు, కొత్త రుచుల మైకం కమ్మినవాళ్ళు అంతటితో ఊరుకోరు. తాము నాశనమవడమేకాక తమతోపాటు ఇతరుల కళ్ళు కూడా కప్పడానికి ప్రయత్నించి వారి మార్గంలోనూ అవరోధం కల్పిస్తారు.

ఈ మొట్టమొదటి వహీ (దైవసందేశం)లో హజ్రత్ మూసా (అస్సలామ్)ను, "పరలోకాన్ని విస్మరించిన ఈ ప్రజలు నిన్ను వినాశకర మార్గం లోకి ఈడుస్తారేమో!" అనే ప్రమాదాన్ని కూడా ముందుగా సూచించి హెచ్చరించడం జరిగింది.

హజ్రత్ మూసా(అస్సలామ్)కు ఇవ్వబడిన దైవసందేశాన్ని గమనించండి. ఇందులో మానవులందరికీ గుణపాఠం, మార్గదర్శకం లభింపజేసే సామగ్రి ఎంతో ఉంది.

మూసా(అస్సలామ్) మౌనంగా దైవవాణి వింటూ నిలబడ్డారు. ఇంతలో ఆయన్ని ప్రశ్నించడం జరిగింది.

"ఓ మూసా! నీ కుడిచేతిలో ఏముంది?"

"ఇది నా లాఠీ(కర్ర). ఊతగా దీన్ని ఉపయోగిస్తాను. ఇంకా దీంతో మేకల కోసం ఆకులు రాల్చుతాను. దీంతో నా అవసరాలు ఇంకా ఎన్నోతీరుతాయి." హజ్రత్ మూసా(అలైహి) జవాబిచ్చారు.

"దాన్ని నేల మీద పడవేయి"- ఆజ్ఞ అయింది.

మూసా(అస్సలామ్) ఆజ్ఞను పాటించారు. కర్రను పడవేసిన చోట ఒక పాము అటూ ఇటూ జరజర ప్రాకుతోంది. దాన్నిచూసిన మూసా గాబరాపడి, వెనుదిరిగి పారిపోసాగారు. వెంటనే, "మూసా! ముందుకు వచ్చి దాన్ని పట్టుకో. భయపడకు. నీవు క్షేమంగానే ఉంటావు. చూడు! మేము దానిని తిరిగి మొదట ఎలా ఉందో అలానే చేస్తాము. మా ప్రవక్తలు మా సముఖంలో భయపడరు" అని వినవచ్చింది.

మూసా(అస్సలామ్)ఈ ఆజ్ఞను పాటించారు. ముందుకు అడుగువేసి ఆ పామును పట్టుకున్నారు. ఇప్పుడు పాము మాయమైపోయింది. మూసా (అస్సలామ్) చేతిలో లాఠీ ఉంది. ఎప్పటిలాగానే ఇంతలో మళ్ళీ, "నీ చేతిని కాస్త నీ చంకలో పెట్టుకో, నీ చేయి ఉజ్వలమయిన కాంతిని వెదజల్లు తుంది- ఏమాత్రం లోపం లేకుండా. ఇది నీవు నిజంగా దైవప్రవక్తవని తెలిపే రెండవ చిహ్నం. నువ్వు వెళ్ళి ఈ రెండు గుర్తుల్ని ఫిర్ఔన్‌కు, అతని దర్బారులోని వారికి, అతని జాతివారికి చూపి, వారిని దైవతిరస్కారం, అవిధేయతల నుండి మర ల్చేందుకు నీ ప్రభువు తరపు నుండి ప్రసాదించబడు తున్నాయి. వారు ఎంతో అవిధేయులు, తిరస్కారులు అయిపోయారు. ముందు ముందు మేము నీకు మరిన్ని మహిమల్ని చూపుతాము" అని వినబడింది.

హజ్రత్ మూసా(అలైహి) దైవప్రవక్తగా నియుక్తమయ్యారు. అంటే మానవులలో అత్యంత ఉన్నతమైన స్థానం ఆయనకు లభించింది. దైవంతో సంభాషించిన ఘనత, ప్రవక్త పదవికి నిదర్శనంగా రెండు మహిమలు ఆయనకు లభించాయి. అయితే ఎవరికి కీర్తి ప్రతిష్టలున్నాయో వారికి బాధ్యతలూ ఉన్నాయి.

ఇప్పుడు మూసా(అస్సలామ్) నిర్వర్తించవలసిన బాధ్యతలను కాస్త చూడండి. నిజానికి ప్రాపంచిక జీవితం ఏ విధంగానూ సుఖశాంతుల జీవితం కాదు. ఈ జీవితం బాధ్యతల్ని నెరవేర్చే గడువు మాత్రమే. విధి నిర్వర్తించవలసిన

సమయం. ఎవరి హోదా ఎంత ఉన్నతమైనదైతే వారిపై బాధ్యత కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. హజ్రత్ మూసా(అస్సలామ్)కు ఆజ్ఞాపించబడింది:

"వెళ్ళు, ఫిర్‌ఔన్ వద్దకు పో. అతనెంతో తలబిరుసుతనాన్ని ప్రదర్శిస్తున్నాడు. అతని ఆస్థానంలోనివారు, అతని జాతివారు హద్దుమీరిపోయారు. అమితమయిన అన్యాయాలకు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. "మీకు దైవభయం లేదా?" అని వారిని అడుగు. "నీ జీవితం పవిత్రవంతం కావాలని కోరుకుంటు న్నావా? అయితే నీ నిజప్రభువు, యజమానికి ఇష్టమయిన జీవితమార్గం నీకు చూపనా?" అని ఫిర్‌ఔన్‌ని అడుగు.

ఈ ఆజ్ఞ వినగానే హజ్రత్ మూసా(అస్సలామ్) భయంతో కంపించి పోయారు. ఎంత పెద్ద బాధ్యత ఆయనపై మోపబడుతోందో!

ఫిర్‌ఔన్! ఈజిప్టు దేశానికి ఏకైక యజమాని. అతని అధికారాలకు అంతులేదు. అతని చుట్టూ యుక్తిపరులైన సర్దారుల సమూహం ఉండేది. యావజ్జాతి అతని గుప్పిటిలో బంధించబడి ఉన్నది. కనుసైగలతో వారిని ఆడించగలడతను. ఆ కాలంలో మానవ బలం, అధికారం అత్యున్నత స్థాయిలో అతనికి ప్రాప్తమయింది. కాగా, ఇటు హజ్రత్ మూసా(అస్సలామ్) ఏకాకి. అనుచరులు ఎవరూ ఆయన వెంటలేరు. అధికారం, డబ్బు సంగతి అటుంచి బ్రతుకు తెరువు కోసం కొన్ని పశువులు తప్ప మరే ఆధారమూ లేదు. పైగా ఎంతో కాలంగా దేశాన్ని విడిచిపెట్టి ఉన్నా ఇప్పటిదాకా పశువుల కాపరిగా జీవితం గడిపినవారు; ఈజిప్టు దేశపు భాషను కూడా దాదాపు మరచిపోయినవారు. అటువంటి ఆయనకు, "వెళ్ళు, ఫిర్‌ఔన్ దర్బారులో మా సందేశం విన్పించు. అతణ్ణి సన్మార్గంలోకి మరల్చే ప్రయత్నం చెయ్యి" అని ఆజ్ఞాపించబడుతోంది.

"నీవు దేవుడవు కావు, దాసుడవు మాత్రమే. దాసునిగా ఉండటంలోనే నీ శ్రేయస్సు ఇమిడి ఉంది అని అతనితో చెప్పు" అని అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు.

కాని ఈ విశ్వానికి అధిపతి ఎవరో, అతని శక్తిసామర్థ్యాలు ఎటువంటివో, ఆయన ఎంతటి ప్రజ్ఞావంతుడో మూసా(అలైహి)కు తెలుసు. అతని శక్తి ముందు

ఫిర్ఔన్ మరియు అతని బలగం ఎందుకూ కొరగానివి. అటువంటి మహిమాన్వితుడయిన విశ్వప్రభువు ఆజ్ఞాపిస్తున్నప్పుడు అంతటి శక్తిసంపన్నుని అండ తనకుండగా భయపడవలసిన పనేమిటి? కనుక హజ్రత్ మూసా(అలైహి) వెంటనే సిద్ధమయ్యారు. కాని ప్రార్థించడం భక్తుని లక్షణం. సహాయం కోసం విశ్వప్రభువుని అర్థించడం అతనికి శక్తిదాయకం. ఆయన తన రెండు చేతులూ ఎత్తి వినమ్రులై విశ్వప్రభువు ముందు మోకరిల్లి ప్రార్థించారు:

"ఓ నా ప్రభూ! నా హృదయాన్ని విశాలపర్చు, ప్రచార కార్యక్రమంలో ఇబ్బందుల్ని ఎదుర్కొనే శక్తిని ప్రసాదించు, నా పనిని సులభతరం గావించు, ప్రజల హృదయాలను హత్తుకునేలా నా వాక్శోణిని తీర్చిదిద్దు.

"దేవా! నన్ను వీరు అసత్యపరునిగా భావిస్తారేమోనని నాకు భయంగా ఉంది. నా వల్ల ఒక అపరాధం జరిగిపోయిన సంగతి నీకు తెలుసు. వారి మనిషి ఒకడు నా చేత చంపబడ్డాడు. వారు నన్ను చంపివేస్తే నాకు అప్పగించబడిన కార్యం పూర్తిగా నెరవేరదేమో అని విచారిస్తున్నాను.

"స్వామీ! నాకు సాయపడు. మా కుటుంబంలో నుండి నా సోదరుడు హారూన్‌ను నాకు సహాయకారిగా నియమించు, అతని వల్ల నాకు ధైర్యం కలుగుతుంది. అతడు నాకు చేదోడుగా ఉండి, నే చెప్పే మాటలను బలపరు స్తాడు. అతడు నాకన్నా గొప్ప వక్త కూడా. మేమిద్దరం కలిసి ఈ కార్యభారాన్ని నిర్వహిస్తాము. నీ ఏకత్వాన్ని వీలైనంత ఎక్కువగా చాటి చెబుతాము. ఎల్లవేళలా నీ సేవలో నిమగ్నులమై ఉంటాము."

ఆ విశ్వప్రభువు అభీష్టం నెరవేర్చేందుకు హజ్రత్ మూసా(అలైహి) నడుం బిగించారు. ఆయన అప్పగించిన పనిని పూర్తి చేయడానికి ఆయనతోనే మొర పెట్టుకున్నారు. ఇక చూడండి, ఆయన కటాక్షవీక్షణాలు హజ్రత్ మూసా (అలైహి)పై ఏవిధంగా పడతాయో; సృష్టిలోని అణువణువు ఆయనకు తోడ్పడడానికి సిద్ధంగా ఎలా కన్పిస్తాయో చూడండి.

హజ్రత్ మూసా(అలైహి) ప్రార్థన అంగీకరించబడింది. "నీ దరఖాస్తు మంజూరు చేయబడింది. మేము నీ సోదరుణ్ణి నీకు కుడిభుజంగా చేస్తాం. మీ

ఇద్దరికీ విజయశ్రీ ప్రసాధిస్తాం. వారి ప్రభావం మీపై ఏమాత్రం ఉండదు. మీరిద్ద రిది, ఇంకా ఈ కార్యంలో మిమ్మల్ని అనుసరించేవారిదే పైచేయిగా ఉంటుంది" అని విశ్వప్రభువు సెలవిచ్చాడు. కర్తవ్యదీక్షాబద్ధుడైన తన దాసునితో.

మూసా(అలైహి) నిప్పు తెస్తూ ఉంటారని ఆయన భార్య ఎదురు చూస్తూంది. ఆ వ్యవధిలో పరిస్థితులు ఎలా మారాయో ఆమెకేం తెలుసు? అప్పటివరకూ మేకలను మేపుతూ ఉన్న మూసా(అలైహి)కు ఒక్కసారిగా, మానవాళికంతటికీ సన్మార్గం చూపించవలసిన బాధ్యత ఇవ్వబడింది. సరే, ఏమయితేనేం, మూసా(అలైహి) 'తూర్' కొండ నుండి తిరిగివచ్చి ఈజిప్టు వైపుగా పయనమయ్యారు సపత్నీ సమేతంగా, ఆదిలో సోదరుణ్ణీ, అప్పుల్ని కలుసు కోవాలనే కోరిక ఉండనే ఉంది. కాని ఇప్పుడు ఒక బాధ్యతను స్వీకరించారు. దాన్ని పూర్తి చేయడమే ఆయన శేషజీవిత లక్ష్యమైంది. అదే ఆయన ప్రస్తుత లక్ష్యం.

ఇటు హారూన్ (అలైహిస్సలామ్)ను కూడా దేవుడు ప్రవక్తగా నియ మించాడు. ఈజిప్టులో సోదరులిద్దరూ కలుసుకున్నారు. ఇద్దరూ కలిసి చేయ వలసిన ధార్మికసేవ వారికి తెలిసినదే. ఇప్పుడు వారికి మరికొన్ని సూచనలివ్వ బడుతున్నాయి.

"మీరిద్దరూ ఫిర్ఔన్‌ను కలుసుకోండి. మా నిదర్శనాలను అతడకి చూపండి. ఇంకా మా సందేశం వినిపించండి. ఫిర్ఔన్ చాలా అహంకారి అయి నాడు. అతడికి చెప్పవలసినదంతా మృదువుగా చెప్పండి. విషయం అతనికి అర్థం కావచ్చు. అతడు దుష్పర్యవసానానికి భయపడనూవచ్చు."

ఇది విని వారిద్దరూ "ప్రభూ! అతడు మా మాటలు విని మా మీద మండి పడతాడేమో! కోపంతో హద్దుమీరి ప్రవర్తిస్తాడేమో అని మేము భయపడు తున్నాము" అని విన్నవించారు.

అల్లాహ్ వారిద్దరికీ ధైర్యం చెప్పి ఇలా అన్నాడు, "ఏమీ కాదు, మీరు భయపడకండి. మీకు నేను తోడుగా ఉంటాను. నాకు అంతా తెలుసు.

సమస్తమూ నా దృష్టిలో ఉంది. మీరు వెళ్ళి ఫిర్‌ఔన్‌తో, 'మేమిద్దరం నీ ప్రభువు, యజమాని అయిన అల్లాహ్ చేత పంపబడిన ప్రతినిధులం' అని చెప్పండి."

హజ్రత్ మూసా(అలైహి) మరియు హజ్రత్ హారూన్ (అస్సలామ్) తాము దైవప్రవక్తలమని ప్రకటించారు. ఫిర్‌ఔన్ వద్దకు వెళ్ళి వారేమి చెప్పారో తెలుసు కోవడానికి ఇది చాలు. ఇద్దరూ దైవప్రవక్తలు అందజేసే సందేశమే ఫిర్‌ఔన్‌కు అందజేసి ఉండవచ్చు, ఇంకా తూర్ పర్వతంపై మూసా(అలైహి)కు సవివరంగా సూచించబడింది ఈ విషయమే. కాని హజ్రత్ మూసా(అస్సలామ్) కేవలం ఫిర్‌ఔన్ మరియు అతని జాతి కోసమే పంపబడలేదు. బనీఇస్రాయీల్ వారిని (మూసా (అస్సలామ్) జాతివారు) సంస్కరించడం కూడా ఆయన పనే. వీరిలో ఏర్పడిన ధార్మిక బలహీనతను దూరం చేయవలసిన అవసరం కూడా ఉంది. బనీ ఇస్రాయీల్ వారు ఎంతోకాలంగా ఫిర్‌ఔన్ బానిసత్వంలో మ్రగ్గుతూ ఉన్న వారు గనుక బానిస జాతుల ధార్మికత కుంటుపడుతూ రావడం సహజమే కదా! ఎన్నో ధార్మిక విధులు వారు నిర్వర్తించలేకపోయేవారు.

ఇస్రాయీల్ వంశంలో 'ఖుర్బానీ' ఇవ్వడం ముఖ్యమైన ఆరాధనగా ఉండేది. కాని ఫిర్‌ఔన్ వారిని ఆ ఆరాధనకు దూరంగా ఉంచాడు. ఈజిప్టువారు కూడా ఇతర ముష్రిక్ (బహుదైవారాధకులు)ల వలెనే ఆవును పూజించేవారు. అందుచేత ఇస్రాయీల్ వంశీయులకు ఆవును ఖుర్బానీ ఇచ్చే అనుమతి లభించ లేదు. నువ్వు నీ జాతివారిని మూఢవిశ్వాసాల నుండి, అంధకారం నుండి వెలికి తీసి ఇస్లామ్ వాస్తవికత వెలుగులోకి తెమ్మని మూసా(అస్సలామ్), హారూన్ (అస్సలామ్)లకు సూచించిన అల్లాహ్ ఫిర్‌ఔన్‌ను దైవధర్మం వైపు ఆహ్వానించడంతో పాటు బనీ ఇస్రాయీల్‌కు వారి ధార్మిక విధులు నిర్వర్తించు కోవడానికి, ముఖ్యంగా పండుగ రోజు వారు సామూహికంగా 'ఖుర్బానీ' ఇచ్చేందుకు అనుమతి ఇవ్వమని, ఫిర్‌ఔన్‌ను కోరమని కూడా సూచించాడు. ఇంకా, ఈ పనికి ఈజిప్టు సరయిన స్థలం కాదు గనక, ఇస్రాయీల్ వంశీయులు పండుగ జరుపుకునేందుకు వారిని నగరం వెలుపలకు వెళ్ళనివ్వమని, వారి మార్గంలో

అవరోధాలు కల్పించవద్దని డిమాండు చేయి అని కూడా అల్లాహ్ మూసా (అస్సలామ్)కు సూచించాడు. ఇస్రాయీల్ వంశీయులు ఫిర్ఔన్‌కు, ఫిర్ఔన్ జాతికి సేవకులన్న విషయం విదితమే.

వారు కొన్నాళ్ళపాటు ఎటైనా పోతే ఫిర్ఔన్ జాతికి సేవచేయటానికి చాకిరీ చేసే కూలీలు దొరకరు. కనుక ఫిర్ఔన్‌జాతి వారు వారిని నగరం బయటకు వెళ్ళనివ్వరు. మూసా(అస్సలామ్) ఫిర్ఔన్‌కు చేసిన అభ్యర్థన "తౌరాత్"లో ప్రస్తావించబడింది:

"తరువాత మోషే అహరోనులు వచ్చి ఫరోను చూచి- ఇస్రాయీలీయుల దేవుడైన యెహోవా- అరణ్యములో నాకు ఉత్సవము చేయుటకు నా జనమును పోనిమ్మని ఆజ్ఞాపించుచున్నాడనిరి. ఫరో- నేను అతని మాట విని ఇస్రాయీలీయులను పోనిచ్చుటకు యెహోవా ఎవడు? నేను యెహోవాను ఎరుగను. ఇస్రాయీలీయులను పోనీయననెను. అప్పుడు వారు- హెబ్రీయుల దేవుడు మమ్ములను ఎదుర్కొనెను, సెలవయిన యెడల మేము అరణ్యము లోనికి మూడు దినముల ప్రయాణమంత దూరము పోయి మా దేవుడయిన యెహోవాకు బలి అర్పించుదుము?" (నిర్గమ కాండము (5) 1-3)

దైవప్రవక్తలు ఏ సందేశమయితే ఇస్తారో ఆ సందేశం ఫిర్ఔన్‌కు వినిపించి, దానితోపాటు, "బనీ ఇస్రాయీల్‌ని మా వెంట వెళ్ళనివ్వు, వారికి కష్టాలను కలుగజేయకు. మేము నీ దగ్గరకు నీ ప్రభువు యొక్క నిదర్శనాలను తీసుకువచ్చాము. దైవం పంపిన సందేశాన్ని ఎవరైతే ఆచరిస్తారో వారికే శ్రేయం కలుగుతుందని తెలుసుకో" అని తెలియజేయడానికే అల్లాహ్ వారిద్దరినీ పంపాడు.

హజ్రత్ మూసా (అస్సలామ్) మరియు హజ్రత్ హారూన్ (అస్సలామ్)లు ఈ కార్యం కొరకే పంపబడ్డారు. వారిపై మోపబడిన బాధ్యతలు సంక్షిప్తంగా ఇవి:

- ఫిర్ఔన్‌కు, అతని జాతివారికి, ఫిరౌన్ దర్బారులో మార్గభ్రష్టులయిన సర్దారులకు మొట్టమొదట దేవుని ఏకత్వం, ప్రవక్తల దౌత్యం, పరలోకం గురించి వినిపించాలి. వారిని సన్మార్గం వైపునకు రప్పించే ప్రయత్నం చేయాలి.

- ఇస్రాయీల్ వంశీయులపై జులుం చేయవద్దని ఫిర్ఔన్‌ను కోరాలి. ఇంకా,వారు సామూహికంగా పండుగ జరుపుకునేందుకు, ఖుర్బానీ వంటి ముఖ్యమైన ధార్మిక విధిని నెరవేర్చుకునేందుకు తమ వెంట ఈజిప్టు నుండి వెళ్ళనివ్వమని కోరాలి.
- బనీ ఇస్రాయీల్ వారిలో చోటు చేసుకున్న విశ్వాసపరమైన దోషాలు, ఆచరణారాహిత్యమనే అంధకారం నుండి వెలికితీసి ఇస్లామీయ మౌలిక విశ్వాసాల వెలుగులోకి తీసుకురావాలి.

రాబోయే పుటలలో మూసా(అస్సలామ్) నిర్వర్తించిన ధార్మిక సేవా కార్యక్రమం వివరాలు వస్తాయి. అందులో, దైవప్రవక్తల ప్రబోధనల కను గుణంగా ఆచరిస్తూ, దైవధర్మంపై స్థిరంగా ఉంటూ ఆ ధర్మ సందేశ ప్రచారం బాధ్యతను నెరవేర్చడానికి సిద్ధపడినవారందరికి గొప్ప పాఠం ఉంది.

దివ్యఖుర్ఆన్‌లో మూసా (అస్సలాం) ప్రసక్తి

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి: హజ్రత్ మూసా (అస్సలామ్) గురించి మనకు ఇతర గ్రంథాలకంటే దివ్యఖుర్ఆన్ గ్రంథం ద్వారానే విశ్వస నీయమయిన సంఘటనలు, వివరాలు తెలుస్తాయి. పవిత్ర ఖుర్ఆన్ మిగతా గ్రంథాల వంటి గ్రంథం కాదు. సాధారణంగా ప్రతి గ్రంథంలో ఏదో ఒక అంశంపై వివిధ సంఘటనలు, వివరాలన్నీ ఒక చోట పొందుపరచబడి ఉంటాయి. విషయాన్ని బట్టి వేర్వేరు కాండములు నిర్ణయింపబడతాయి. కాని ఖుర్ఆన్ శైలి వీటన్నింటికి విభిన్నమయింది. పవిత్ర ఖుర్ఆన్‌లో విశ్వాసపరమైన సమస్యలు, నైతిక బోధలు, షరీఅత్ ఆజ్ఞలు, ఇస్లామీయ సందేశం, హితబోధలు, విమర్శలు, ఖండనలు, మంచీ చెడుల పర్యవసానాల వివరాలు, దుష్ఫలితాల ద్వారా (మాన వాళిని) భయపెట్టటం, సత్కార్యాలకు లభించే మంచి ప్రతిఫలం ప్రసక్తి తీసుకు రావటం, దేవుని ఏకత్వం, పరలోకం, దైవదౌత్యానికి ఆధారాలు, గుణపాఠం, మేల్కొలుపు మొదలగువాటి కోసం పదే పదే చారిత్రక సంఘటనలు

ప్రవచించబడ్డాయి. ప్రతీసారీ అదే విషయాన్ని కొత్త పంథాలో వివరించడం జరిగింది. అలా వివరించడం వల్ల శ్రోతలపై వినూత్న ప్రభావం పడుతుంది. దివ్యఖుర్‌ఆన్ యొక్క ఈ బోధనా తీరు వల్ల ఏయే ప్రయోజనాలున్నాయో వివరించడం ఇక్కడ సాధ్యం కాదు. అయితే ఖుర్‌ఆన్ గాథల విషయంలో ఒక విషయం బాగా గుర్తుంచుకోవాలి. అదేమంటే ఖుర్‌ఆన్‌లో ఏ సంఘటన కూడా కథగా చెప్పుకోవడం కోసం ఉదాహరింపబడలేదు.

ఖుర్‌ఆన్ ఒక సందేశ గ్రంథం. అరబ్ దేశంలో మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రజలను ఇస్లాం వైపునకు పిలిచిన కాలంలో ఆయన (సఅసం), ఆయన అనుయాయులు ఈ ఉద్యమం యొక్క వివిధ దశల్లో వివిధ రకాల పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ఆ పరిస్థితులను ఎదుర్కోవడం అంత తేలిక విషయం కాదు, దానికోసం భారీఎత్తున సన్నాహాలు చేయడం అవసరం. ఆ సన్నాహాలకు గొప్ప ఆధారం పవిత్ర ఖుర్‌ఆన్. అల్లాహ్ వివిధ సందర్భాలలో సత్యధర్మ పక్షంలో ఉన్న వారికి అవసరమయిన సూచనలు ఇచ్చాడు, వారు దైవమార్గంలో స్థిరంగా ఉండేందుకు పూర్వపు జాతుల గాథలను వారి ముందుం చాడు. ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ ఎప్పుడూ ఒకే విధంగా ఉంటుందనే విషయాన్ని వారి హృదయాలలో నాటుకునేలా చేశాడు. అంతేకాదు, ప్రతి కాలంలో కూడా ఇస్లామీయ ఉద్యమ ధ్వజవాహకులు ఒకే తరహా (క్లిష్ట) పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. అయితే వారు తమ సత్యమయిన సన్మార్గంపై గనక స్థిరంగా నిలిచినట్లయితే చివరికి అధర్మం రంగం నుండి నిష్క్ర మించవలసి వచ్చిందని, దాంతోపాటు ఎవరికయితే సందేశ పరిచయం చేయటం జరుగుతుందో వారిముందు హజ్రత్ ముహమ్మద్ (సఅసం) అందజేసే ఇస్లామీయ సందేశం కనీవినీ ఎరుగనిదేమీ కాదని, ఈనాడు మీ ముందు ఉంచబడుతున్న సందేశమే ప్రతి కాలంలోనూ ప్రతి ప్రవక్త ప్రచారం చేశాడన్న సత్యాన్ని వారికి గుర్తుచేయడం జరిగింది. ఇంకా, ఈ సందేశాన్ని వ్యతిరేకించే వారిని గురించి వారి వ్యతిరేకత స్వభావం ఎటువంటిదో, ఏ పునాదులపై వారు ఇస్లామీయ ఉద్యమాన్ని వ్యతిరేకించేవారో విడమర్చి చెప్పబడింది.

ఇస్లామీయ ఉద్యమాన్ని వ్యతిరేకించినవారు, వారు అవలంబించిన (తిరస్కార) వైఖరి అసలెలాంటిదో, దాని పరిణామం ఎలా రూపుదాల్చనున్నదో తెలియజేసే ఉద్దేశ్యంతోనే ఈ విషయాలన్నీ పొందుపరచబడుతున్నాయి. ఈ వివరాల వలన ఒకవైపు విశ్వాసుల హృదయాలకు ఊరట కలుగుతుంది. విశ్వాసులు ఖేదపడరాదని, తమను వ్యతిరేకించేవారు కడకు సన్మార్గం వైపునకు రాకపోతే, పూర్వం తిరస్కారులకు పట్టిన గతే వీరికీ పడుతుందని ధైర్యం చెప్ప బడింది. ఇంకోవైపు ఈ వివరాలలో దైవతిరస్కారులకు చక్కని గుణపాఠం కూడా ఉంది, భవిష్యత్తులో వారికేగతి పట్టనున్నదో చెప్పబడింది.

ఖుర్‌ఆన్ సంఘటనలను వివరించడంలో గల ఆశయాన్ని నెరవేర్చ డానికి, పవిత్ర ఖుర్‌ఆన్‌లో హజ్రత్ మూసా (అలైహి) గాథ సవివరంగా, అనేక చోట్ల ఉటంకించటం జరిగింది. హజ్రత్ మూసా (అస్సలామ్) కాలం సమీప కాలమే కాబట్టి ఆయన గురించి ప్రజలకు చాలా విషయాలు తెలుసు. ఆయన అందించిన దైవసందేశం ఏయే దశలను, అవరోధాలను దాటుతూ పోవలసి వచ్చిందో కూడా చాలా మంది ప్రజలకు తెలుసు. అందుకనే ఖురైషీయుల ముందు ఇస్లామీయ సందేశం వినిపించేటప్పుడు, పదే పదే విభిన్న రీతుల్లో మూసా (అస్సలామ్) సందేశాన్ని వ్యతిరేకించేవారికి పట్టిన దురవస్థను గూర్చి ప్రస్తావించటం జరిగింది. ప్రతి సందర్భంలో ఎంతో ప్రభావంతంగా వివరించ బడింది. నాటి ఫిర్‌ఔన్ మాదిరిగా ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తూ, వారిని మక్కా నుండి తరిమివేయాలని కంకణం కట్టుకున్న ఖురైష్‌లు ఒక యదార్థాన్ని గ్రహించాలి - దైవాదేశాన్ని ధిక్కరించి, ప్రవక్త మాటలను పెడ చెవిన పెట్టినందుకు ఈజిప్టు పాలకుడు ఫిర్‌ఔన్, అతని అనుయాయులు సర్వనాశనమైపోయారన్న విషయం తమకు (ఖురైషీలకు) తెలిసిందే. అంత తెలిసి నప్పటికీ తాము మళ్ళీ ఆ మార్గాన్నే అనుసరించి అదే పరిణామాన్ని ఎందుకు చవిచూడాలి? అన్న విషయాన్ని వారు బాగా అర్థం చేసుకోవాలి. ఇటు విశ్వాసు లకు హజ్రత్ మూసా (అస్సలామ్), హజ్రత్ హారూన్ (అస్సలామ్)ల వైఖరి వివరిస్తూ వారు సత్యధర్మ మార్గంలో నిలకడగా ఉంటే, సత్కార్యాలు చేస్తే

వారిక్కూడా దైవకటాక్షం, పరలోక విజయం, ఇహలోకంలో గౌరవ మర్యాదలు హజ్రత్ మూసా, హజ్రత్ హారూన్ (అస్సలామ్)లకు మాదిరిగానే ప్రాప్తమవు తాయని బోధించబడింది.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో మూసా (అస్సలామ్) ప్రసక్తి వచ్చిన సందర్భాల్ని గమనించండి. అంతకు ముందు మరియు వెనుక చెప్పబడిన విషయాల్ని కూడా పరిశీలిస్తే, మూసా (అస్సలామ్) జీవితంలోని ఇదే సంఘటన, ఒక ప్రత్యేక ఫక్కీలో ఎందుకు వివరించబడిందో అర్థం చేసుకోవటం అంతకష్టమేమీ కాదు. పవిత్ర ఖుర్‌ఆన్‌లోని అంశాల్లోగల ఈ ప్రత్యేకత, వైవిధ్యం కారణంగా మూసా (అస్సలామ్)ఫిర్‌ఔన్‌కు దైవసందేశం అందించినప్పుడు ఎదురయిన సంఘట నలు మనకు ఒక వరుస క్రమంలో లభించవు. అయితే ఈ విషయంలో ఖుర్‌ఆన్‌లో చెప్పబడిన దాన్నంతటినీ ముందుంచుకుంటే హజ్రత్ మూసా (అస్సలామ్), హజ్రత్ హారూన్ (అస్సలామ్) అనుయాయులకు ఎదురైన పరిస్థి తుల సమగ్ర స్వరూపం అగుపిస్తుంది.

హజ్రత్ మూసా (అస్సలామ్) ఈజిప్టు చేరుకున్నారు. సోదరుడు హారూన్ (అస్సలామ్)ను వెంటబెట్టుకుని దైవం తనపై మోపిన సందేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యసాధనకై ఆయన (అస్సలామ్) ఫిర్‌ఔన్ దర్బారుకు కూడా వెళ్ళారు. ఫిర్‌ఔన్ మంత్రులతో, అధికారులతో సంభాషించారు. ఫిర్‌ఔన్ జాతికి చెందిన సామాన్య ప్రజలకు దైవసందేశమిచ్చారు. తమ జాతివారైన-బనీ ఇస్రాయీల్ వారిక్కూడా వారు మరచిపోయిన పాఠం గుర్తు చేశారు. వారిలో నిజమయిన ధార్మికతను జనింపజేసే ప్రయత్నం చేశారు. ఆయన (అస్సలామ్) వినిపించిన సందేశం, దైవప్రవక్తల సందేశమే. ఆయన ప్రతిసారీ ఎంతో ఉత్తమ రీతిలో ఇచ్చిన సందేశాలు ఇవి:

- అల్లాహ్ ఒక్కడే. ఆయన తప్ప మరో దేవుడు లేడు. విధేయతకు అర్హుడు ఆయనే. ఆరాధన ఆయనకే చేయాలి. అన్ని రకాల శక్తి సామర్థ్యాలకు అసలు యజమాని ఆయనే. అందుచేత ఆయనను తప్ప

మరొకరి సహాయం కోరటంగానీ, ఇంకొకరి రక్షణ (ఆశ్రయం) కోరటం గానీ చేయరాదు.

- అల్లాహ్‌కు విధేయత చూపడానికి మీరేం చేయాలి? ఏం చేయకూడదు? అనే విషయం అల్లాహ్ నాకు చూపి మీ వద్దకు పంపాడు. కాబట్టి మీరంతా ఆయన ప్రీతి పొందాలంటే మీరు నేను చెప్పినట్లు వినాలి.
- నా మాట విన్నవారు ప్రయోజనం పొందుతారు- ఇహలోకంలోనూ, పరలోకంలోనూ నా సందేశాన్ని పెడచెవిన పెట్టినవారు నష్టపోతారు. మీ అసలయిన లాభనష్టాలు మీరు తిరిగి బ్రతికింపబడి, మీ అసలు ప్రభువు సమక్షంలో హాజరుకాబడినప్పుడు తెలిసివస్తాయి. ఆ రోజు (ఖియామత్) రావడం తథ్యం. ఆనాటి విజయమే అసలు విజయం.

ఫిర్‌ఔన్ ఎదుట హజ్రత్ మూసా (అస్సలామ్) దైవసందేశం విని పించడంతోపాటు మరో కోరిక కూడా కోరారు. అదేమంటే అవమాన కరమైన బానిసత్వంలో చిక్కుకున్న బనీ ఇస్రాయీల్‌కు విముక్తి కలిగించాలి, వారికి దైవం తరఫున ఆజ్ఞాపించబడినట్లుగా వారు దైవాన్ని ఆరాధించడానికి స్వేచ్ఛ, అవకాశం ఇవ్వాలి. ముఖ్యంగా అల్లాహ్ కొరకు "ఖుర్బానీ" చేసే స్వాతంత్ర్యం ఇవ్వాలి. "ఇందుకోసం ఇస్రాయీల్ వంశీయులను నా వెంట వెళ్ళనిస్తే నేను వారిని దూరంగా ఎక్కడికన్నా తీసుకువెళ్ళి అక్కడ సామూహికంగా దైవప్రీతి కోసం ఖుర్బానీ చేయగలను" అని మూసా (అస్సలామ్) కోరారు. దానికి ఫిర్‌ఔన్ ఏమన్నాడు?

ఫిరౌన్ దర్బారులో దైవ సందేశం

ఫిర్‌ఔన్‌పై హజ్రత్ మూసా (అస్సలామ్) సందేశం ఎటువంటి ప్రభావం వేసిందో మీరు సులభంగా అంచనా వేయగలరు.

"నువ్వు సామాన్య మానవులకంటే గొప్ప వ్యక్తివి, అన్నిటికంటే పెద్ద దేవతకు అవతార పురుషుడివి, సూర్య వంశస్థుడవు, నీ ముందు లక్షాలాది

ప్రజలు తలవంచుతారు. దేశంలోకెల్లా శక్తిశాలివి, నీ కోరికయే చట్టం, నీ సంజ్ఞతో దేశమంతా నాట్యం చేస్తుంది." అని ఫిర్ఔన్ దర్బారీలు అతని బుర్రలో బాగా నాటుకునేట్లు చేశారు. అలాంటి వ్యక్తి ఫిర్ఔన్ ఎదుట కేవలం ఇద్దరంటే ఇద్దరు వచ్చి నిలబడ్డారు. వారు సిరిసంపదలుగాని, అధికారంగాని లేనివాళ్ళు తమతో పాటు తమ జాతికి చెందిన జనసమూహం ఏమీ లేనివాళ్ళు, దేశంలో అందరి కన్నా ఎక్కువ బాధించబడినవాళ్ళు, తమ బంధువర్గంచే వెట్టిచాకిరి చేయబడు తున్నవాళ్ళు. ఫిర్ఔన్ జాతివారికి బానిసలయిన ఆ ఇద్దరూ దర్బారులోకి వచ్చి ఫిర్ఔన్‌తో ఇలా అన్నారు:

"నీవు కూడా సామాన్య మానవుల్లాంటి ఒక మానవుడవు, దేవుడవు కాదు. దేవుని దాసుడవు మాత్రమే. ఆయనే నిన్ను సృష్టించాడు. ఆయన కటాక్షంతోనే జీవించి ఉన్నావు. ఆయన ఇచ్చిందే తిని బ్రతుకుతున్నావు. నీ ఈ సిరిసంపదలు, అధికారం, పేరు ప్రతిష్టలు అన్నీ కొన్నాళ్ళ వరకే; ఇతర మానవులలాగే నువ్వు కూడా మరణించవలసి ఉంది. మరణానంతరం, నీ కర్మల ఫలితం అనుభ వించాల్సి ఉంది. (దేవునికి) దాసుడవై ఉండటంలోనే నీకు లాభముంది, తిరుగు బాటు ధోరణికి దూరంగా ఉండు, ఈ విశ్వం యొక్క నిజప్రభువును ధిక్క రించకు. నిజ ప్రభువు మనందరికీ చూపిన మార్గాన్నే నువ్వూ అనుసరించు. ఆ సన్మార్గాన్ని చూపడానికే మేము నీ దగ్గరకు పంపబడ్డాము."

వారు ఇంకా ఇలా అన్నారు: "ఏ జాతినయితే నువ్వూ, నీ జాతి వారు కట్టుబానిసలుగా చేసుకున్నారో, వారు కూడా మానవులే. వారితో మానవుల వలె ప్రవర్తించాలి. ఇంకా, వారికి ఆజ్ఞాపించబడినట్లుగా వారు తమ ప్రభువును ఆరాధించుకునే అవకాశం వారికి కలుగజేయాలి. వారిని మా వెంట పంపాలి."

హజ్రత్ మూసా (అలైహి), ఆయన సోదరుడు హజ్రత్ హారూన్ (అలైహి) ఫిర్ఔన్ ఆస్థానంలోకి వెళ్ళిన మొదటి రోజునే ఇన్ని మాటలు బహుశా అనేసి ఉండరు. ఆ సోదరులిద్దరూ దైవం ప్రసాదించిన బుద్ధిజ్ఞానాలను ఉపయోగిస్తూ, దైవాజ్ఞల ప్రకారం నడుచుకుంటూ ఈ సందేశాన్ని సమయం, సందర్భాన్ని బట్టి

యుక్తిగా ఫిర్ఔన్‌కు వినిపించి ఉంటారు. అయితే మొత్తానికి దైవసందేశమంతా ఫిర్ఔన్‌కు తెలుపబడింది.

వారు చెప్పవలసినదంతా ఫిర్ఔన్‌కు మాత్రమే చెప్పేసి, ఇక ఫిర్ఔన్ సింహాసనం తలక్రిందులవుతుందని మీనమేషాలు లెక్కించుకుంటూ కూర్చో లేదు. దైవ సందేశాన్ని వారు దేశ ప్రజలందరికీ వినిపించారు. ఆరాధనకు, విధే యతకు అర్హుడు ఫిర్ఔన్ కాదనీ, తన ఉనికిలో, గుణగణాల్లో ఒక్కడే అయిన అల్లాహ్ మాత్రమే అర్హుడని ప్రజలకు ఉద్బోధించారు.

మొదట ఫిర్ఔన్ వారి మాటలను పట్టించుకోలేదు. తర్వాత నయానో భయానో వారి నోరు కట్టించాలని చూశాడు. ఒకసారి ఇలా అన్నాడు: "నువ్వు మా కుటుంబంలో పోషింపబడినవాడవు. సంవత్సరాల తరబడి మా ఇంట పెరిగావు, పైగా నువ్వు ఒక మనిషిని చంపి ఇక్కణ్ణుంచి పారిపోయావు. మేము నిన్ను ఏమీ అననందుకు మాకు కృతజ్ఞత చెల్లించవలసిందిపోయి మాకే మార్గం చూపడానికి సిద్ధపడ్డావా? నీ ఈ వైఖరి ఏమీ బాగాలేదు, ఇకనయినా జాగ్రత్తగా ఉండు."

హజ్రత్ మూసా (అలైహి) అన్నారు: "నా వల్ల అజ్ఞానంతో ఒక తప్పు జరిగిన మాట వాస్తవమే. నేను మీకు భయపడి ఇక్కణ్ణుంచి పారిపోయిన సంగతి కూడా నిజమే. కాని అల్లాహ్ నా తప్పును క్షమించాడు. నాకు హితోప దేశం చేశాడు. నన్ను పోషించిన దానికి కృతజ్ఞత అంటావా, కాస్త ఆలోచించు- నీవు ఇస్రాయీల్ వంశీయులతో ఎలా ప్రవర్తించావో! ఒక వ్యక్తితో మంచిగా వ్యవహరించి, యావజ్జాతిని జీవితాంతం వెట్టిచాకిరిలోకి ఈడ్వడం, ఉత్తమ ప్రవర్తనకు నిదర్శనమనుకుంటున్నావా?"

తన దగ్గరకు వచ్చి ప్రతి ఒక్కరూ తనకు వంగి వంగి సలాములు చేసి నట్లే హజ్రత్ మూసా (అస్సలామ్) కూడా తనకు వంగి సలాము చేస్తాడని ఫిర్ఔన్ భావించాడు. హజ్రత్ మూసా (అస్సలామ్) నోటి వెంట కృతజ్ఞతా వాక్యాలు వెలువడతాయేమో, నీవే దిక్కని అతడు తనను బ్రతిమాలుతాడేమో, ప్రాణభిక్ష

పెట్టినందుకు చేతులు జోడించి కృతజ్ఞత తెలియజేస్తాడేమో, భవిష్యత్తులో తన దయాదాక్షిణ్యాల కోసం దరఖాస్తు చేస్తాడేమో విందామని ఫిర్‌ఔన్ చెవులు ఎదురు చూశాయి. కాని అతనాశించినదానికి ఫిర్‌ఔన్ ఎదుట వారు ఈనాటి వరకు ఎవరూ పలకని పలుకులు నిండుదర్బారులో పలుకగానే దర్బారువారి ఎదుటే వారిద్దరిని అవమానించాలనే ఉద్దేశ్యంతో ఫిర్‌ఔన్ ఉగ్రుడై అడిగాడు, "సరే, నిన్ను ఆ విశ్వప్రభువు పంపాడంటున్నావు. అతనితో నీకేమిటి సంబంధం? ఆ విశ్వప్రభువు ఎవరు?" హజ్రత్ మూసా జవాబిచ్చారు. "ఎవరయితే భూమ్యాకాశాలకు ప్రభువో, ఇంకా భూమ్యాకాశాల మధ్యనున్న దానికంతటికీ యజమానో, ఆయనే నా నిజప్రభువు. ఆయనే ఈ సమస్తాన్నీ సృజించాడు. ఆయనే అందరికీ మార్గదర్శకుడు."

ఇది విన్న ఫిర్‌ఔన్ ఏం జవాబిస్తాడు? తానేమో తన దర్బారువారితో, "నేనే మీకందరికీ పెద్ద దైవాన్ని" అని అన్నాడు కదా! ఇప్పుడేమో నిండు దర్బారులో మరొక వ్యక్తి నిలబడి, నిజదైవం ఒకడున్నాడు, ఈ సృష్టికి కర్త, యజమాని ఆయనే. ఆయనే ఈ సృష్టిని పర్యవేక్షిస్తున్నాడు అని అంటున్నాడాయె. ఫిర్‌ఔన్ తన దర్బారీల సంతృప్తి కోసం ఏదో ఒకటి చేయాలి. "అసలు ప్రభువును నేనే, మరొకరెవరూ లేర"ని రుజువు చేయాలి. లేకపోతే అతని బండారం బయటపడుతుంది. కాని ఈ పని ఫిర్‌ఔన్ సాధ్యమా? ఇక ఇప్పుడేం చేస్తాడు? వ్యవహారాన్ని అషామాషీ చేయాలని చూశాడు. దర్బారువారినుద్దేశించి, "ఈయనగారేమంటున్నారో వింటున్నారా?" అని ప్రశ్నించాడు.

హజ్రత్ మూసా(అస్సలామ్) వెంటనే, "అవును, ఆ ప్రభువే నీకూ ప్రభువు, నీ తాతముత్తాతలకూ ప్రభువు" అన్నారు.

ఫిర్‌ఔన్ ఆయన మాటల్ని పట్టించుకోకుండా దర్బారులోని వారి దృష్టిని మళ్ళించడానికి ఇలా అన్నాడు- "చూశారా మీరు, ఈయనగారు మీకు ప్రవక్తగా ప్రభవింపజేయబడ్డాడట, పిచ్చివాడిలా ఉన్నాడు."

హజ్రత్ మూసా(అస్సలామ్) తన ఉపన్యాసం కొనసాగిస్తూ అన్నారు. "అవును, ఆ ప్రభువు ఇక్కడున్న ప్రతి వస్తువుకూ యజమానే. నీకు జ్ఞానం ఉంటే

సృష్టిలోని ఈ వ్యవస్థను చూడు, నేనేమి చెబుతున్నానో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు".

ఫిర్ఔన్ దర్బారులో దేవుని నిదర్శనం

ఫిర్ఔన్ ఈసారి మళ్ళీ ప్లేటు ఫిరాయించాడు. "సరే, ఇప్పటివరకు చని పోయినవారి గతి ఏమిటి?" అని అడిగాడు. అలా అడగటంలో ఎంతో కాపట్యం ఉన్నది. "వారంతా మార్గభ్రష్టులే" అని మూసా(అస్సలామ్) జవాబిస్తారని ఫిర్ఔన్ నమ్మాడు. ఒకవేళ మూసా(అస్సలామ్) ఆవిధంగా జవాబిచ్చారంటే దర్బారు లోనివారంతా ఉగ్రులై ఒక్కసారిగా ఆయన మీద విరుచుకుపడతారు. వారి పూర్వీకుల్ని మార్గభ్రష్టులంటే వారెలా సహిస్తారు? కాని ప్రవక్తలు ఇటువంటి వాదాలలో తలదూర్చరు. వారు సవ్యమైన, సత్యమైన మాటల్నే పలుకుతారు. మూసా(అస్సలామ్) "నా ప్రభువు వారిని గురించి బాగా ఎరుగు. ఏ విషయమూ ఆయన దృష్టి నుండి వైదొలగడంకాని, ఆయన మర్చిపోవడంగానీ జరగదు. ఆ ప్రభువే మీ కోసం ఈ భూమిని పాన్పుగా పరచాడు. అందులో మీ కోసం మార్గం సుగమం చేశాడు. ఆకాశాన్నుండి వర్షం కురిపిస్తాడు. ఆయన అన్నిరకాల చెట్ల జంటలను పుట్టించాడు. మీరూ తినండి, మీ పెంపుడు జంతువులకు కూడా తినిపించండి. వీటన్నింటిలోనూ వివేకవంతులకు ఎన్నో నిదర్శనాలున్నాయి" అని అన్నారు.

ఈ ఉపన్యాసాన్ని మీరు గమనించారా? కేవలం చనిపోయినవారితో అల్లాహ్ ఎలా వ్యవహరించాడన్న విషయాన్ని పట్టుకువ్రేలాడటం వల్ల ప్రయోజనం ఏమీలేదు అని మూసా(అస్సలామ్) స్పష్టం చేశారు; "అల్లాహ్‌కు గల జ్ఞానం అపారమయినది. ఎవరికి ఏవిధంగా ప్రతిఫలం లభించాలో ఆయనకు బాగా తెలుసు. ఏ విషయాలయితే అల్లాహ్‌కు సంబంధించినవో వాటిలో తలదూర్చే బదులు మానవుడు తన చుట్టూ విస్తరించి ఉన్న దైవాను గ్రహాలను శ్రద్ధగా గమనించాలి. అన్ని వరాల ప్రదాత అయిన అల్లాహ్ హక్కులు

తనపై ఏమున్నాయి? తాను ఆ సృష్టికర్త యెడల ఏవిధంగా మెలగాలి? తాను అవలంబించవలసిన వైఖరి ఏది? వీటన్నిటినీ గురించి మానవుడు తన బుద్ధీ వివేకాలతో తెలుసుకోవాలి. ఇది వివేకవంతుల విధానం. దానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం కేవలం పెంకితనమే.

ఫిర్ఔన్ ఈ ప్రబోధనలను వినడానికి ఎంత మాత్రం సుముఖంగా లేడు. ఈ మాటలన్నీ విని దిగ్గున లేచాడు. "అదేం కాదు. యజమాని, ప్రభువును నేనే. మమ్మల్ని కాదని ఎవరయినా ఇతరుల్ని పాలకునిగా అంగీకరిస్తే వారిని జైల్లో కుక్కించి కుళ్ళబెడతాను, జాగ్రత్త!" అని బెదిరించాడు.

హజ్రత్ మూసా(అస్సలామ్) ఈ బెదిరింపులకు లొంగలేదు. "సరే, నేను చెప్పేదంతా నా తరపున చెప్పడంలేదని, నన్ను దేవుడే ఈ సందేశమిచ్చి పంపాడని చెబితే మీరు నమ్మటం లేదు. నేనేదైనా స్పష్టమయిన నిదర్శనం చూపిస్తే అప్పుడైనా మీరు నా మాటలను విశ్వసిస్తారా? అని ప్రశ్నించారు. బదులుగా ఫిర్ఔన్, "సరే, అదేదో చూపించు" అన్నాడు.

హజ్రత్ మూసా(అస్సలామ్) తన చేతికర్రను క్రిందపడవేశారు. చూస్తుండగానే అదొక పాముగా మారిపోయింది. తన చేతిని చంకలో పెట్టి బయటికి తీశారు. అక్కడి వాళ్ళందరూ ఆ చేయి మెరిసిపోవడం చూశారు.

ఇప్పుడు ఫిర్ఔన్ తన దర్బారులోనివారిని తృప్తిపరచడానికి వెంటనే అన్నాడు- "వీళ్ళు పచ్చి మంత్రగాళ్ళు. తమ మాయాజాలంతో మిమ్మల్ని మీ దేశం నుండి తరిమివేయాలని చూస్తున్నారు. ఇక మీరే చెప్పండి, వీళ్ళకు ఎలా బుద్ధి చెప్పాలో?"

దర్బారువాసులు ఆలోచించారు.

ఇతని తల తీసెయ్యడం చాలా తేలిక. కాని మూసా(అస్సలామ్) నేడిక్కడ చెప్పిన మాటలే చాలా చోట్ల చెప్పి ఉన్నాడు. కొందరి మనస్సులపై ఆయన మాటల ప్రభావం పడే ఉంటుంది. ఆయన చేతికర్ర పాముగా మారిందన్న విషయం అందరికి తెలిస్తే ప్రజల హృదయాల్లో అతని మాటల విలువ ఇంకా

పెరిగిపోవచ్చు. కాబట్టి అతన్ని చంపడంతోనే ఈ ఉపద్రవం- అణగిపోదు. దీనికి మరో మందు ఏదన్నా చూడాలి.

ఎట్టకేలకు ఫిర్ఔన్ సలహాదారులు ఒక నిర్ణయానికి వచ్చారు.

"మహారాజా! మూసా(అస్సలామ్)ను, ఆయన సోదరుణ్ణి కొంతకాలం పాటు వారి స్థితిపైనే వదిలెయ్యండి. దేశంలోని మాంత్రికులందరూ సమావేశం కావాలని చాటింపు వేయండి. మాంత్రికులు వచ్చాకనే వీళ్ళ అంతు తేలుద్దాం. మంత్రానికి మంత్రమే విరుగుడు" అన్నారు.

మాంత్రికులతో పోటీ

దేశవ్యాప్తంగా రాజాజ్ఞ చాటింపు వేయబడింది. కొద్ది దినాలలోనే బాణామతి (జాదు)లో ఆరితేరినవారంతా రాజధానికి చేరుకున్నారు.

ఫిర్ఔన్, మూసా(అస్సలామ్)తో అన్నాడు, "ఇప్పుడు నీ మంత్ర విద్యని మంత్రాలతోటే ఎదుర్కొంటాము. ఏ రోజు కాసుకుంటావో నిర్ణయించుకో. ఆ రోజు నువ్వు, మేమూ ఒకే మైదానంలో పోటీకి తలపడదాం".

"నీ పండగ రోజు ఈ పనికి తగినదిగా ఉంటుంది. ఆ రోజు ప్రముఖుల నందర్నీ సమావేశపరచు" అని హజ్రత్ మూసా(అస్సలామ్) అన్నారు.

పోటీ జరగాల్సిన రోజు నిర్ణయమైంది. ఫిర్ఔన్ సన్నాహాలను ఆరంభించాడు. అటు మూసా(అస్సలామ్) మరోసారి ప్రజలకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. ఆయన మాంత్రికులకు కూడా తన సందేశం వివరించారు. దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోక జీవిత వాస్తవికతను విశదీకరించి ఇస్లామీయ సందేశ సారాన్ని తెలియజేసి, "చూడండి! మీరు చేస్తున్నదాంట్లో మీకు లభించేది దిక్కులేని చావు మాత్రమే. మీరు కల్పించిన షిర్క్(బహు దైవారాధన)ను అల్లాహ్‌కు ఆపాదించకండి. ఆయన సందేశాన్ని ఈవిధంగా తిరస్కరించకండి. తిరస్కరిస్తే దైవానుగ్రహం మీపై విరుచుకుపడవచ్చు అల్లాహ్‌ను ఎదిరించి తలబిరుసుతనంతో వ్యవహరించేవారు నాశనం కావడం తథ్యం" అని హెచ్చరించారు.

హజ్రత్ మూసా(అస్సలామ్) ప్రబోధన విని ప్రజలు కాస్త ఆలోచనల్లో పడ్డారు. ఈ పరిస్థితిని గమనించిన ఫిర్ఔన్, అతని సర్దారులు కలవరపడ్డారు. పరస్పరం సంప్రదించుకున్నారు. చాలాసేపు తర్జనభర్జన జరిగాక హజ్రత్ మూసా (అస్సలామ్)కు వ్యతిరేకంగా ప్రచారం చేసి ప్రజాభిప్రాయాన్ని తమ కనుకూలంగా మలచుకోవాలని నిర్ణయించారు. వారు ఆ ఆయుధాన్నే (అబద్ధపు ప్రచారం) ప్రయోగించారు. ఏదయితే నేటికీ ఇటువంటి పరిస్థితులలో సాధారణంగా ప్రయోగించబడుతోందో.

ఫిర్ఔన్ అనుచరులు దేశ ఔన్నత్యాన్ని కొనియాడారు. తమ సంస్కృతి పట్ల వారికిగల అభిమానాన్ని ప్రకటిస్తూ జనాన్ని తమవైపుకు త్రిప్పుకోవాలని ఎత్తుగడ వేశారు. "ఈ ఇద్దరెవరో మీకు తెలుసా? ఇద్దరూ పెద్ద మాయగాళ్ళు. వీళ్ళు తమ మంత్రతంత్రాల ద్వారా మిమ్మల్ని మీ దేశం నుండి తరిమివేయాలని చూస్తున్నారు. మీకు ప్రియమైన మతాన్ని, ఉత్తమ నాగరికతని కూకటివేళ్ళతో పెకిలించి పారేయాలని కుట్రపన్నుతున్నారని" దుష్ప్రచారం చేయసాగారు.

మూసా(అలైహిస్సలామ్) కూడా తన సందేశ ప్రచారాన్ని ఆపలేదు. తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే ఉన్నారు. ఆయన వ్యతిరేకులు మూసా (అలైహిస్సలామ్), హారూన్ (అలైహిస్సలామ్)లు చెప్పేదంతా అబద్ధమని సహేతుకంగా ప్రజల్లో చాటవలసింది. కాని అధర్మం ఎన్నటికీ ధర్మం ముందు నిలవజాలదు. అంచేత అధర్మ పూజారులు ఎప్పుడూ ఇటువంటి (దుష్ట) విధానాలనే అవలంబిస్తారు. సత్యధర్మ ప్రచారం చేసేవారిని గురించి దుష్ప్రచారం చేస్తూ వారిపై నీలాప నిందలు మోపుతారు. వాళ్ళు అలాంటివారు, ఇలాంటివారని, వారి ప్రచార లక్ష్యం రాజ్యకాంక్షేనని, మీనుండి అధికారం చేజిక్కించుకుని సర్వాధికారుల వుతారని, మీ తాత ముత్తాతల ఆచార వ్యవహారాలు అంతమైపోతాయని రకరకాలుగా హెచ్చరించేవారు ఆ అధర్మ పూజారులు.

ఫిర్ఔన్ కావించిన ఈ ప్రాపగాండ ఫలితంగా, మూసా (అలైహిస్సలామ్) వైపుకు- అంటే సత్యధర్మం వైపుకు- మరలగలిగేవారిలో కూడా స్తబ్దత ఆవరించింది. కాని మూసా(అలైహిస్సలామ్) సందేశ ప్రభావం పూర్తిగా సమసి పోవాలంటే ఈ మాత్రం ప్రచారం చాలదు. మూసా(అలైహిస్సలామ్) చూపిన

దంతా మంత్ర ప్రభావమే అయితే దేశం నిండా గొప్పగొప్ప మంత్రగాళ్ళు న్నారు. ఆ రోజుల్లో మంత్రాల ప్రభావం హెచ్చుగా ఉండేది. కాబట్టి దేశానికి, జాతికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్న వారిని తగిన రీతిలో గట్టిగా ఎదుర్కోవాల్సి ఉంది. అందుకోసం గొప్పగొప్ప మంత్రగాళ్ళందరూ సర్వసన్నద్ధులై రంగప్రవేశం చేశారు. ఇక ఇప్పుడు ఎవరు గెలిస్తే వారు సర్వాధికారులు. ఒకవేళ మూసా (అలైహిస్స లామ్) పెద్దపెద్ద మంత్రగాళ్ళను ఓడించినట్లయితే ఆయన మంత్రగాడు కాదు. ఆయన చెపుతున్నదంతా నిజమే అవుతుంది. అలాకాక ఒకవేళ ఆయన మంత్రగాడే అయితే ఆయన రంగంలో నిలువజాలడు. పలాయనం చిత్త గించాల్సిందే.

పోటీ తీవ్రంగా ఉంది. ఫిర్ఔన్ అధికారం, పరువు ప్రతిష్టలు ఆ పోటీ ఫలితాలపై ఆధారపడి ఉన్నాయి. కాని మాంత్రికులకు ఒక ఉన్నత ఆశయం అంటూ ఏదీ ఉండదుగా! తమ క్షుద్ర విద్యను నేర్పుగా ప్రదర్శించి భుక్తిని సంపాదించుకోవటమే వారి లక్ష్యం. ఇప్పుడు వారి లక్ష్యసాధనకు భలే మంచి బేరం. కాబట్టి రేటు మాట్లాడుకుని మరీ పని మొదలుపెడదామని ఆ మాంత్రి కులు తలంచారు. "ప్రభూ! మేం గెలిస్తే మా బహుమతి మాకు లభిస్తుంది కదా!" అనడిగారు.

"ఎందుకు లభించదు? మిమ్మల్ని మేము ఆస్థానంలో నిలయ విద్వాం సులుగా చేర్చుకుంటాం" అన్నాడు ఫిర్ఔన్. ఇంత పెద్ద హోదాను పొందగలమనే ఆశ మాంత్రికులకు లేకపోయినా ఫిర్ఔన్ ఇచ్చిన హామిని విని వారు ఆనందంతో పొంగిపోయారు, మూసా(అలైహిస్సలామ్)తో, చెప్పు, ముందు నీ మంత్రశక్తిని ప్రదర్శిస్తావా? లేక మా ఎత్తుల్ని ప్రారంభించమంటావా?" అని ప్రశ్నించారు.

"ముందు మీరే మీ ఎత్తులు ప్రారంభించండి" అన్నారు మూసా (అస్సలామ్). మంత్రగాళ్ళు తమ కర్రలను, త్రాళ్ళను విసిరారు. ఫిర్ఔన్ ఔన్నత్యం సాక్షిగా మేము తప్పక విజయం సాధిస్తాము" అని అన్నారు వారు.

వారు ప్రదర్శించిన విద్య అక్కడివారందరినీ సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తింది.

సత్యం వచ్చేసింది

వాళ్ళ చేతబడి ప్రభావం ఎంత ఉధృతంగా ఉందంటే, అక్కడున్న వారంతా కనికట్టు ప్రభావంలో పడిపోయారా! అనిపించింది.త్రాళ్ళు, లాఠీలు పాములుగా మారి జరజరా ప్రాకుతున్నట్లు తోచింది వారికి. నలువైపులా భయానక వాతావరణం అలుముకుంది. ఈ పరిస్థితిని చూసిన మూసా (అలైహిస్సలామ్)కు భయంవేసింది. ప్రజలు చేతబడి ప్రభావానికి లోనై తన సందేశాన్ని అబద్ధమైనదిగా భావిస్తారేమో! ఈ ఆలోచన కలిగిన వెంటనే అల్లాహ్ ఆయనకు ధైర్యం కలిగించాడు. దైవాదేశం వినబడింది:

"మూసా! ఏ మాత్రం భయపడనవసరం లేదు. ఆధిక్యత నీదే. నీ చేతి లోని కర్రను క్రింద వేయి. ఇక చూడు వాళ్ళు వేసిన ఎత్తులు ఇప్పుడే చిత్తవు తాయి. వారు చేసింది మంత్ర ప్రయోగమే కదా! మంత్రాల పునాదిపై ఏ ఉద్యమ మైనా నిలబడగలుగుతుందా?"

మూసా(అలైహిస్సలామ్) తన చేతి కర్రను విసిరారు. అది కొండచిలువగా మారింది. అది ఎటు వెళితే అటు మంత్రప్రభావం క్షీణించసాగింది. మంత్రవేత్తల శ్రమ అంతా చీకటిలో బూడిద మీద వేసిన పన్నీరైందని ప్రజలందరూ గ్రహించారు.

విచిత్రమైన దృశ్యం అది. ఫిర్ఔన్, అతని సభికులు విస్మయాందోళన లతో నిల్చుండిపోయారు. అసలేం జరుగుతుందో వారికి అంతుపట్టలేదు.

ఇటు మంత్రగాళ్ళకూ ఏమీ పాలుపోలేదు. మంత్రవిద్యలో తమను ఓడించగలవారెవరూ లేరని వాళ్ళకు గట్టి నమ్మకం ఉండేది. ఇప్పుడేమో వాళ్ళ మంత్రాలు క్షణంలో పనికిమాలినవయ్యాయి. వారి కళ్ళ ముందు ఉరుము ఉరిమినట్లయింది. యదార్థం వారి ముందుకు వచ్చింది. వారికి మూసా(అలైహి స్సలామ్) చెప్పేదంతా సత్యం అని విశ్వాసం కలిగింది. నిశ్చయంగా ఈయన దైవప్రవక్తయేనని వారు నమ్మారు.

అసలు యజమాని, ప్రభువు అల్లాహ్‌యేనని, ఫిర్‌ఔన్ కాదని మంత్ర గాళ్ళు గ్రహించారు. మూసా(అలైహిస్సలామ్) దైవప్రవక్త. ఆయన ఇచ్చే సందేశం నిజమయింది. ఈ ప్రాపంచిక జీవితం శాశ్వతం కాదు, దీని తర్వాత శాశ్వతంగా ఉండే మరో జీవితం రానున్నది. అసలు విజయం ఆ జీవితంలో సాధించే విజయమే- ఈ నమ్మకం, విశ్వాసం దృఢమైనాక వారి దృష్టిలో ఫిర్‌ఔన్ పట్ల గల భక్తిభావం పటాపంచలయి పోయింది. ఇప్పుడు ఫిర్‌ఔన్ వేసే శిక్షల భయంగాని, అతని బహుమానాల పేరాశగాని వారిలో లేదు. ఎందుకంటే ఫిర్‌ఔన్ విధించే శిక్షలు కాని, అతడిచ్చే పారితోషికాలుగాని ఐహిక జీవితంతోనే సంబంధం కలవి. అయితే వారి దృష్టిలో ఇప్పుడు, తర్వాత రాబోయే శాశ్వతమైన పరలోక జీవనం ఉంది. అక్కడి విజయమే అసలు విజయం. ఆ విజయం అల్లాహ్‌పై విశ్వాసం ఉంచటం మరియు దైవప్రవక్తను గుర్తించడంతోనే ముడిపడి ఉంది.

ఈ విషయాలన్నీ మంత్రగాళ్ళ హృదయాల్లో ఎంత దృఢంగా నాటుకున్నా యంటే వారు ఏ విధమయిన యుక్తిని ప్రదర్శించడంగాని, తాము తీసుకునే నిర్ణయానికి ఇది సరయిన సమయం అవునా? కాదా? అని కూడా ఆలోచించ లేదు. వెంటనే వారు సాష్టాంగపడి, "మేము విశ్వసిస్తున్నాము. ఇహపరాలకు ప్రభువు, యజమాని ఎవరో, ఎవరి దాస్యం అయితే మూసా(అలైహిస్సలామ్), హారూన్ (అలైహిస్సలాం)లు చేయమని ప్రజలకు ఉద్బోధిస్తున్నారో, ఆ దైవాన్ని మేము విశ్వసిస్తున్నాం" అన్నారు.

ఫిర్‌ఔన్ దీనికి ఏమాత్రం సిద్ధంకాలేదు. మాంత్రికుల ఈ చర్య వలన వ్యవహారమంతా బెడిసికొట్టింది. మూసా (అలైహిస్సలామ్) సందేశం బలహీన పడేందుకు, దాని ప్రభావం రూపుమాపేందుకు అతడీ పథకం వేశాడు. కాని అది కాస్తా లాభించే బదులు అతనిపైకే ఎదురుతిరిగింది. ఇటువంటి గొప్ప మాంత్రి కులు ఫిర్‌ఔన్ సమక్షంలో ప్రాణాల్ని సయితం లెక్కచేయక, నిండుసభలో మూసా(అలైహిస్సలామ్) ప్రదర్శిస్తున్నది మంత్రజాలం కాదని ప్రకటించారు. ఇక మూసా (అలైహిస్సలామ్) మంత్రగాడని చెప్పి ప్రజలను ఆయన సందేశాన్ని విననీయకుండా నిరోధించడానికి ఇప్పుడు అవకాశం ఏదీ?

ఇక్కడ ఒక విషయాన్ని ఆలోచించాలి. మూసా(అలైహిస్సలామ్) సందేశం ఎదుటే ఉన్నది. ఫిర్ఔన్‌కు, అతని భజనపరులకు మూసా(అలైహిస్సలామ్) అనేక విధాలుగా హితోపదేశం చేసే ప్రయత్నం చేస్తూనే వచ్చారు. కొంతకాలంగా ఈ ప్రయత్నం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ఫిర్ఔన్ మాత్రం తన స్థానం నుంచి కదలలేదు. అతని భట్రాజులు కూడా సన్మార్గానికి మళ్ళలేదు. కాని మంత్రగాళ్ళను చూడండి, మూసా(అలైహిస్సలామ్) ఇచ్చిన దైవసందేశం వారి చెవిన పడగానే వారు దాన్ని అర్థం చేసుకున్నారు. మూసా(అలైహిస్సలామ్) ప్రదర్శించిన అద్భుత మహిమల్ని చూసిన తర్వాత ఇది జాలవిద్య, మంత్ర తంత్రాల విద్య కానేకాదన్న విశ్వాసం కూడా వారిలో కలిగింది. ఆ తర్వాత వారు ఒక్క నిమిషం కూడా వేచి చూడక అప్పటికప్పుడే నిండు సభలో అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించారు. జన సమూహం నిష్క్రమించిన తర్వాత మూసా(అలైహిస్సలామ్) సమక్షంలో విశ్వసించుదాంలే అని కూడా వారు ఆగలేదు.

ఈ రెండు స్వరూపాలూ మనముందున్నాయి. వీటిని పరిశీలించండి. ప్రబోధనా మార్గాన్ని నిరోధించేవాటిలో అన్నింటికన్నా పెద్ద అడ్డంకులు ధనం, అధికారమదం మాత్రమే అని సులభంగా అర్థమవుతుంది. మనిషి ఏదో రకంగా అధికారంలోకి వస్తాడు. పరిపాలనాధికారాలు పొందిన తర్వాత దైవదాసులకే దైవమై కూర్చుంటాడు. అటువంటి పరిస్థితులలో అతడు తన పీఠం దిగి, దైవదాసులకు దైవం అయ్యే బదులుగా దైవానికి దాసుడుగా మారడం అంటే అతనికి సహించరాని విషయమైపోతుంది. మానవులలో ఈ "దైవత్వం" ఒకసారి రాచరికపు రంగుల్లోనూ, మరొకప్పుడు జాతి నాయకుని వేషంలోను, ఇంకొకప్పుడు మతాధికారి రూపంలోను వచ్చేస్తుంటుంది.

అనుకున్నదొకటి జరిగింది మరొకటి

పరిస్థితిని గమనించిన ఫిర్ఔన్ వెంటనే ప్లేటు మార్చేశాడు. "ఏమిటీ? మీరంతా నా అనుమతి లేకుండానే విశ్వాస ప్రకటన చేసేస్తారా? ఇప్పుడు తెలిసింది మీ అసలు సంగతి. మూసా మీ అందరి గురువు అన్నమాట! మీరంతా

కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రపన్నారు ఈ దేశస్థుల్ని తరిమివేయాలని. ఇక్కడి ప్రభువులవ్వాలని అనుకుంటున్నారా మీరు? అయితే వినండి! మీ కుట్ర విజయవంతం కాజాలదు. మీకేగతి పట్టనున్నదో మీకు ఇప్పుడే తెలుస్తుంది- మీ కాళ్ళు చేతులు నరికి మిమ్మల్ని ఉరికంబం ఎక్కిస్తాను, అప్పుడు మీకు తెలిసి వస్తుంది, కఠిన శిక్ష విధించేది ఎవరో- అని రంకెలు వేశాడు."

ఫిర్ఔన్ ఉగ్రరూపం చూసి ఎంతమంది గడగడలాడిపోయారో తెలీదు. ఈనాటికీ మనం చూస్తుంటాం, తన అధికారాసనానికి ముప్పువాటిల్లినప్పుడు, ఒక మనిషి మరో మనిషికి తాను ఇవ్వగలిగినంత కఠినాతి కఠినమయిన శిక్షను ఇవ్వడం సమంజసమేకాక అత్యవసరం అని కూడా భావించబడుతోంది- ఈ అధికారాన్ని స్వయంగా ప్రజలే ఇచ్చినా, దానిపై ప్రజాస్వామ్యం, ప్రజాభీష్టం వంటి బురఖాలు ఎన్ని తగిలించినా సరే!

ఇక ఫిర్ఔన్ సంగతి సరేసరి. అధికారానికి ఏకైక యజమాని. అతడు చేసే ప్రతి సైగ చట్టంతో సమానం. అతను వెలిబుచ్చే ప్రతి కోరిక న్యాయ సమ్మతం.

జన సమూహంలో నిశ్శబ్దత ఆవరించింది. ఆశ్చర్యంగా ఒకర్నొకరు చూసుకోసాగారు. ఫిర్ఔన్ ప్రకటనలోని భయంకర దృశ్యం అందరి కళ్ళెదుట నాట్యం చేసినట్లనిపించింది.

కాని- నేరస్థులుగా పరిగణించబడినవారి పరిస్థితి! వారిలో ఏవిధమైన భయాందోళనలు లేవు. ఫిర్ఔన్ ప్రకటనను వారు ఒక చెవితో విని రెండో చెవితో వదిలేశారు. విశ్వాసబలం ఎంతో గొప్పది. దాని శక్తి ముందు మరోశక్తి ఏదీ నిలువ జాలదు. ఎవరి హృదయంలోనయితే దైవభీతి చోటుచేసుకుంటుందో వారి దృష్టిలో ఇతర ఏవిధమైన భీతి కూడా భీతి కాజాలదు. ఇంతకుముందు పారి తోషికాల భిక్ష కోరుకున్న మంత్రగాళ్ళు ఈ "ప్రకటన" విని సజ్దా నుండి తల ఎత్తి ఇలా పలికారు:

"దానివల్ల జరిగేదేముంది? ఏ యదార్థమైతే మా ముందు స్పష్టంగా వచ్చేసిందో దానికి వ్యతిరేకంగా మేము మీ మాటకు ఎలాంటి ప్రాధాన్యతనూ ఇవ్వలేము. ఇప్పుడు మాకు ఏవిధమైన భయంలేదు. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. మహా అయితే ఇహలోక జీవితంపై మాత్రమే మీ పెత్తనం సాగుతుంది. ఆ తరువాత మీరేమీ చెయ్యలేరు. మేమైతే ఆ మా ప్రభువు వద్దకే పోవలసి ఉంది. ఆయన్నే మేమిప్పుడు మా యజమానిగా అంగీకరించాము కూడా. ఆయన దయాదాక్షిణ్యాలపై మాకు విశ్వాసముంది. ఆయన్ను విశ్వసించ డంలో మేము అందరికన్నా ముందు ఉన్నాం. కాబట్టి ఇప్పటివరకు మా వల్ల జరిగిన లోపాలను ఆయన తప్పక క్షమిస్తాడు. సత్యవంతుడయిన ఆయన ప్రవక్తకు వ్యతిరేకంగా మమ్మల్ని నిస్సహాయుల్ని చేసి మంత్రజాలం పేరుతో మా చేత ఆడింపజేసిన ఆటను కూడా ఆయన క్షమిస్తాడు. ఇప్పుడు మా ముందు వాస్తవం తేటతెల్లమయింది. అల్లాహ్‌యే అందరికన్నా గొప్ప ప్రభువు, యజమాని. ఆయనకు నశింపులేదు. మానవుడు ఆయన సమక్షంలో తిరుగుబాటు దారుడుగా, ద్రోహిగా నిలబడ్డాడు. ఇది అన్నింటికన్నా ఘోరమయిన దురదృష్టం. ఇటువంటి ద్రోహుల కోసం ఆయన వద్ద నరకం ఉంది. నరకంలో మనిషి జీవితం పట్ల విరక్తి చెందుతాడు. కాని విముక్తి పొందేందుకు అతనికి చావు మాత్రం రాదు. ఆయన ముందు విశ్వాసిగా నిలబడేవాడే ధన్యుడు. అతని సత్కర్మల జాబితా కూడా అతని వెంట ఉంటుంది. ఇటువంటి వారికోసమే ఉన్నతమైన స్థానాలు ఉన్నాయి. నివసించడానికి సదా సస్యశ్యామలమైన తోటలున్నాయి. అందులో కాలువలు ప్రవహిస్తుంటాయి. అక్కణ్ణే వీరు శాశ్వ తంగా ఉంటారు. ఈ బహుమతి, తమ జీవితాలను దైవాభీష్టం ప్రకారం మలచు కున్న వారికే లభిస్తుంది. ఇక మీరు మమ్మల్ని శిక్షిస్తామంటున్నారు. దాన్ని గురించి మీరు కూడా ఆలోచించుకోండి. మేము మీకు కలిగించిన నష్టం ఏమిటి? మా ముందు మా ప్రభువు యొక్క స్పష్టమైన నిదర్శనాలు వచ్చేయగా, సత్యం మాకు తేటతెల్లమైపోగా మేమాయన్ని విశ్వసించాము. ఇక ఇప్పుడు మీరు ఏం చేయ దలచుకుంటారో చేసుకోండి."

మేము మాత్రం మా ప్రభువును ప్రార్థిస్తున్నాం. "ఓ మా యజమాని! మేము నీ మార్గంలో స్థిరంగా ఉండగలిగేలా మాపై నీ కారుణ్యాన్ని వర్షింప జెయ్యి. ఏ ధర్మాన్నయితే మేము స్వీకరించామో దాని అనుసరణలో మా కాళ్ళు ఎలాంటి పరిస్థితిలోనూ తడబడకుండా చేయి. అన్ని సమయాల్లోనూ కష్టాల్ని చిరునవ్వుతో సహించగలిగే శక్తిని ప్రసాదించు. మృత్యువు కూడా మమ్మల్ని మా స్థానం నుండి కదల్చకూడదు. మాకు చావు వచ్చినా, మేము నీ ఆజ్ఞాబద్ధులమై విశ్వసనీయులమై ఉన్న స్థితిలోనే రానివ్వు."

నవ ముస్లిమ్‌ల ఈ ప్రసంగం, ఈ వేడుకోలు దర్బారు స్వరూపాన్నే మార్చే సింది. ఫిర్‌ఔన్ అనుకున్నదొకటైతే జరిగింది మరొకటి. మూసా(అస్సలామ్) సందేశ ప్రభావం, ఆయన ఉపదేశాల వల్ల ఏర్పడిన పరిస్థితుల్ని తారుమారు చేయడానికే ఫిర్‌ఔన్ ప్రజల్ని సమీకరించాడు. కాని ఈ దృశ్యం తిలకించాక వారి దృష్టిలో మూసా(అలైహిస్సలామ్)విలువ వంద రెట్లు పెరిగిపోయింది. ఇక ఫిర్‌ఔన్, అతని భజనపరులు ఈ ప్రభావాన్ని అణచడానికి కొత్త పన్నాగాలు పన్నసాగారు.

ఇస్రాయీల్ జాతిలో ఇస్లాం సందేశ ప్రభావం

ఒక బహిరంగ ప్రదేశంలో, ప్రజా సమూహం సమక్షంలో పిర్‌ఔన్ పరా జయం పాలవటం, మంత్రగాళ్ళు విశ్వాస ప్రకటన చేయడం మామూలు విషయం కాదు. ఈ సంఘటన తర్వాత ఫిర్‌ఔన్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ప్రభవించి, అధిక సంఖ్యాకులు మూసా(అలైహిస్సలామ్)ను విశ్వసించడం జరగవలసింది. కాని తాతముత్తాతల ఆచార వ్యవహారాలు, జాతీయతత్వం, మతతత్వం కళ్ళు మూసుకుపోయేలా చేస్తాయి. సత్యం కళ్ళ ముందుకు వచ్చిన తర్వాత కూడా దాన్ని అనుసరించడానికి మనసంగీకరించదు. రకరకాల ఆలోచనలు ముసురుకుంటాయి. తాము ఈనాటి వరకు అవలంబించిన ఆచారాలను వదిలేస్తే దానర్థం ఏమిటి? ఇప్పటివరకూ తాము, తమ తాత ముత్తాతలు తప్పుడు మార్గాన్ని అవలంబించినట్లే కదా అని ఒకసారి అనుకుంటే,

మూసా(అలైహిస్సలామ్) బోధించే ధర్మాన్ని స్వీకరిస్తే తమ ప్రాచీన సంస్కృతి మంట కలసిపోతుందే అని మరోసారి అనుకునేవారు. ఈ సంస్కృతిలో పురాతన తత్వం తప్ప మరో మేలు లేకపోయినా ఒక్కోసారి కొందరి అంధానుసరణ కూడా అడుగు ముందుకు వేయనీయదు. వాస్తవం అర్థమై పోతుంది. కాని వెంటనే ఈ మాటే నిజమైతే ఫలానావారు తప్పక ఒప్పుకోవాలే! ఏం, ఆయన మనకన్నా తక్కువ జ్ఞానం కలవాడా అని చెప్పి దాటవేస్తారు; కొన్ని సమయాల్లో అధికార పిపాస ముందుకు పోనీయదు. అతని అంతర్యం లోలోనే అతనిలోని గుణాల్ని పొగుడుతుంది. నీకన్నా హీనుడు నీ ముందుకు దిగదుడుపు అయినటు వంటి వాడి మాటను ఎలా ఒప్పుకుంటావు? అని ప్రశ్నిస్తుంది. ఇంకోసారి జ్ఞానం, నియమనిష్టల గర్వం దారికడ్డంగా నిలబడతాయి. యదార్థాన్ని అర్థం చేసుకునే బదులు యదార్థాన్ని వివరించేవాడిని ఎగాదిగా చూడటం జరుగుతుంది. అంతర్యం హెచ్చరిస్తుంది- ఒకవేళ ఈ అల్పుని మాటలు వింటే జనం వాడి వెనుకపడతారు సుమా! అప్పుడు నీ పలుకుబడి కాస్తా తగ్గిపోదూ?! అని. మరి కొన్ని సమయాల్లో ప్రభుత్వ భయం మనసుల్ని ఆవరిస్తుంది. ప్రజలు సత్యాన్ని సత్యమని ఎరిగి కూడా దాన్నుండి తప్పించుకోవడంలోనే తమ శ్రేయస్సు ఇమిడి ఉందని భావిస్తారు. ఇంకా వీలయితే కాస్తోకూస్తో దానిపట్ల వ్యతిరేకతను కూడా ప్రదర్శిస్తారు.

ఇలాంటి రుగ్మతలు ఎన్నో ప్రబలి ప్రజల్లో దేవుని ఏకత్వభావన పోగొట్టుతాయి. క్రమేణా అజ్ఞానాంధకారం వ్యాపిస్తుంది.

ఫిర్ఔన్ అనుయాయుల పరిస్థితీ ఇంతే. తరతరాలుగా ముష్రిక్‌లుగా జీవిస్తూ వచ్చిన వీరిలో సత్యధర్మాన్ని అనుసరించే చొరవ లేకపోయింది. ఈ స్థితికి బనీ ఇస్రాయీల్ జాతి కూడా లోనైంది. ధర్మం కోరేదేమిటో వారు సంవత్సరాల తరబడి తెలుసుకోలేకపోయారు. ముఖ్యంగా తరతరాలుగా బానిస బ్రతుకు బ్రతికిన కారణంగా దైవప్రవక్తను అనుసరించలేకపోయారు.

మూసా(అలైహిస్సలామ్) ఒకవైపు ఫిర్ఔన్ మరియు అతని జాతివారిలో దైవధర్మాన్ని పరిచయం చేస్తూనే మరోవైపు ఇస్రాయీల్ వంశీయుల్ని సంస్కరించ

సాగారు. వారిలో ఆధ్యాత్మికతను జనింపజేయడానికి ఎడతెగని ప్రయత్నం చేయ సాగారు. మానవత్వానికి అన్నింటికన్నా గొప్ప శాపం బానిసత్వం. ఇక దైవధర్మ మయితే బానిస బ్రతుకుల్లో ఇమడనే ఇమడదు. దైవధర్మం మానవుణ్ణి అన్ని రకాల బానిసత్వాల నుండి, అణచివేత నుండి కాపాడి కేవలం అల్లాహ్ దాస్యం లోనే ప్రవేశింపచేయగోరుతుంది. కాబట్టి, తమ బలహీనత వల్ల ఇతరులకు బానిసలై పోయిన జాతులకు దైవధర్మంతో సంబంధం రోజురోజుకు తరిగిపోతూ ఉంటుంది. ఇస్రాయీల్ వంశీయులకు కూడా అదే గతి పట్టింది. చిరకాలంగా బానిస బ్రతుకులో మ్రగ్గుతూ దైవధర్మంతో వారి సంబంధం కూడా క్షీణించ సాగింది. సాధారణంగా బానిస జాతుల్లో జనించే రుగ్మతలే వారిలోనూ జనిం చాయి. వారిలో జనించిన గొప్ప రుగ్మత ఏదంటే వీరికి కుటీరంకన్నా "పంజరం" ప్రియమైనది. అణిగిమణిగి ఉండే బడుగు జీవితానికి వారు అలవాటుపడి పోయారు. బానిసత్వపు సంకెళ్ళను తెంచుకోలేని పరిస్థితి వారిది.

ఇస్రాయీల్ వంశీయులకు మూసా(అలైహిస్సలామ్) సందేశం కొత్తదేమీ కాదు. పైగా అది వారు మరిచిపోయిన పాఠమే. అయినప్పటికీ మూసా(అలైహిస్స లామ్)కు తోడ్పడటం వారికి కష్టమైపోయింది- ముఖ్యంగా ఆ సమయంలో, మూసా (అలైహిస్సలామ్) పట్ల గల వ్యతిరేకత వల్ల ఫిర్ఔన్, మూసా(అలైహిస్స లామ్) తెగవారయిన బనీ ఇస్రాయీలీయులను తన క్రోధాగ్నికి ఎర చేసినప్పుడు చాలా మంది గగ్గోలు పెట్టారు.

ఫిర్ఔన్ తెగకు చెందిన సర్దారులు ఫిర్ఔన్‌ను హెచ్చరించారు- "మూసా మరియు అతని తెగవారి పట్ల ఈ రకంగా మెతకగా వ్యవహరిస్తూపోతే వారు పెద్ద కల్లోలం లేపుతారు. మీతో సహా మీ దేవతల్ని రంగం నుండి నిష్క్రమింపజేస్తారు."

పరిస్థితి యొక్క ఈ స్వరూపాన్ని అదుపుజేసేందుకుగాను వారొక పథకం రూపొందించారు. ఇస్రాయీల్ వంశీయుల శక్తిని అణగార్చేందుకు వారి మగపిల్లలను పుట్టగానే చంపివేయాలని, కేవలం ఆడపిల్లల్ని మాత్రం బ్రతకనివ్వా లని నిర్ణయించబడింది- మూసా(అలైహిస్సలామ్) జన్మించినప్పటి రాజు ఫిర్ఔన్ కూడా ఇటువంటి ఆజ్ఞనే జారీచేశాడు. ఈజిప్టు ప్రస్తుత పాలకుడైన ఈ ఫిర్ఔన్

కూడా అదే ఆజ్ఞను జారీచేశాడు. ఈ ఆజ్ఞను విన్న ఇస్రాయీల్ వంశీయులు కలవరపడ్డారు. హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) వారికి ధైర్యం నూరిపోశారు. వారి హృదయాల్లో దైవవిశ్వాసాన్ని తాజాపరుస్తూ ఈ కష్టకాలంలో స్థిరచిత్తంతో తొణక్కుండా ఉండాలని, అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉండాలని వారికి బోధించారు.

"ఈ కష్టాలు కొన్నాళ్ళవరకే. అతిత్వరలో ఇవి కడతేరతాయి. దేశానికి యజమాని అల్లాహ్‌యే. ఆయన తాను కోరినవారికి రాజ్యాధికారం అప్పగిస్తాడు. కావాల్సిందల్లా ఆయన విశ్వాసపాత్రులయిన దాసులు తమను తాము ఆయన దృష్టిలో యోగ్యులుగా తయారుకావటమే. ఇలా జరిగితే ఇహలోకంలో కూడా వారు ఉన్నతులు కాగలుగుతారు."

ఇస్రాయీల్ జాతిలో ఇస్లాం సందేశం

హజ్రత్ మూసా(అలైహిస్సలామ్) యొక్క హితబోధ విన్న తర్వాత ఆ ప్రజలు, "అవును, మీరనేది సమంజసమే, కాని ఏం చెయ్యాలో చెప్పండి. మీరీ ఉద్యమం ప్రారంభించక ముందునుంచీ మేము కష్టాలను అనుభవిస్తూనే వచ్చాము. ఈనాటికీ కష్టాలు మమ్మల్ని విడిచిపెట్టలేదు".

మూసా(అలైహిస్సలామ్) ఇంకొకసారి వారికి నచ్చజెప్పారు. "అల్లాహ్ మీ శత్రువులను అంతంచేసే రోజు ఎంతో దూరంలో లేదు. భువిలో ప్రతినిధులు (ఖలీఫాలు)గా మిమ్మల్ని నియమిస్తాడు. దైవతిరస్కారులు, బహుదైవారాధకుల వలయం నుండి విముక్తులయి మీకు అధికారం లభించిన భూభాగంలో మీ ప్రవర్తన ఏవిధంగా ఉంటుందో పరీక్షిస్తాడు."

హజ్రత్ మూసా(అలైహిస్సలామ్) అణచివేతకు, హింసా దౌర్జన్యాలకు గురవుతున్న ఆ ముస్లిమ్ సమాజంలో సరైన ధార్మిక భావనను ఉద్దీపింప జేయాలని, వారి హృదయాలలో అల్లాహ్‌పై, పరలోకంపై విశ్వాసాన్ని పునరుజ్జీవింపజేయాలని సకల ప్రయత్నాలు చేశారు. తద్వారా వారు దైవ తిరస్కారం, బహుదైవారాధనల శృంఖలాలను త్రెంచిపారేస్తారని హజ్రత్ మూసా(అలైహిస్స

లామ్) ఆశించారు. కాని కొందరు యువకులు మినహా మరెవరూ మూసా (అలైహిస్సలామ్)ను అనుసరించేందుకు సిద్ధం కాలేదు. ఫిర్ఔన్, అతని సర్దారుల ప్రభావం ఆ సమాజంలోని పెద్దలపై ఎంతగా ఉందంటే వారు అంత గొప్ప శక్తికి వ్యతిరేకంగా ఏమయినా చేయగలం అని కనీసం ఆలోచించలేక పోయేవారు. అంతటి భావదారిద్ర్యం వారిలో గూడుకట్టుకుని ఉండగా ప్రతిఘటించాలన్న కోరిక ఎలా పుడుతుంది? దానికి తగ్గట్టు ఫిర్ఔన్ దౌర్జన్యాలు కూడా హద్దుమీరిపోయాయి. ప్రాణాలొడ్డి ఎదుర్కోవాలంటే దృఢమైన విశ్వాసం కావాలి మరి!

యువకులలో దూరదృష్టి, ఆలోచన తక్కువ, విప్లవోద్రేకం ఎక్కువ. వారికేదైనా విషయం బోధపడితే దానికోసం వారు ఎంతకయినా తెగిస్తారు, ఆపడం చాలా కష్టం. బనీ ఇస్రాయీల్ యువకుల విషయంలోనూ అంతే జరిగింది. మూసా (అలైహిస్సలామ్) తన జాతినుద్దేశించి, "సోదరులారా! మీరు దైవంపై విశ్వాసం కలవారైతే ధర్మమార్గంలో ఎదురయ్యే కష్టాలకు ఎందుకు భయపడుతున్నారు? అల్లాహ్ సహాయంపై నమ్మకముంచండి. నేను చెప్పి నట్లుగా నడుచుకునేందుకు సిద్ధపడండి. ధర్మమార్గం నుండి తప్పుకోవడం, ధార్మిక బాధ్యతల్ని అసంపూర్తిగా వదలివేయడం ముస్లిమ్‌లు చేయవలసిన పనికాదు" అని ఉద్బోధించారు.

మూసా(అలైహిస్సలామ్) బోధనల ప్రభావం అందరికన్నా యువకులపై ఎక్కువ పడింది. వీరంతా ముక్తకంఠంతో ఎలుగెత్తి చాటారు. "మాకు దైవ సహాయంపై పూర్తి భరోసా ఉంది. మేము మిమ్మల్ని అనుసరించడానికి సంసిద్ధులుగా ఉన్నాం" అని చెప్పి, "ఓ ప్రభూ! మమ్మల్ని దుర్మార్గుల పాలిట ఎరగా చేయకు. నీ కరుణాకటాక్షాలతో మమ్మల్ని నీ ధిక్కారుల నుండి రక్షించు" అని అల్లాహ్‌ను ప్రార్థించారు.

ఆ ముస్లిమ్ యువకుల ఉత్సాహం చూడండి. పెద్దవాళ్ళు, వృద్ధులు రకరకాల అనుమానాలు, సంశయాలలో పడిపోయి యువకుల్ని కూడా వెనక్కు

మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబం సర్వనాశనమవుతోందనీ, తమ వృద్ధాప్యాన్ని చూసి అయినా వారి ప్రయత్నం విరమించుకోవాలని నిరుత్సాహ పరచజూశారు. కాని దైవదాసులైన ఆ యువకులు ఒకసారి దైవసందేశం విన్నారు. ధర్మం తమపై మోపే బాధ్యతను తెలుసుకున్నారు. ఒకవైపు ధర్మం, మరోవైపు అధర్మం. పరస్పర విరుద్ధశక్తులలో ఏదో ఒకదానితో సఖ్యం చేయాలని ప్రతి వ్యక్తి నిర్ణయించుకోవలసి వచ్చింది. అటువంటి నాజూకు పరిస్థితులలో విశ్వాసులు తాము సత్యంతోనే సఖ్యం చేయాలని నిర్ణయించుకుంటారు. ఇహలోక జీవితంలో దాని పర్యవసానం ఎలా ఉన్నాసరే! ఔను. వారు అలాంటి నిర్ణయం ఎందుకు తీసుకోరూ! వారిముందు జయాపజయాల అసలు కొలమానాలు వచ్చేశాయి. వారికి తెలుసు- నిజ యజమాని ప్రసన్నుడవడమే విజయమనీ, ప్రాపంచిక సుఖం కోసం సత్యాన్ని తిరస్కరించడమే అపజయమని. ఈ సందర్భంగా వారు ప్రార్థించారు. "ఓ ప్రభూ! మమ్మల్ని దుర్మార్గుల పాలిట పీడగా చేయకు." ఇది చాలా ముఖ్యమైన ప్రార్థన. ఇందులో ఎన్నో అర్థాలు దాగి ఉన్నాయి. వాటిని అర్థం చేసుకోండి. దైవతిరస్కారం, అధర్మాలదే పైచేయిగా ఉన్నప్పుడు,కొందరు ధర్మపతాకాన్ని బూని ఉద్యమించితే వారికి అనేక రకాల వ్యక్తులు తారసిల్లుతారు. కొందరు విస్పష్టంగా విముఖత చూపుతారు. పూర్తి శక్తితో సత్యధర్మ ధ్వజవాహకుల్ని అణిచివేయ ప్రయత్నిస్తారు. కొందరయితే ఈ ధర్మాన్ని బహిరంగంగా వ్యతిరేకించజాలరు. తాము కూడా ఈ ధర్మాన్ని అనుసరించేవారమేనంటారు. కాని వారికి ప్రభుత్వ భయం ఉంటుంది. వారు తమ సుఖశాంతులకు లోటు కలగటాన్ని సహించలేరు. వారు పయనిస్తున్న జీవిత నౌక ఏ దిశలో పయనిస్తున్నదో ఆ దిశను మార్చుకోవడం వారికి కష్టమనిపిస్తుంది. వారికి, తమ వ్యాపార వ్యవహారాలు, వ్యవసాయం, ఉద్యోగం, ఇల్లువాకిళ్ళ నష్టం కళ్ళ ముందు కదలాడుతూ ఉంటుంది. అందుకని వాళ్ళేమంటారంటే, "మీరు చెప్పేది నిజమేననుకోండి, కాని ఆ పని కోసం ఇది సరయిన సమయం కాదు. ప్రస్తుతం ఇటువంటి ప్రయత్నం వ్యర్థం. దీనివల్ల ఫలితమేమీ కలగదు. ప్రయోజనం సున్నా. దీనివల్ల మనల్ని మనం ఇరకాటంలో పడవేసుకోవడమే అవు

తుంది" అంటూ వీరు ధార్మిక ప్రయత్నాలను నీరుకారుస్తారు. ధర్మం నోరు నొక్క డానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు. ఎందుకంటే ఈ స్థితిలో వీరికి రెండు విధాల కష్టాల్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఒకటి, వారు ఇంతవరకు అనుభవిస్తూ వస్తున్న సుఖాలకు ఆనకట్ట పడుతుంది. రెండు, ప్రజలకు ధార్మిక విధులు, బాధ్యతలు తెలిసిరాగానే వారు, "అయ్యా! ధర్మం కోరేది ఫలానా అయితే మీబోటి ధార్మికులు ఇందుకు భిన్నంగా చేయడం సబబు కాదుగదా!" అంటారు. అందుకని ఈ వర్గం వారు ధర్మోన్నతికి పాటుపడే ప్రతి ఉద్యమాన్ని పూర్తి శక్తితో వ్యతిరేకిస్తారు.

ఇక మూడో రకంవారు, దూరం నుంచే పరిస్థితుల్ని గమనిస్తూ ఉంటారు. వారు ఎటువైపు పరిస్థితులు అనుకూలంగా ఉంటే అటువైపు మొగ్గు చూపుతారు. గోడమీది పిల్లివాటం వీరిది.

ధనమదాంధుడు ఖారూన్

ఇటువంటి పరిస్థితుల్లో సత్యధర్మ ధ్వజవాహకులకు ప్రత్యక్షంగా ఏదయినా అపజయం కలిగినా లేక వారి వల్ల ఏదయినా తప్పుగాని, పొరపాటు గాని సంభవించినా లేక వారికేదయినా ఆపద ముంచుకొచ్చినా, లేక ఏ సందర్భం లోనైనా వారిలో ఏదయినా బలహీనత కనిపించినా వారు ఈ విభిన్న వర్గాల పరీక్షకు కారణభూతులవుతారు.

ఒకవేళ వారు (సత్యధర్మ ప్రేమికులు) అణచివేయబడటమో లేక ఓడి పోవటమో జరిగితే మొదటి వర్గంవారు, "చూశారా! ధర్మం మావైపు ఉంది, ఆ తలతిక్కవారి వైపు కాదు" అనంటారు. రెండో వర్గంవారు, "మేము ముందరే హెచ్చరించాం, ఇటువంటి విషయాలకిది తగిన సమయం కాదని, అనవసరంగా పెద్దపెద్ద శక్తులతో తలపడితే పర్యవసానం (చేదుగా ఉండక) ఏమవుతుంది? ఎన్నో కొన్ని ధార్మిక విధులు ఏదోరకంగా పూర్తి అవుతూనే ఉన్నాయి కదా! నమాజ్, రోజాల నుండి ఎవరు నిరోధిస్తున్నారు?" అని దెప్పిపొడుస్తారు.

ఇక మూడోవర్గంవారు ఏమంటున్నారో వినండి: 'గెలిచిన వాడే ఉత్తముడు".

సత్యధర్మ ధ్వజవాహకుల వల్ల ఏ కాస్త పొరపాటు జరిగినా, లేక వారిలోని ఒక వ్యక్తి యొక్క నైతిక లోపం లేదా బలహీనత ఎదుటికొచ్చినా చాలు, ఎంతో మంది ప్రజలకు అధర్మాన్ని, అపమార్గాన్ని అనుసరిస్తూ ఉండటానికి వేలాది వంకలు దొరుకుతాయి.

ఇటువంటి సందర్భంలోనే మూసా (అలైహిస్సలామ్) అనుచరులు "ఓ ప్రభూ! మమ్మల్ని కరుణించు. అన్నిరకాల అపజయాల నుండి, పొరపాట్లనుండి మమ్మల్ని దూరంగా ఉంచు. ఎందుకంటే ఈ పరిస్థితుల్లో మా వైఫల్యం వల్లనో, మాలోని లోపంవల్లనో ధర్మసందేశానికి ఏదయినా నష్టం జరగవచ్చు. ప్రజలు మా పరిస్థితిని చూసి నీ ధర్మం వైపు మరలే బదులు వెనుకంజవేస్తారేమో!" అని దైవాన్ని వేడుకున్నారు.

సత్య సందేశ ప్రచారంతోపాటు మూసా(అలైహిస్సలామ్) బనీ ఇస్రాయీల్ మరియు ఇతర విశ్వాసుల శిక్షణ కోసం ఏర్పాట్లు కూడా చేశారు. నాడు ఫిర్ఔన్ ప్రభుత్వంలో, ముస్లిమ్‌లకు కనీసం సామూహిక నమాజ్ చేసుకోడానికయినా స్వతంత్రం ఇవ్వబడలేదు. అటువంటి క్లిష్టపరిస్థితుల్లో నమాజ్ వ్యవస్థను స్థాపించుకోడానికి, విశ్వాసులకు శిక్షణ గరపడానికి మూసా (అలైహిస్స లామ్) మరియు ఆయన సోదరునికి అల్లాహ్ సూచన అందింది- "మీరు నగరంలోని కొన్ని ఇండ్లను ఎన్నుకోండి. అందరూ కలిసి ఆ గృహాల్లో నమాజ్‌ను స్థాపించండి. విశ్వాసుల హృదయాల నుండి నిరాశనిస్పృహల్ని తొలగించి, బలహీనతల్ని దూరం చేసి వారిని ఉత్సాహవంతులుగా మలచండి. వారిలోని విశ్వాసాన్ని తాజాపరచండి. సాఫల్యం పొందేది ఇలాంటివారేనని వారికి బోధించండి" అని.

ఇస్లామ్ ఏ ఉద్యమం కొరకైతే మానవుల్ని తయారుచేయగోర్తుందో, దాని శిక్షణ కోసం పరిపూర్ణ విశ్వాసం కలిగిన తర్వాత ముందుగా నమాజ్‌ను స్థాపించే విషయానికి ప్రాధాన్యతనిస్తుంది. నమాజ్‌ను స్థాపించే ఏర్పాటు చేయని వర్గం, మరేపని అయినా చేయగలదేమో కాని, ధార్మిక కార్యం మాత్రం చేయజాలదు.◆

◆1). *నమాజ్‌ను స్థాపించడం అంటే ఏవిధంగా నమాజ్‌ను చేయాలో ఆ విధంగా చేయాలని భావం.*

నమాజ్‌ను స్థాపించే బాధ్యతను నెరవేర్చగలిగేవారు మాత్రమే ధార్మిక సేవ చేయగలరు.

హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) ఇస్రాయీల్ వంశీయులలో నిర్వర్తించిన సందేశం, సంస్కరణా కార్యక్రమం మూలంగా ఎందరో వ్యక్తుల జీవితాలు కొత్త మలుపు తిరిగాయి. ఆ ప్రదేశంలోనే ప్రవక్త హితబోధను పెడ చెవిన పెట్టిన దౌర్భాగ్యులు కూడా ఉన్నారు. పైగా వారు మార్గభ్రష్టతతో మరింత మూర్ఖంగా వ్యవహరించసాగారు. ఆ కోవకు చెందినవారిలో ఖారూన్ కూడా ఒకడు. ఖారూన్ హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) జాతికి చెందినవాడే.

ఖారూన్ మార్గవిహీనతకు ప్రధాన కారణం అతని సిరిసంపదలు, భోగభాగ్యాలే. బనీ ఇస్రాయీల్ పెట్టుబడిదారీ మనస్తత్వానికి ప్రస్ఫుటమయిన నిదర్శనం ఖారూన్. అల్లాహ్ అతనికి అంతులేని సిరిసంపదలు ప్రసాదించాడు. కాని ఖారూన్ ఆ పరీక్షలో నెగ్గలేకపోయాడు. ధనమదంతో తన్నుతాను మరచి పోయాడు. గర్వంతో విర్రవీగాడు. తన సిరిసంపదల అండచూసుకుని బలహీను లను పీడించసాగాడు. అతని ఖజానాల తాళపుచెవుల గుత్తులు కొందరు మనుషులు కలిస్తేగాని మోయలేనంత బరువుగా ఉండేవి. దాన్నిబట్టి అతనికున్న ధనరాసుల్ని అంచనాకట్టవచ్చు!

ఈ ధనమదం ప్రాతిపదికపైనే ఫిర్ఔన్ దర్బారులో అతనికి ప్రవేశం లభించింది. కాని అతను తన ఈ పలుకుబడి చూసుకుని తన జాతివారి పట్ల మరింత కఠినంగా ప్రవర్తించేవాడు. పేరు ప్రతిష్టల కోసం, ప్రభుత్వ అధికారుల మెప్పుకోసం తన జాతి పీక పిసికేవాడు. ఈవిధంగా తన దర్జాను ప్రదర్శించేవాడు. ఇలాంటి కుయుక్తులతో అతను తన ఆస్తిపాస్తుల్ని పెంచుకున్నాడు.

---

2). నమాజ్‌ని అర్థం చేసుకుని ఎంతో వినమ్రులై ఏకాగ్రతతో చేయాలి.

3). వేళకు సామూహికంగా నమాజ్ సలపాలి.

4). నమాజ్‌లోని అంశాల్ని ఆగి ఆగి నిదానంగా ఆచరించాలి.

5) నమాజ్‌లోని విషయంలో అంతర్ బాహ్యాలలో లభించే ఆజ్ఞల్ని, షర తుల్ని, విధానాన్ని దైవగ్రంథం మరియు మహాప్రవక్త(స) ఆచరణలో లభిస్తాయి. వాటిని కచ్చితంగా అనుసరించాలి.

ధనమదాంధుడు ఖారూన్‌పై దైవశిక్ష

ఒకసారి ఖారూన్ జాతివారు ఖారూన్‌ను కలిసి అతనిలో దైవభీతిని కలిగించే ప్రయత్నంచేశారు. "చూడు, అలా విర్రవీగకు. గర్విష్ఠులంటే అల్లాహ్ ఇష్టపడడు. దైవం నీకిచ్చిన దానితో నీ పరలోక జీవన సామగ్రిని కూడబెట్టుకో. పేదలను ఆదుకో. ఆర్తులకు సహాయం చేయి. ఈ సిరిసంపదల్ని ఖర్చుచేసే అసలు విధానం ఇదే. అంటే... దాని అర్థం నీ ఆస్తంతా దైవమార్గంలో ఖర్చు చేసేయమని కాదు. నీ వంతు వాటాను నీ సుఖశాంతుల కోసం వాడుకో. కాని అల్లాహ్ నీకు సంపదనిచ్చి నీపై మేలు చేసినట్లే, నీవు కూడా బలహీనులైన దైవదాసులకు సాయపడు, మేలు చేయి. ఆస్తిని ఈవిధంగా కూడబెట్టి ఉంచడం, వీలయినంత ఎక్కువ ఆస్తిని సంపాదించాలనే పేరాశలో పడి ధర్మాధర్మాల విచక్షణను పాటించక ఇతరులపై జులుంచేసి ధనాన్ని కూడబెట్టే వైఖరిని విడనాడు. ఇదే నిజానికి ప్రపంచంలో కల్లోలం చెలరేగటానికి గొప్ప కారణం. నీవు ఇటువంటి కల్లోలం నుంచి బయటపడు; కల్లోలాన్ని రేకెత్తించే ఇలాంటి వారిని అల్లాహ్ ప్రేమించడు. వీరు ఇతరులపై జులుం చేస్తారు. వారి హక్కుల్ని కాజేసి ప్రపంచశాంతిని భగ్నం చేస్తారు.

ఎంత మంచి మాటలివి! -కాని ఖారూన్ ఏమన్నాడు? అతని లాంటి ఈనాటి కల్లోలకారులు అనే మాటలే అన్నాడు. "ఈ డబ్బూ దస్కం, భోగభాగ్యాలను నేను నా తెలివితేటలతో కూడబెట్టాను. ఇందులో ఎవడికేం హక్కుందని, నేను నా కష్టార్జితాన్ని, చెమటోడ్చి కూడబెట్టినదాన్ని అనవసరంగా పేదసాదలకు ఎందుకు ఖర్చుచేయాలి?"

నిజమే కళ్ళు పొరలుగమ్మినవాడు, అసలు దాత (అల్లాహ్)నే మర్చిపోయినవాడు, తనకుముందు గతించినవారి చరిత్ర నుండి గుణపాఠం గ్రహించనివాడు అయిన వ్యక్తి హృదయం నుండి ధనమదాన్ని తొలగించడం అంత సులభం కాదు. ఓహ్! ఖారూన్‌కు కనువిప్పు కలిగితే, తనకు పూర్వం ఎందరో బలవంతులు, పొగరుబోతులు మృత్యువాతనబడ్డారని, ఈనాడు వారి

విషాదగాథలు తప్ప వారిదంటూ ఏమీ మిగలలేదని అతను తెలుసుకోగలిగే వాడు. ఇది ప్రపంచంలో జరిగే విషయం మాత్రమే. పరలోకంలో అటువంటి వారికి అంతకంటే గొప్ప వినాశం ఉంది! ఆ రోజున వారి కర్మలన్నీ తేటతెల్లమవు తాయి. వారి దుష్కర్మలు ఎంత వివరంగా వ్యక్తమవుతాయంటే, వాటిని గురించి ఆ దుర్మార్గుల్ని అడగవలసిన అవసరమే ఉండదు.

సిరిసంపదలు, సుఖభోగాలలో పెద్ద మోసం ఉంది. ఈ శాపానికి గురయిన వ్యక్తిని చూసిన ప్రజలకు అతడు వినాశం వైపుకు లాగబడుతున్నాడనే ఆలోచన కూడా రాదు. అతడు నిజంగా గొప్ప భోగభాగ్యాలతో తులతూగుతున్నా డని అనుకుంటారు. విజయం అతన్నే వరిస్తోందనుకుంటారు. అదృష్టం అతనికే పాదాభివందనం చేస్తూందని భావిస్తారు. కాని అసలు విషయం వేరుగానే ఉంటుంది. ఇదే పరిస్థితి ఖారూన్‌దీను-

ఒకరోజు అతడు డాబూదర్పంతో తన బంధువుల ముందుకు వచ్చాడు. ప్రాపంచిక జీవితం వెనుక ఉన్న వాస్తవికత ఏమిటో పూర్తిగా తెలియని బంధు వులు మోసంలో పడ్డారు. వారు ఖారూన్ స్థితిగతుల్ని చూసి ఈర్ష్య చెందారు. "ఖారూన్‌కు లభించిన ధనం మాక్కూడా లభిస్తే ఎంత బాగుండు! అతడెంత అదృష్టవంతుడో చూశారా!?" అన్నారు. కాని వారిలో కొందరు స్పష్టంగా వాస్తవి కతను ఎరిగినవారు కూడా ఉన్నారు. అసలు జీవితం ఏదో, నిజమయిన సాఫల్యం అని దేనినంటారో వారికి తెలుసు. ప్రాపంచిక సంపద ఒక పరీక్ష అని, ఆ పరీక్షలో ఫిర్‌ఔన్ ఘోర పరాజయం పాలవుతున్నాడని వారెరుగుదురు. వీరు ఆ మూర్ఖుల ఈర్ష్యాపూరిత మాటలు విని బాధపడ్డారు. "మిమ్మల్ని చూస్తే మాకు విచారం కలుగుతూంది. మీరు ఈర్ష్యపడుతున్న ఈ సిరిసంపదలకన్నా దైవం ప్రసాదించే పుణ్యం ఎంతో మేలైనది. ఈ పుణ్యం విశ్వసించినవారి కోసం, తమ వెంట సత్కార్యాల మూట కట్టుకుని వెళ్ళేవారి కోసం ఉంటుంది- కాని ఈ పుణ్యం ధర్మమార్గంలో స్థిరంగా ఉండేవారికి, తమ మనోవాంఛల్ని అదుపులో పెట్టుకునేవారికి, కలిమిలో ఉన్నా, లేమిలో ఉన్నా అన్ని పరిస్థితుల్లోనూ అల్లాహ్ ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటించేవారికి మాత్రమే లభిస్తుంది. ఈ మాత్రం మీకు తెలియదా?"అని నచ్చజెప్పారు.

ఖారూన్ ధనమదంతో, అహంభావంతో అలా వింటూ ఉండిపోయాడు తప్ప వారి మాటలు అతణ్ణి ఏ మాత్రం ప్రభావితం చేయలేకపోయాయి. చివరికి అల్లాహ్ నిర్ణయించిన గడువు పూర్తయింది. అల్లాహ్ విధించిన శిక్ష అతనిపై విరుచుకుపడింది. భూమి బ్రద్ధలైంది. ఖారూన్ తన అందాల భవంతితో సహా భూగర్భంలోకి కూరుకుపోయాడు. పాపం! అతని సిరిసంపదలూ మిగల్లేదు. హోదా అంతస్తులు కూడా మట్టిలో కలిసిపోయాయి. భజనపరులు, భట్రాజులూ కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయారు. అల్లాహ్‌కు వ్యతరేకంగా ఖారూన్‌కు ఏ ఒక్కడూ ఉపయోగపడలేదు. ఎక్కణ్ణుంచయినా ఏదయినా సహాయం కూడా లభించలేదు.

తెల్లవారింది. అందరూ ఖారూన్ మహల్ ఉండే ప్రదేశం చూశారు. అక్కడ ఇప్పుడేమీ మిగల్లేదు. ఖారూన్, అతని భోగభాగ్యాలు అన్నీ సర్వనాశనమయ్యాయి. సమస్తం భూస్థాపితం అయిపోయింది. ఖారూన్ మాదిరిగా ధనవంతులమవుదాం అని అనుకున్నవాళ్ళు అప్పుడు కళ్ళు తెరుచుకున్నారు. విషయమంతా అవగతమైంది. "సరే! ఇదంతా దైవేచ్ఛ. తాను కోరిన వారికి కలిమిని కలిగిస్తాడు. తాను కోరినవారిని లేమిలో పడవేస్తాడు. అల్లాహ్ మాకు మేలు చేశాడు. మమ్మల్ని ఖారూన్‌లా పుట్టించలేదు. ఖారూన్‌కు పట్టిన దుర్గతి కూడా మాకు పట్టలేదు. అతనితోపాటు మేము భూస్థాపితం కాలేదు. ఆహా! కర్మఫలం ఎటువంటిది? కృతఘ్నులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు" అని అన్నారంతా ముక్తకంఠంతో.

అసలు విజయం పరలోక విజయమే. అక్కడ ఫిర్ఔన్ అధికారం వంటి అధికారంగాని, ఖారూన్ సంపదవంటి సంపదగాని తోడ్పడజాలవు. భువిలో ఫిర్ఔన్‌లా దుర్మార్గులు, ఖారూన్‌లా ధనమదాంధకారులు కానటువంటి అదృష్టవంతులదే పరలోక భాగ్యం. పరలోకం భయభక్తులు కలవారి (ముత్తఖీలు)దే. ప్రతిక్షణం దైవాగ్రహానికి భయపడేవారిదే. దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా ఎటువంటి పనిచేయనివారికే ఈ మహాభాగ్యం లభిస్తుంది.

ఫిర్‌ఔన్ దర్బారులో ఒక నవ ముస్లిం

ఫిర్‌ఔన్ నానాటికి పెరిగిపోతున్న మూసా(అలైహిస్సలామ్) యొక్క ప్రచార ప్రభావాన్ని గమనించాడు. ఫిర్‌ఔన్, బనీ ఇస్రాయీల్‌వారి పుత్రసంతతిని మట్టుపెట్టే పథకం నడిపినా అది అతనిలోని క్రోధాగ్నిని చల్లార్చలేకపోయింది. మూసా (అలైహిస్సలామ్)ను, ఆయన అనుచరులను రకరకాలుగా బెదిరించాడు. ప్రాణాలు తీస్తానని, జైలుపాలు చేస్తానని భయపెట్టాడు. ఆయన జాతివారిపై వెట్టిచాకిరీని తీవ్రతరం చేశాడు. వారిపై గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి వారి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశాడు. కాని మూసా (అలైహిస్సలామ్) చెప్పిన ప్రతిమాట సక్రమమైనది అవడంచేత అది ప్రజల హృదయాలను ఆకట్టుకుంటుంది. పైగా ఆయన మహత్యాలు బహిర్గతమయ్యాయి. ఫిర్‌ఔన్ పిలిపించిన మంత్రగాళ్ళు ఓడిపోయిన తర్వాత ప్రజలు నిస్సందేహంగా మూసా (అలైహిస్సలామ్)కు మద్దతునిచ్చే దైవశక్తి ఏదో ఉందనే నిర్ణయానికి రాక తప్పలేదు. ఆయన తాను దైవప్రవక్తనని ప్రకటించినప్పుడు ఆయన చెబుతున్నది అబద్ధమని ఖండించడం అంత తేలిక విషయంగా భావించలేదు ప్రజలు.

మూసా (అలైహిస్సలామ్) సందేశానికి బనీ ఇస్రాయీల్ వారేకాక ఫిర్‌ఔన్ జాతివారు కూడా ప్రభావితులవసాగారు. మూసా (అలైహిస్సలామ్) అభిమానుల సంఖ్య దినదిన ప్రవర్థమానం కాసాగింది. ఈ కొత్త ఉద్యమానికి ప్రభావితులయ్యేవారి సంఖ్య, అభిమానుల సంఖ్య ఫిర్‌ఔన్‌ను హడలగొట్టాయి. అతనికి మనశ్శాంతి లేకుండాపోయింది. మూసా (అలైహిస్సలామ్)కు మరణశిక్ష విధిస్తే తప్ప లాభం లేదనుకున్నాడు ఫిర్‌ఔన్. అతని తొట్రుపాటును పవిత్ర ఖుర్‌ఆన్ లోని పదజాలాన్ని బట్టి అంచనా వేయవచ్చు.

"మూసా (అలైహిస్సలామ్)ను అంతం చేస్తాను, నన్ను వదలండి. అతడు తన ప్రభువును పిలవనీండి. ఆయన వచ్చి అతన్ని ఎలా కాపాడతాడో చూద్దాం- ఒకవేళ అతన్ని అంతమొందించకపోతే అతడు మీ జీవిత వ్యవస్థను మార్చివేస్తాడని, లేదా దేశంలో పెద్ద సంచలనం కలిగిస్తాడని నాకు భయమేస్తోంది" అన్నాడు ఫిర్‌ఔన్.

మూసా (అలైహిస్సలామ్)కు కూడా ఫిర్ఔన్ నిర్ణయం గురించి తెలిసింది. ఆయన అన్నారు, "దానివల్ల ఏమవుతుంది? పరలోకంలో జవాబు చెప్పవలసి ఉందనే విశ్వాసం లేనివారి బారిన పడకుండా ఉండేందుకు నన్ను నేను నా ప్రభువు, యజమాని (అయిన అల్లాహ్) రక్షణలో సమర్పించుకున్నాను. ఆయన నాకే కాదు, మీకు కూడా యజమాని, ప్రభువే."

జీవన్మరణాలు కేవలం దైవం చేతిలో ఉన్నాయని నమ్మినవారు, తాము చేస్తున్నదంతా దైవప్రసన్నత పొందడానికే అన్న విశ్వాసం కలవారు, బలవంతులందరికన్నా ఆయన మిక్కిలి బలవంతుడని, ఆయన తీర్పును ఎవరూ జవదాటలేరని దృఢవిశ్వాసం కలవారు, ఉరి, జైలు శిక్షల నిర్ణయాలు విని ఎందుకు భయపడతారు? కాబట్టి మూసా (అలైహిస్సలామ్) ఫిర్ఔన్ యొక్క ఈ ఉద్దేశ్యానికి అంతగా ప్రాముఖ్యతనివ్వలేదు.

ఫిర్ఔన్ తన ఈ నిర్ణయాన్ని తన దర్బారువారి ముందు, వారి సలహా కోసం ఉంచినప్పుడు ఒకాయన లేచి వింత పద్ధతిలో ఆ నిర్ణయాన్ని విమర్శించ సాగాడు. ఈయన కూడా ఫిరౌన్ జాతికి చెందినవాడే. కాని ఆయన మూసా (అలైహిస్సలామ్) సందేశాన్ని విశ్వసించినవాడు.

ఫిర్ఔన్‌కుగాని, అతని ఆంతరంగికులకుగాని ఈ నవ ముస్లిమ్ ఇస్లామ్‌ను స్వీకరించిన విషయం తెలియదు. మూసా (అలైహిస్సలామ్)ను హత్య చేయాలని ఫిర్ఔన్ ఉద్దేశించాడని, కొందరు దర్బారీలు కూడా ఇదే సలహా ఇస్తున్నారని విన్న ఆయన ఇక సహించలేకపోయాడు. ఆయన ప్రాణాలకు తెగించి నిండు దర్బారులో ఈ ప్రకటన చేశాడు. "నా ప్రభువు, పాలకుడు అల్లాహ్ అని ప్రకటించిన వ్యక్తికి మరణశిక్ష విధించనున్నారా? ఆయన చేసిన నేరం ఏమిటి? పైగా ఆయన చెప్పే మాటలకు ఆయన వద్ద స్పష్టమైన ఆధారాలు న్నాయి గదా? మీ ప్రభువు ద్వారా సంక్రమించిన నిదర్శనాలను ఆయన మీకు చూపాడు కూడా.

"ఈ పరిస్థితుల్లో రెండు మార్గాలున్నాయని మీరు గమనించాలి. తాను దైవప్రవక్త అని, తాను చెబుతున్నదంతా దైవం తరఫునే చెబుతున్నాను అని చేసే

వాదన అబద్ధపు వాదనై ఉండాలి. ఒకవేళ ఇదే నిజమనుకున్నట్లయితే మీపై ఆయన ప్రభావం ఏమీ పడజాలదు. ఆయన ఇలా చెప్పి చెప్పి ఊర్కుంటాడు. ఇవాళ కాకపోతే రేపైనా ఆయన బండారం బయటపడవచ్చు- కాని ఆలోచించ దగ్గ విషయమేమంటే ఒకవేళ ఆయన సత్యవంతుడైతే ఆయన్ని చంపినందువల్ల మీకు ఒరిగేదేమీ లేదు. మీ ముందుకు దైవోపదేశం వచ్చేసింది. ఆ సందేశహరుణ్ణి ప్రాణాలతో విడిచిపెట్టడమో లేక చంపేయడమో చేసినంత మాత్రాన మీ రాత మారదు. ఆయన చూపిన మార్గాన్ని మీరు అంగీకరిస్తారా లేదా అన్న విషయం పైనే మీ అదృష్టం ఆధారపడి ఉంది.

"ఒకవేళ మీరు దైవధిక్కార మార్గాన్నే అంటిపెట్టుకునుంటే దైవధిక్కారులకు సంభవించే పర్యవసానం (శాపం) ఎట్టి పరిస్థితుల్లోనూ మిమ్మల్ని విడిచిపెట్టదు. ఆయన్ని మీరు ఉరికంబానికి వ్రేలాడగట్టినా సరే! దైవదాస్య పరిధిని అతిక్రమించేవారికి, అబద్ధాలకోరులకు అల్లాహ్ ఇహలోక జీవితంలో విజయవంతమైన సన్మార్గంపై నడిచే భాగ్యాన్ని ప్రసాదించడు.

"నా జాతి సోదరులారా!... ఇవాళ ఈ అధికారం మీదే కావచ్చు. ప్రభుత్వం మీ చేతిలో ఉండవచ్చు. దేశంలో మీకు ఆధిక్యత, పలుకుబడి ఉండవచ్చు. కోరినట్లు చేయగల స్థితిలో మీరు ఉండవచ్చు. కాని పరిస్థితులు ఒకేలా ఉండవు. అల్లాహ్ శక్తి మీ శక్తికన్నా ఎంతో గొప్పది. మీ దుష్ప్రవర్తన వల్ల మీపై దేవుని శాపం విరుచుకుపడితే దానికి వ్యతిరేకంగా సహాయపడేవారెవరు?"

ధైర్యవంతుడయిన ఆ పెద్ద మనిషి ప్రకటన విన్న సభలో నిశ్శబ్దత ఆవరించింది. ప్రకటన చేసిన వ్యక్తి పలుకుబడిగల పెద్ద అధికారి కాబోలు. అందు చేతనే ఆ ధిక్కారానికి వెంటనే ఆయన్ని బంధించి జైలుకు పంపే ధైర్యం ఫిర్ఔన్‌కు కూడా లేకపోయింది. కాని ఇదంతా విన్న ఫిర్ఔన్, "నేను సరయినదని భావించేదాన్ని గురించే సలహా ఇస్తాను. అందరి శ్రేయస్సు ఇమిడి ఉన్న మార్గాన్నే చూపుతాను" అన్నాడు.

ఆ పెద్ద మనిషి ఫిర్ఔన్ మాటలను ఖాతరు చేయకుండా తన ఉపన్యాసాన్ని ప్రభావవంతం చేయడానికి ఇంకా చాలా చెప్పసాగాడు.

"సోదరులారా! మీ ఈ ధోరణి చూస్తుంటే మీకంటే ముందు గతించిన జాతులకు పట్టిన గతే మీకూ పడుతుందేమోనని నాకు భయంగా ఉంది. ఉదాహరణకు నూహ్, ఆద్, సమూద్ జాతులు ఇంకా ఆ తర్వాత వచ్చిన అలాంటి వారే అయిన అనేక జాతులు. గుర్తుంచుకోండి! అల్లాహ్‌కు తన దాసులపై జులుం చేసే ఉద్దేశ్యం లేదు. కాని వారు చేజేతులా చేసుకున్న దుష్కర్మలే వారిని పట్టి ముంచుతాయి.

"సోదరులారా! నేను ఆ రోజు గురించి భయపడుతున్నాను. ఏ రోజయితే మీపై అల్లాహ్ శాపం విరుచుకుపడుతుందో. సహాయం కోసం ఆ రోజు మీరు ఒకర్నొకరు పిలుచుకుంటారు. భయవిహ్వాలులై వెన్నుచూపి పారిపోతారు. కాని ఆ రోజు అల్లాహ్ పట్టునుండి మిమ్మల్ని రక్షించేవారెవరూ కానరారు- గుర్తుంచుకోండి, అల్లాహ్ ఎవరినయితే వారి తప్పుడు ధోరణి, ప్రవర్తన వల్ల సద్బోధ నుండి దూరం చేస్తాడో ఆ దురదృష్టవంతుల్ని ఎవరూ సన్మార్గం వైపుకు తీసుకురాలేరు.

"మీకు గుర్తుండే ఉంటుంది. గతంలో హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) అనే దైవప్రవక్త ఇదే సందేశాన్ని తెచ్చారు. కాని మీరు అప్పుడు కూడా దానిపై శ్రద్ధ చూపలేదు. ఆయన బోధలపట్ల అనుమానంలోనే మునిగిపోయారు. చివరికి ఆయన పరమపదించగా మీరు అమ్మయ్య! అనుకుంటూ, అల్లాహ్ ఇకపై ఏ ప్రవక్తనూ ఎంతమాత్రం ప్రభవింపజేయడు అని తృప్తిపడ్డారు. కాని ఈ దేశాన్ని తన సద్బోధ నుంచి మినహాయించడం అల్లాహ్ కారుణ్యానికి వ్యతిరేకం."

ఫిర్ఔన్ దర్బారులో ఈ నవ ముస్లిమ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నాడు:

"కాబట్టి అల్లాహ్ మరోసారి మనపై తన అనుగ్రహాన్ని కురిపించాడు. ఆయన తన ప్రబోధనాజ్యోతిని మనపై ప్రసరింపజేశాడు. దానివల్ల మార్గభ్రష్టత్వపు కారుచీకట్లు పటాపంచలవుతాయి. ఈ రాజ్యంలో నివసించేవారికి మళ్ళీ సన్మార్గం లభిస్తుంది. ఈ మహాభాగ్యానికి మీరిచ్చే విలువ ఇదేనా?

"గుర్తుంచుకోండి ఒక దాసుడు దాస్యపరిధిని అతిక్రమించి, విశ్వాసం, నమ్మకాలకు బదులుగా అపోహలకు లోనైతే అతనికి సన్మార్గం ఏనాటికీ

లభించదు. అలా ఆ దాసుడు నిరంతరం దారితప్పి తిరుగుతూనే ఉంటాడు. అటువంటి వారిని గుర్తించడమెలా అంటే వారి దగ్గరికి తమ ప్రభువుకు సంబంధించిన విషయాలు వచ్చినప్పుడు వారు అనవసరంగా వితండవాదానికి దిగుతారు. ఏ విధమయిన ఆధారాలు, ప్రమాణాలు లేకుండానే జగడం చేస్తారు. అల్లాహ్ మరియు విశ్వాసుల దృష్టిలో వారి వైఖరి అత్యంత హేయమైనది.

"వినండి, వీరు అవలంబించిన ఈ వైఖరి ఎంతమాత్రము సరయింది కాదు. అహంకారంతో అంధులవుతున్నవారు, తిరుగుబాటుతనం, తలబిరుసుతనంతో మత్తెక్కినవారే ఈ వైఖరినవలంబిస్తారు. అటువంటి వైఖరిని అవలంబించినందుకు పర్యవసానంగా అల్లాహ్ వారిని సద్బోధ వెలుగు నుండి దూరం చేస్తాడు. అల్లాహ్ వారి హృదయాలకు సీలువేశాడా అన్నట్లు వారి హృదయాలు సత్యాన్ని స్వీకరించడానికి వీలు లేకుండా మూసుకుపోతాయి?"

నవ ముస్లిం ఉపన్యాసం విని ఫిర్ఔన్ ఉగ్రుడయ్యాడు. హృదయాలను కాంతిమంతం చేసే ఈ మాటల్ని సహృదయంతో ఆలోచించే బదులు అతను వాటిని తేలిక భావంతో త్రోసిపుచ్చాడు. పైగా మూసా(అలైహిస్సలామ్) ఆయన అనుయాయుల్ని ఎగతాళిపట్టించే ఉద్దేశ్యంతో తన దర్బారులో ప్రధాన అధికారి అయిన హామాన్‌ను సంబోధించి ఇలా అన్నాడు:

"సరేనోయి హామాన్! ఒక ఎత్తయిన భవనాన్ని కట్టించు, మేము దానిపై ఎక్కి ఆకాశంపైకి చేరుకునే ప్రయత్నం చేస్తాము. అక్కడ వారి అల్లాహ్‌ను తొంగిచూస్తాం. అసలు అల్లాహ్ అనేవాడు ఎవడైనా ఉన్నాడో లేడో మేమూ ప్రత్యక్షంగా చూస్తాం. ఈయనగారు అబద్ధమాడుతున్నాడనే నా నమ్మకం."

ఇదీ ఫిర్ఔన్ వరస! అతడికి తన దుశ్చర్యలు ఎంత అందంగా కనబడుతున్నాయి! సన్మార్గం వైపుకు పురోగమించటానికి ఎన్నెన్ని ఆటంకాలు అతడి ముందు అడ్డుగోడలుగా నిలిచాయి!!- కాని ఫిర్ఔన్ యొక్క ఈ కపట చేష్టలన్నీ అతనికే మాత్రమూ లాభించకపోగా వినాశానికే ఇంకా చేరువ చేస్తున్నాయి.

కాని విశ్వాసి అయిన ఆ మహాపురుషుడు దర్బారులో ఫిర్ఔన్ చేసిన ఈ వ్యర్థ ప్రేలాపనను ఏ మాత్రం పట్టించుకోలేదు. పైగా ఎంతో ప్రేమతో మనసుల్ని ఆకట్టుకునేలా సభికుల్ని ఉద్దేశించి ఇంకా ఇలా అన్నాడు:

"సోదరులారా! నేను మీ ముందుంచిన మార్గాన్నే అవలంబించండి. మీ శ్రేయస్సు ఇందులోనే ఉంది. ఇదే సన్మార్గం, సత్యమార్గమూను."

"సోదరులారా! వినండి. మరో వాస్తవికత వైపుకు మిమ్మల్ని పిలుస్తున్నాను. ఆలోచించండి? ఈ జీవితం ఎన్నాళ్ళో ఉండదు. దాని పర్యవసానం అందరూ ఎరిగిందే. ఇక్కడ ఉన్న ఈ ఐహిక సంపద ఎన్నాళ్ళుం టుందో ఎవరికెరుక! ఎన్నాళ్ళు దీనితో మీరు ప్రయోజనం పొంద గలరు? ఈ జీవితం తరువాత ప్రారంభమయ్యేదే నిజమయిన శాశ్వత జీవితం. శాశ్వతంగా ఉండేది ఇహలోకం కాదు, పరలోకమే. కాబట్టి వాస్తవాన్ని స్పష్టంగా మీ ముందు ఉంచుతున్నాను. శాశ్వతంగా ఉండే పరలోకంలో లభించే విజయమే అసలు విజయం. సంపద, గౌరవం, అధికారం మొదలయిన ప్రాపంచిక ఆకర్షణల కోసం మానవుడు పరలోక సాఫల్యాన్ని విస్మరించి తప్పుడు మార్గాన్ని అవలంబించడం కన్నా మరో మూర్ఖత్వం లేదు. గుర్తుంచుకోండి, చెడు చేసినవారికి తగిన ప్రతిఫలం లభించి తీరుతుంది.

"వినండి, పరలోక సాఫల్యానికి ఒక్కటే మార్గం. స్త్రీలైనా పురుషులైనా సత్కార్యాలు[1] చేసినవారే స్వర్గంలో ప్రవేశించగలరు. అయితే వారు విశ్వాసులు[2] కావడం అవసరం. అలాంటివారికి స్వర్గంలో లెక్కలేనన్ని మహాభాగ్యాలు లభిస్తాయి."

నవ ముస్లిమ్ మాటలు విన్నాక ఫిర్‌ఔన్‌కు, అతని దర్బారు వారికి ఇక వీరిని బెదిరించి, భయపెట్టి వీరి మార్గాన్నుండి తప్పించలేమని గ్రహించారు. ఏ మార్గమునయితే వారు ఆలోచించి, అర్థం చేసుకుని అవలంబించారో దాన్నుండి

---

1. *సత్కార్యాలు అంటే, దైవాజ్ఞలకులోబడి ఉండి, దైవప్రీతి కోసం చేసే మంచి పనులన్న మాట.*
2. *విశ్వాసులు- విశ్వాసం అంటే, అల్లాహ్‌పై ఆయన ప్రవక్తలపై, పరలోకంపై విశ్వాసం ఉంచడం (దైవప్రవక్త(స) తెలిపిన వివరణతో సహా). దైవప్రవక్త (స) బోధించిన వాస్తవాలను విశ్వసించడం కూడా చేరి వుంది.*

వారిని దూరంగా ఉంచడానికి ఫిర్ఔన్, అతని అనుయాయులు వారికి ఎన్నో ఆశలు చూపి బతిమాలారు. నయానా భయానా అయినా సరే తమ ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకుందామని ప్రయత్నించారు.

కాని ఎవరి హృదయాల్లో విశ్వాసం దృఢంగా నాటుకుని ఉంటుందో వారు ఎన్నికష్టాలు వచ్చినా వెనుకంజవేయరు. ఎటువంటి దురాశ అయినా వారిని వారి స్థానం నుండి తప్పించజాలదు. ఈ నవ ముస్లిమ్ విషయంలోనూ ఫిర్ఔన్ ఎత్తుగడలన్నీ చిత్తయిపోయాయి.

అచంచల విశ్వాసం- అద్భుత సందేశం

నవ ముస్లిమ్‌ను తమ వైపుకు తిప్పుకోవడానికి ఫిర్ఔన్, అతని అనుయాయులు వేసిన పాచికలేవీ పారలేదు. నవ ముస్లిమ్ దైవధర్మంపై స్థిరంగా ఉండటమే కాకుండా మరొకసారి తన జాతి ప్రజలను ఉద్దేశిస్తూ ఇలా హితవు చేశాడు.

"సోదరులారా! ఇన్ని మాటలెందుకు? ఒక విషయం ఆలోచించండి. నేను మిమ్మల్ని ఎటువైపుకు పిలుస్తున్నాను, మీరు నన్ను ఎటు తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు? మిమ్మల్ని నేను శాశ్వత సాఫల్యం వైపుకు పిలుస్తున్నాను. మోక్షం వైపుకు ఆహ్వానిస్తున్నాను. శాశ్వతంగా ఉండే పీడ నుండి మిమ్మల్ని విముక్తంగావించే ప్రయత్నం చేస్తున్నాను. మీరేమో నన్ను సర్వనాశనం వైపుకు, శాశ్వత పరాజయం వైపుకు లాక్కెళ్ళాలని చూస్తున్నారు.

"నేను మనందరి అసలు యజమాని అయిన విశ్వప్రభువును తిరస్కరించి ఆయన దైవత్వంలో ఇతరుల్ని సాటికల్పించాలనేగా మీరు కోరుకుంటున్నది. ఈ విషయం వైపుకా మీరు నన్ను పిలుస్తున్నది! నన్ను ఇతరుల దాస్యాన్ని అవలంబించమంటున్నారా? జీవితంలోని కొన్ని పనులలో దైవానికి, మరికొన్ని పనుల్లో దైవేతరులకు వినమ్రత చూపాలా? ఆయన్ని తిరస్కరించ డానికి, ఇతరుల్ని ఆయనకు సహవర్తనులుగా నిలబెట్టడానికి నా వద్ద ఎటువంటి ఆధారాలు

లేకపోయినా నేనీ పని చేయాల్నా? కాని నేను మిమ్మల్ని విశ్వప్రభువు యొక్క దాస్యం వైపుకు పిలుస్తున్నాను. ఆయన సమస్త అధికారుల్లోకెల్లా గొప్ప అధికారి. ఆయన సమక్షంలో ప్రతి 'దైవత్వం' ఒక మోసం తప్ప మరేమీ కాదు. ప్రతి శక్తీ నిస్సారమయింది. అంతటి అపారశక్తిశాలి అయిన ఆ దేవుడు అమిత దయాళువు కూడా. ఆయన విధేయత వైపుకు మరలాలని నిశ్చయించు కున్నవాడు ఎంతటి తిరుగుబాటుదారు, ద్రోహి అయినా సరే ఆయన దర్బారులో అతనికి క్షమాభిక్ష లభించగలదు. నేను ఇలాంటి దైవాన్ని ఆరాధించమనే మిమ్మల్ని కోరుతున్నాను.

"పోతే మీరు నన్ను ఏ జీవిత వ్యవస్థ వైపుకయితే పిలుస్తున్నారో అది నాకు పరలోకంలోనూ సాఫల్యతను చేకూర్చదు. ఇహలోకంలోనూ నాకేమాత్రం ఉప యోగపడదు. వాస్తవమేమంటే, మనందరం చివరికి అల్లాహ్ వైపుకే మరలవలసి ఉంది. ఆయనకు ద్రోహులైనవారి నివాసం నరకం మాత్రమే. సోదరులారా! నేను చెప్పవలసినదంతా చెప్పాను. ఇక మీ ఇష్టం. త్వరలో ఆ సమయం ఆసన్నం కానున్నది. అప్పుడు నేను చెప్పిన ఈ మాటలన్నీ మీకు గుర్తుకు వస్తాయి.

"ఇక నా సంగతంటారా, మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. నేనయితే నా వ్యవహారాలన్నిటిని అల్లాహ్‌కు నివేదిస్తున్నాను. అల్లాహ్ సమస్తమూ చూస్తున్నా డని నా విశ్వాసం. ఆయనే తన దాసుల పర్యవేక్షకుడు."

ధైర్యశాలి, పెద్దమనిషి అయిన ఆ విశ్వాసి తన హితబోధను ముగిం చాడు. ఫిర్ఔన్, అతని అనుచరులు ఆయన (మూసా)కు వ్యతిరేకంగా ఎన్నో కుతంత్రాలు పన్నారు. కాని దైవసహాయం లభించినవారికి ఎవరు కీడు చేయ గలరు?! చివరికి వారి కుయుక్తులన్నీ వ్యర్థమయ్యాయి. వారు పన్నిన కుట్రలన్నీ భగ్నమయ్యాయి. అల్లాహ్ తన విశ్వాసి అయిన దాసుని వారి జిత్తుల నుంచి రక్షించాడు. పైగా వారి దుష్ట ఎత్తుగడలు వారికే బెడిసికొట్టాయి. తాము తవ్వు కున్న గోతిలో తామే పడినట్లయింది వారి పని.

ఫిరౌనీయులపై రకరకాల శిక్షలు రాసాగాయి. పాపం! ఇస్లామీయ సందేశానికి వ్యతిరేకంగా వారు పన్నిన ఉచ్చులో వారే చిక్కుకున్నారు. తమ దుష్ట

కర్మల ఫలితంగా వారు ఏ నరకాగ్నిలోనైతే పడనున్నారో అది వారికి ప్రతినిత్యం చూపబడుతోంది. ఈ భయానక దృశ్యమే వారికి తుది దినాన కూడా చూపబడు తుంది. అప్పుడు, "ఈ ఫిరౌనీయులందరినీ కఠినాతి కఠినమయిన శిక్షకు గురిచేయండి" అన్న ఆజ్ఞ వారి చెవులలో మార్మోగుతూ ఉంటుంది.

దైవతిరస్కారులపై ఉపద్రవాల పరంపర

కాలక్రమాన సంభవించే విపత్తులను లెక్కచేయక తమ అంతర్యాలు దేన్నైతే సత్యమని ఘోషిస్తాయో ఆ మార్గం వైపుకే పయనించే ధైర్యస్థులు ప్రతికాలంలోనూ కొందరే ఉంటారు. సాధారణంగా ప్రజలు ప్రతి కొత్త విషయాన్ని అంగీకరించే ముందు తండ్రితాతల ఆచార వ్యవహారాలు, వంశం తీరుతెన్నులు, అప్పటి అధికారుల వైఖరిని గమనిస్తారు. ఫిరౌనీయుల స్థితి అంతే. వ్రేళ్ళమీద లెక్కించదగ్గ కొందరు తప్ప తక్కిన వారెవరికీ మూసా(అలైహిస్సలామ్) సందేశాన్ని స్వీకరించి, ఇస్లామీయ ఉద్యమానికి చేయూతనిచ్చే ధైర్యం లేకపోయింది. అలాంటి పుణ్యమూర్తులయిన దైవదాసులలో ఒకరిని గురించి మీరు తెలుసు కున్నారు. ఫిర్ఔన్‌ను ఖాతరు చేయక ఇస్లామీయ సందేశాన్ని స్వీకరించిన రెండో వ్యక్తి స్వయంగా ఫిర్ఔన్ భార్యయే.

ఖుర్ఆన్‌లో ఆ మహనీయ స్త్రీ అచంచల విశ్వాసాన్ని అల్లాహ్ ప్రస్తావిస్తూ ఆమెను నిజమైన విశ్వాసిగా పేర్కొన్నాడు. గౌరవనీయురాలగు ఆమె ఫిర్ఔన్ మహలులో ఉంటూ ఇస్లామీయ విశ్వాస మార్గాన్ని అవలంబించడం ఎంత కష్టమో ఊహించడం కష్టమేమీ కాదు. కాని విశ్వాసం యొక్క వాస్తవికత తేటతెల్ల మయితే అంతరాత్మ బొత్తిగా చావని వ్యక్తి తప్పుడు స్థానంలో పడి అలాగే ఉండ లేడు. ప్రత్యేకంగా పరలోకం గురించిన వాస్తవికత కళ్ళెదుటకు వచ్చినప్పుడు మానవుడు స్వార్థం కోసం అంతరాత్మ గొంతును నులమడంగాని, భయం, పిరిక తనాల కారణంగా ధర్మానికి చేయూతనివ్వడానికి వెనుకంజ వేయడంగాని జర గదు. ఫిర్ఔన్ భార్య కూడా అంతే. ఆమె ఇస్లామ్ సందేశాన్ని విని, అర్థం చేసుకుని మరీ స్వీకరించారు. పర్యవసానం ఏమవుతుందా అన్న ఆలోచనే ఆమెకు రాలేదు.

రాజప్రసాదాలలో నివసించడం సాధ్యం కాకపోవచ్చు లేదా పేదరికం దైన్యాలను ఎదుర్కోవలసిన స్థితి కూడా రావచ్చు. ఇంకా ఫిర్ఔన్ ఆమె చొరవకు సజీవంగా ఉంచనూవచ్చు లేదా వెంటనే ప్రాణాలు తీయనూవచ్చు. అయితే ఆమె ఇటువంటి అనుమానాలకు తావివ్వక నిజమైన విశ్వాసురాలిగా అల్లాహ్‌ను ప్రార్థించారు.

"ఓ ప్రభూ! స్వర్గంలో నీచెంత నాకొక స్థానాన్నివ్వు. ఫిర్ఔన్ నుండి నన్ను విముక్తం చెయ్యి. ఫిర్ఔన్ చేయించే దుష్కృత్యాల నుండి కాపాడు. ఓ నా స్వామీ! నీకు వ్యతిరేకంగా నడుంకట్టిన ఈ దుష్టజాతి నుండి నన్ను రక్షించు."

అల్లాహ్ ఇటువంటి విశ్వాసులు, సజ్జనులు అంటేనే ఇష్టపడతాడు. దుర్భర పరిస్థితులలో కఠినాతి కఠినమయిన పరీక్షా సమయంలో కూడా సత్య మార్గాన్ని వీడకుండా ఉండటమే నిజమయిన విశ్వాసానికి గుర్తు.

ఇటువంటి పుణ్యమూర్తులు కొందరు తప్ప తక్కిన జాతి యావత్తూ సత్యాన్ని స్వీకరించక తిరస్కరించింది. వారు దైవప్రవక్తను తృణీకరించారు. ఆయన మహిమలను మంత్రజాలమన్నారు. చివరికి వారు ఆయన్ను చంపివేయడానికి కూడా ప్రయత్నాలు చేశారు.

అల్లాహ్ కరుణామయుడు. ఆయన మౌలిక గుణాలు కనికరించడం, కరుణించడమే. తన దాసులు భ్రష్టమార్గాలలో పడి జీవితం గడపడం, ఆ విధంగా వారు శాశ్వతంగా ఉండే తమ పరలోక జీవితాన్ని నాశనం చేసుకోవడం ఆయనకెంత మాత్రం నచ్చదు. అదేవిధంగా ఆయన ఫిరౌనీయులపై కూడా కనికరించాడు. ఎవరైతే దైవసందేశాన్ని తిరస్కరించి యావత్తు జీవితాన్ని వినాశ మార్గం వైపుకు మరల్చుకున్నారో అటువంటి అవిధేయులకు ఆయన రుజుమార్గం చూపే ఏర్పాటు చేశాడు. తన ప్రవక్తలయిన హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) మరియు హజ్రత్ హారూన్ (అలైహిస్సలామ్)లను వారి వద్దకు పంపాడు. కాని ఆ ప్రజల కళ్ళు అహంకారంతో మూసుకుపోయాయి. వారి ప్రాపంచిక వ్యామోహం సద్బోధను వినకుండా వారి చెవుల్ని మూసేసింది. అటువంటి స్థితిలో

అల్లాహ్ వారి కళ్ళు తెరవడానికి మరో ఏర్పాటు చేశాడు. వారిపై అనేక రకాల చిన్న చిన్న ఉపద్రవాలు రాసాగాయి. ఒకప్పుడు వర్షాభావంతో కరువు ఏర్పడితే మరొకప్పుడు పంటలు దెబ్బతిని పంటల దిగుబడి తగ్గిపోవడం జరిగేది. ఒక్కోసారి తుఫాను బీభత్సాన్ని సృష్టిస్తే, మరోసారి మిడతల దండు పంటల్ని తుడిచిపెట్టేది. అంతేకాదు, పేలు, చిన్నచిన్న కీటకాలు, కందిరీగల వంటి అత్యల్ప జీవులు, మరొకప్పుడు కప్పలవంటి మామూలు ప్రాణులు కూడా అకస్మాత్తుగా తమ సంఖ్యను పెంచుకుని వారి జీవితాల్ని దుర్భరం చేసేవి. ఒకసారైతే ఆకాశాన్నుండి నెత్తుటి వర్షమే కురిసింది.

ఇదంతా ఎందుకు జరిగింది? వీటికి భయపడి వారు సన్మార్గాన్ని అవలంబిస్తారేమో లేదా ఇవన్నీ యాదృచ్ఛికంగా జరుగుతున్నాయా లేక వీటి వెనుక దైవశక్తి ఏమయినా ఉందా అని ఆలోచిస్తారేమోనని అలాహ్ వీటిని సృష్టించాడు. కాని వారి అజ్ఞానాంధకారం వారికీవిధంగా ఆలోచించే అవకాశమే కల్పించలేదు ఎప్పుడూ. దీనికి భిన్నంగా వారు ఎలా ఆలోచించారో చూడండి: "మనకు మంచి స్థితిగతులు ఏర్పడ్డాయంటే అదంతా మన తెలివితేటలు దూరాలోచనల వల్లనే ఏర్పడ్డాయి" కాని కష్టాలు ఎదురయినప్పుడు, "మూసా (అలైహిస్సలామ్), ఆయన అనుచరుల మూలంగానే ఇవి మనకు దాపురించాయి" అని భావించేవారు.

అహంకారుల అంతం సమీపించిన వేళ

ఫిరౌనీయులకు ఈ ఉపద్రవాలు ఎంత బాధాకరంగా తోచాయంటే ఒక్కోసారి వారు బెంబేలెత్తిపోయేవారు. అప్పుడు వారి అంతర్యాలు ఎవరివైపు నయితే మూసా(అలైహి) మనల్ని ఆహ్వానిస్తున్నారో ఇదంతా ఆ సృష్టికర్త, యజమాని తరఫు నుండే సంభవిస్తున్నాయని ఘోషించేవి. కష్టాలలో సహనాన్ని కోల్పోయినవారు మూసా(అలైహి)తో, "మీరు దైవంతో మా కొరకు ప్రార్థించండి, ఒకవేళ మీ ప్రార్థన వల్ల మేము ఈ కష్టాల నుండి గట్టెక్కితే మేం తప్పకుండా మిమ్మల్ని విశ్వసిస్తాము. అంతేకాదు, మీ ప్రభువును ఆరాధించడానికి, ఆయన

పేర జంతువుల్ని ఖుర్బానీ చేయడానికి ఇస్రాయీల్ సంతతివారికి అవకాశాన్ని కూడా కల్పిస్తాము" అనేవారు. కాని కష్టాలు తొలగిపోగానే వారు మాటతప్పి మునుపటిలాగే ప్రాపంచిక సుఖభోగాలలో మునిగిపోయేవారు.

సరే! ఒక శిక్ష తరువాత మరో శిక్ష వారిపై పడుతుండేది. మొదటి శిక్షకంటే రెండోది కాస్త కఠినంగా ఉండేది. కాని ఫిర్ఔన్ మరియు ఫిరౌనీయుల ప్రవర్తనలో మాత్రం ఏ విధమైన మార్పు వచ్చేదికాదు. పాపాత్ములు, నేరస్థుల మనస్తత్వం ఎప్పుడూ ఒకేరకంగా ఉంటుంది. కాస్త గమనిస్తే ఈ చెప్పేదంతా కేవలం చారిత్రక ఘటనగా మాత్రమేగాక నేటి మన పరిస్థితులకు దర్పణంగా ఉందని కూడా మీరు గ్రహించగలరు. ఈ కాలంలోనూ మానవులు కళ్ళు తెరవడానికి వారిపై ఒకటి, రెండూ కాదు, వందల ఉపద్రవాలు వచ్చిపడు తున్నాయి. ఒకప్పుడు కరువుకాటకాలు సంభవిస్తే మరొకప్పుడు వరదలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ఒక్కోసారి భూకంపం, మరోసారి తుఫాను, ఒకప్పుడు అంటు రోగాలు మరొకప్పుడు యుద్ధాలు, మతకల్లోలాలు విజృంభించి మానవులకు సుఖశాంతులు లేకుండా చేస్తున్నాయి. అయితే మిథ్యావాదులు ఈ ఉపద్రవాలకు భౌతిక కారణాలు వెదుక్కుంటారే తప్ప వీటి వెనుక ఉండే అదృశ్యశక్తిని గురించి ఆలోచించరు. ఇవన్నీ వాటంతట అవే సంభవిస్తున్నాయని తలుస్తారు.

ఆ విధంగా ఫిరౌనీయులు మూసా(అలైహిస్సలామ్)ను ధిక్కరించి దేవుని నిదర్శనాలను అపహాస్యం చేశారు. మూసా(అలైహిస్సలామ్) ఇస్లామ్ ప్రచారం మొదలుపెట్టి నలభై ఏళ్ళు కావస్తున్నాయి. విశ్వాసులుగా మారినవారు మారారు. మిగిలినవారు ఇక ఏ విధంగానూ సన్మార్గం వైపుకు మరలరనే విషయం స్పష్టమయింది.

ధర్మప్రచార కార్యంలో నిమగ్నులైనవారికి ప్రపంచంలోని ఇతర విషయాలకన్నా తాము కేవలం దైవప్రీతి కోసం, పరలోక సాఫల్యం కోసం చేపట్టిన లక్ష్యమే ప్రియంగా ఉంటుంది. ఆ లక్ష్యసాధనలో వారికి బంధువుల బాంధవ్యంగాని, దేశాభిమానంగాని, మరే బంధంగానీ అడ్డురావు. వారికి స్వస్థలం,

వ్యాపారం, బంధుమిత్రులు, ఆస్తులు ఆటంకంగా పరిణమించి నపుడు, వాటన్నింటిని వదలిపెట్టి ఇస్లామీయ ఉద్యమం అభివృద్ధి చెందే, ధర్మసంస్థాపన మార్గాలు సుగమం అయ్యే అవకాశాలు కల ఏ చోటుకయినా వెళ్ళిపోవడానికి వారు తయారవుతారు. హిజ్రత్ (వలసపోవడం) అంటే ఇదే. హిజ్రత్ కేవలం ధార్మిక ప్రయోజనాలు ఆశించి మాత్రమే చేయబడుతుంది. దైవప్రవక్తలకై దైవం తరఫున హిజ్రత్ నిర్ణయమవగానే ఆ విషయం వారికి తెలుపబడుతుంది. అదేవిధంగా హజ్రత్ మూసా(అలైహిస్సలామ్)ను కూడా, "నా దాసులను రాత్రికిరాత్రే ఈజిప్టు నుండి తీసుకు వెళ్ళిపో" అని ఆజ్ఞాపించడం జరిగింది.

ఒక రాత్రి హజ్రత్ మూసా మరియు హజ్రత్ హారూన్(అలైహిస్సలామ్)లు బనీ ఇస్రాయీల్ ప్రజల్ని తీసుకుని పాలస్తీనా వైపుకు ప్రయాణం కట్టారు. వారలా కొంతదూరం పోయారో లేదో ఫిర్‌ఔన్ మనుషులకు బనీ ఇస్రాయీల్ ప్రజలు పట్టణం విడిచివెళ్ళారన్న సంగతి తెలిసింది. వెంటనే వారు ఫిర్‌ఔన్‌కు కబురు పంపారు. ఇది విన్న ఫిర్‌ఔన్ ఉగ్రుడయ్యాడు. ప్రతి ఊరికీ గూఢచారులను పంపించాడు. "వీళ్ళు చూస్తే గుప్పెడు మంది లేరు, తమ చేష్టలతో మమ్మల్ని రెచ్చగొట్టారు. వారి ధైర్యం ఎంతగా పెరిగిందంటే వారి వల్ల మాపై ఒక విధమైన ప్రమాదం వచ్చిపడేలా కనిపిస్తోంది" అన్నాడతను.

ఫిర్‌ఔన్ తన సకల సైన్యాల్ని సమీకరించాడు. బనీ ఇస్రాయీల్ వారిని వెంటాడేందుకు స్వయంగా తాను కూడా బయలుదేరాడు. ఈ బానిస వెధవలు ఎంత దూరం పోతారులే అనుకున్నాడు. ఇప్పుడే వారిని పట్టి పూర్తిగా అంత మొందిస్తానని తలపోశాడు. కాని అటు దైవాభీష్టం మరోలా ఉంది. ఫిర్‌ఔన్, అతని అనుచరులు తమ మహళ్ళను, ఉద్యానవనాలను, తమ ఖజానాలను, తమ సుఖశాంతులను వదిలి మృత్యుకుహరంలోకి అడుగుపెట్టబోతున్న విషయం ఎవరికి తెలుసు?

సూర్యోదయం కాగానే ఫిర్‌ఔన్ సైన్యం బనీ ఇస్రాయీల్ వారిని వెంటాడ్డానికి బయలుదేరింది. అప్పుడు హజ్రత్ మూసా (అలైహిస్సలామ్),

ఆయన అనుచరులు ఒక క్లిష్టమయిన ప్రదేశానికి చేరుకున్నారు. అక్కణ్ణుంచి వారు ముందుకు సాగాలంటే ఎర్ర సముద్రానికి ఉత్తరంగా ఒక ఇరుకయిన జలసంధిని దాటవలసి వచ్చింది. వెనుక చూస్తే, ఫిర్ఔన్ సైన్యం రావడం వారికి కనిపించింది. మూసా (అలైహిస్సలామ్) అనుచరులు భయాందోళనలు వెలి బుచ్చారు. ముందుచూస్తే సముద్రం, వెనుక చూస్తే శక్తిమంతమైన శత్రుసైన్యం. అందువల్ల, "ఇక మేము వీళ్ళకు చిక్కిపోయినట్లే, ఇప్పుడు మనకు దారేమిటి?" అని చింతించసాగారు.

సామిరి జాలంలో బనీ ఇస్రాయీల్

ఇటువంటి సందర్భాలలోనే అల్లాహ్‌పై దృఢవిశ్వాసం, ఆయన ఉనికిపై పూర్తి భరోసా ఉంచవలసింది. ఇదే విశ్వాసానికి డాలుగా ఉపయోగపడేది. హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) తన అనుచరుల్లో ధైర్యం కలిగించారు.

"లేదు, ఎంతమాత్రం లేదు. ఇలా ఎన్నటికీ జరగదు. నా ప్రభువు నా (పక్షాన)తో ఉన్నాడు. ఆయన ఇప్పుడే మనకు ఏదయినా మార్గం చూపిస్తాడు" అన్నారు ఆయన వారి భయాన్ని పోగొడుతూ.

ఇటు అల్లాహ్ మూసా (అలైహిస్సలామ్)ను, "ముందుకు సాగు, సముద్రంపై నీ లాఠీతో కొట్టు" అని ఆజ్ఞాపించాడు.

హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) లాఠీతో కొట్టగానే మరో కొత్త అద్భుతం జరిగింది. లాఠీ మరో కొత్త మహిమను చూపింది. సముద్రం రెండుగా చీలి పోయింది. రెండు పాయల మధ్య చక్కని దారి ఏర్పడింది. సముద్రపు నీరు ఆ దారికి రెండు ప్రక్కల కొండల్లా నిలిచిపోయింది. హజ్రత్ మూసా(అలైహిస్స లామ్) తన అనుచరులతో ఆ దారిగుండా సముద్రాన్ని దాటారు. ఫిర్ఔన్ సైన్యం ఆ ప్రదేశాన్ని సమీపించకముందే వీరు అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. వీళ్ళు చేజారిపోవడం చూసిన ఫిర్ఔన్ క్రోధంతో మరింత ఉడికిపోయాడు. మరో ఆలోచన చేయకుండా అతను వెంటనే ఆ దారి వెంబడే బనీ ఇస్రాయీల్ వారి వెనకాల గుర్రాలను దౌడు తీయించాడు.

ఫిర్ఔన్, అతని అనుచరులు చీలిపోయిన సముద్రంలో మధ్యభాగానికి చేరుకోగానే దైవాజ్ఞతో సముద్రపు రెండు భాగాలు మరలా కలుసుకున్నాయి. ఫిర్ఔన్, అతని అనుచరులు అంతా సముద్రం పాలయ్యారు. చూస్తుండగానే వారి శవాలు నీటిపై తేలాయి.

అటువంటి విపత్కర పరిస్థితిలో ఫిర్ఔన్ స్థితి చూడండి, అతను నీట మునగసాగాడు. ఇక బ్రతికి బట్ట కట్టలేనని తెలుసుకున్నాడు. తన దైవత్వంకాని, తన సైనిక సిబ్బందిగాని తనను మునక్కుండా రక్షించలేరని గ్రహించాడు. అప్పుడు అప్రయత్నంగా అతని నోట ఈ మాటలు వెలువడ్డాయి:

"నేను బనీ ఇస్రాయీల్ వారు తమ ప్రభువుగా, యజమానిగా అంగీ కరించిన దైవాన్ని విశ్వసిస్తున్నాను. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఇప్పుడు నేను కూడా ఆయనకు విధేయులయినవారిలో చేరిపోతున్నాను."

కాని మరణ ఘడియలు ఆసన్నమయ్యాక విశ్వసించేందుకు అవకాశమే ఉండదు. తనకు స్వయం నిర్ణయాధికారం ఉన్నప్పటి వరకే మానవుడి పరీక్షా సమయం ఉంటుంది. కాబట్టి ఫిర్ఔన్‌కు ఇలా జవాబివ్వబడింది:

"ఇప్పుడు విశ్వసిస్తున్నావా? అంతకు ముందైతే అవిధేయతే చూపావు. నీవు పరమ దుర్మార్గుడివి."

మొత్తానికి ఫిర్ఔన్ సముద్రంలో మునిగిపోయాడు. అతని అనుచరులు సముద్రంలోని చేపలకు ఎర అయ్యారు. కాని ఫిర్ఔన్ శవాన్ని మాత్రం అల్లాహ్ భద్రంగా ఉంచాడు. ప్రజలు చూసి గుణపాఠం గ్రహించేందుకు ఆ శవం తేలుతూ వచ్చి ఒడ్డుకు చేరింది. ఫిర్ఔన్- ఒకప్పుడు తన శక్తిసామర్థ్యాలను చూసుకుని విర్రవీగి దైవప్రవక్తలను హేళన చేసినవాడు; దైవధర్మాన్ని తృణీ కరించినవాడు; తన ముందు శిరస్సును వంచాలని, తననే దైవంగా కొలవాలని లక్షలాది ప్రజల్ని బలవంతపెట్టినవాడు; తన ఇష్టప్రకారం అందరూ జీవించాలని శాసించినవాడు- ఈనాడు ఎంతటి దిక్కులేని స్థితిలో పడిఉన్నాడు!

ఈనాటికీ ఫిర్ఔన్ శవం ఈజిప్టు మ్యూజియంలో ఉందని దానిపై ఉప్పు పొర ఉందని తెలుస్తోంది.

ఫిర్ఔన్ సముద్రంలో మునిగిపోయాడు. బనీ ఇస్రాయీల్ ప్రజలకు అతని పీడన నుండి విముక్తి లభించింది. వారు తమ శత్రువు వినాశాన్ని కళ్ళారా చూశారు. మూసా(అలైహిస్సలామ్) వారందర్నీ తీసుకుని పాలస్తీనా వైపు ప్రయాణమయ్యారు. దారిలో సీనా(సినాయ్) లోయలగుండా ప్రయాణించారు. అక్కడ విగ్రహారాధకుల జాతి ఒకటి కనిపించింది. అనేకచోట్ల మందిరాలు కట్టి ఉన్నాయి. అందమైన విగ్రహాలు ఉన్నాయి. పండితులు, పూజారులు వాటిముందు తలలు వంచి కూర్చుని ఉన్నారు. ఇది చూసిన బనీ ఇస్రాయీల్ ప్రజలు మూసా (అలైహిస్సలామ్)తో, "వాళ్ళ విగ్రహాల్లాంటివి మాకూ కొన్ని దేవతా విగ్రహాలను చేయించి ఇవ్వండి" అని అడిగారు.

చూశారా! బనీ ఇస్రాయీల్ ప్రజల స్థితి! వీరు ప్రవక్తల సంతానం, దేవుని ఏకత్వం, ఇస్లామ్ వారి తాతముత్తాతల ధర్మం అయినప్పటికీ దశాబ్దాలుగా బహుదైవారాధకుల బానిసత్వంలో గడిపిన కారణం వల్ల వారి హృదయాలలో విగ్రహారాధన యొక్క ఔన్నత్యం ఇంకా తిష్టవేసి ఉంది. అందువల్ల వారు తమ ప్రవక్తనే అడుగుతున్నారు. తమ కోసం మంచిమంచి విగ్రహాలను తయారు చేయించి ఇవ్వమని! వారి మాటలను విని మూసా (అలైహిస్సలామ్)కు చాలా విచారం కలిగింది.

"మీరు చాలా అజ్ఞానులుగా కనిపిస్తున్నారు. ఇంతకు క్రితమే మీరు వినాశానికి గురి అయినవారిని కళ్ళారా చూశారు. మీరు చేస్తున్నవన్నీ వట్టి తప్పుడు పనులు. కాస్త ఆలోచించండి. అల్లాహ్ మీకు దేవుని ఏకత్వం, ఇస్లామ్‌ల వెలుగునిచ్చాడు. ధర్మధ్వజవాహకులుగా పనిచేయడానికి ఆయన మిమ్మల్ని ఎన్నుకున్నాడు. ఆ విధంగా మిమ్మల్ని సకల మానవులపై ఆధిక్యతను ప్రసాదించ గోరుతున్నాడు. కాని మీరేమో మీ కోసం అల్లాహ్ కాకుండా మరో దైవాన్ని చేసిపెట్టమని నన్ను కోరుతున్నారు" అన్నారు హజ్రత్ మూసా (అలైహిస్సలామ్).

అల్లాహ్ మానవుణ్ణి మిగతా సృష్టికన్నా ఉత్కృష్టమయిన సృష్టిగా చేశాడు. మానవుణ్ణి భూమిపై తన ఖలీఫా (ప్రతినిధి)గా నియమించి పంపాడు. భూమిపైనున్న ప్రాణులన్నిటినీ అతడి సేవకోసమే నియోగించాడు. అటువంటి స్థానం లభించిన తర్వాత అతడు రాళ్ళను మొక్కుతున్నాడంటే అంతకంటే దురదృష్టకరమేముంది? మానవుడు చెట్లను, జంతువులను, నదులను, కొండలను పూజిస్తున్నాడు. తన అవసరాలు తీరడానికి అల్లాహ్‌ను వదలి ఆయన సృష్టి ఎదుట చేయిజాపుతున్నాడు.

బనీ ఇస్రాయీల్ ప్రజలు ముందుకుసాగారు. వారు ఒక బంజరు ప్రదేశాన్ని దాటుతున్నారు. ఆ ప్రదేశంలో త్రాగేందుకు నీరుకాని, తినడానికి ఆహారంగాని ఏమీ దొరకవు. అల్లాహ్ ప్రత్యేక వరం వల్ల వారికి త్రాగడానికి నీరు, ఆహారం ఏర్పాటు అయ్యాయి. అల్లాహ్ ఆజ్ఞతో మూసా (అలైహిస్సలామ్) కొండపైనున్న ఒక రాతిని తన లాఠీతో కొట్టగా పన్నెండు నీటి ఊటలు బయల్పడ్డాయి. బనీ ఇస్రాయీల్ జాతిలోని పన్నెండు కుటుంబాల వారికి ఒక్కో ఊట చొప్పున ప్రత్యేకించబడింది. పగలు ఎండ ఎక్కువైతే మబ్బు నీడ వారికి చల్లదనాన్నిచ్చేది. రాత్రిపూట జిగురువంటి పదార్థం ఆకాశాన్నుండి కురిసి వారి గుడారాలపై పేరుకునేది. దాన్ని 'మన్' అంటారు. చాలా రుచికరమైన ఆహారం అది. ఇంకా 'సల్వా' అనే పరిగ పిట్టలాంటి ఒక విధమైన పక్షులు ఎన్నో దొరుకుతుండేవి. వీరు వాటిని పట్టి ఆహారంగా ఉపయోగించేవారు. తినడానికి మన్, సల్వాలు, త్రాగడానికి నీరు వారికి లభించేవి.

ఒకవైపు వారికి దైవం చేసిన ఈ మేళ్ళున్నాయి. మరోవైపు మూసా (అలైహిస్సలామ్) స్వాగతం, ఆయన ఇచ్చే శిక్షణ ఉండనే ఉన్నాయి. కాని బనీ ఇస్రాయీల్ ప్రజలకు సవివరమయిన షరీఅత్ ఇంకా లభ్యం కాలేదు. ఫిర్ఔన్ పీడనం నుండి విముక్తులయ్యాక వారికి గ్రంథం ఒసగబడుతుందని అల్లాహ్ వాగ్దానం చేసి ఉన్నాడు. మూసా (అలైహిస్సలామ్) తన సోదరుడు హారూన్ (అలైహిస్సలామ్)తో అన్నారు, "నీవు నా స్థానంలో, నా జాతిలో నాకు ప్రతినిధిగా

ఉండు. పరిస్థితుల్ని చక్కబరచడానికి ప్రయత్నిస్తూ ఉండు. దుర్మార్గుల మాటలు విని తప్పు త్రోవలో నడవకు. నేను తూర్ పర్వతం దగ్గరికి పోతున్నాను. అక్కడ నాకు సవివరమయిన షరీఅత్(గ్రంథం) ఇస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు."

మూసా (అలైహిస్సలామ్) ఈ బోధలు చేసి నిష్క్రమించారు. ఇక ఇక్కడేమయిందో చూడండి. ఈజిప్టు నుండి మూసా (అలైహిస్సలామ్) వెంట 'సామిరీ' అనే వ్యక్తి కూడా వచ్చాడు. ఇతడు ఇప్పుడిప్పుడే ముస్లిమ్ అయిన వ్యక్తి. దైవధర్మం పట్ల విశ్వాసం, దేవుని ఏకత్వపు భావన అతని మనస్సులో ఇంకా నాటుకోలేదు. ఈజిప్టు ప్రజలు గోపూజ చేసేవారని మీరు చదివారు కదా. అటువంటి బహుదైవారాధకుల సాంగత్యం వల్ల బనీ ఇస్రాయీల్ జాతిలో కూడా కాస్తోకూస్తో గోభక్తి ఉండిపోయింది. పైగా సామరీ వంటి ముష్రికుల సంతతికి చెందిన వ్యక్తి వారిలో ఉన్నాడు. మూసా (అలైహిస్సలామ్) వెళ్ళిన తర్వాత అతనికి ఒక పెంకి ఆలోచన కలిగింది. అతడు ప్రజలందరి నుంచి వెండి బంగారాలు ప్రోగుచేసి ఒక ఆవుదూడ విగ్రహాన్ని చేయించాడు:

అది అందమైన విగ్రహం. లోపలి భాగం డొల్లగా ఉండి అక్కడక్కడా కొన్ని రంధ్రాలు ఉండేలా తయారుచేయించాడు. ఆ రంధ్రాలగుండా గాలి వీచినప్పుడల్లా వింత శబ్దాలు వినవచ్చేవి. ఈ తమాషా చూడ్డానికి జనం తండోప తండాలుగా దాని చుట్టూ మూగసాగారు. విగ్రహం అందంగానూ ఉంది. వింతగానూ ఉంది. సామిరీలో నక్కివున్న షైతాన్ వెలుపలికి వచ్చాడు. "ఇదేమిటనుకున్నారు? 'దైవం'. మీకూ దైవమే, మూసా (అలైహిస్సలామ్)కూ దైవమే" అన్నాడు అతను.

సామిరీ చెప్పినదాంట్లో సమంజసత లేకపోయినా మనసులో షైతాన్ చోటు చేసుకుంటే బుద్ధి కూడా నశిస్తుంది. స్పష్టమైన విషయం కూడా అర్థం కాకుండాపోతుంది. బనీ ఇస్రాయీల్ ప్రజల పరిస్థితి కూడా ఇలానే అయింది. ఎక్కడ దైవం? ఎక్కడ బంగారు విగ్రహం? కాని విగ్రహారాధన, గోభక్తి హృదయాలలో తిష్టవేసి కూర్చుని బుద్ధీవివేచనల్ని మింగివేశాయి. ఈ దూడ ఎటువంటి

లాభాన్నిగాని, నష్టాన్నిగాని కలిగించజాలదని వారు కనీసం ఆలోచించలేక పోయారు. మొత్తానికి కొందరు సామిరీ జాలంలో చిక్కుకుని ఆ ఆవుదూడ విగ్రహాన్ని పూజించసాగారు.

హజ్రత్ హారూన్(అలైహిస్సలామ్) వారి చేష్టలకు ఎంతో నొచ్చుకున్నారు. "చూడండి, ఈ దూడ మీకొక పరీక్షయేకాని దైవం ఎలా అవుతుంది? మీ ప్రభువు కరుణామయుడయిన అల్లాహ్ మాత్రమే. నా మాట వినండి. ఇటువంటి పనులకు దూరంగా ఉండండి" అంటూ ఆయన వారికి ఎంతగానో నచ్చ జెప్పారు.

కాని మానవుడు మనసుకు తోచినట్లు నడుచుకుంటే, బుద్ధిజ్ఞానాలను ఉపయోగించకుండా నిర్ణయాలు తీసుకుంటే సన్మార్గాన్ని అనుసరించడం అతనికి అసాధ్యమైపోతుంది. బనీ ఇస్రాయీల్ ప్రజలు అంతా వినడమైతే విన్నారు. కాని వారి ఆచరణ మాత్రం యధాతథంగానే ఉంది. వారు తమ మనసుకు తోచినట్లు చేశారు. "సరే, మూసా (అలైహిస్సలామ్) తిరిగివచ్చే వరకు ఈ దూడనే పూజిస్తూ ఉంటాం. ఆయన వచ్చాక అప్పుడు చూద్దాం" అన్నారు వారు.

బహుదైవారాధనను వీడలేని బనీ ఇస్రాయీల్

మూసా (అలైహిస్సలామ్) తూర్ పర్వతంపై ముప్పయి రోజులు ఉండే ఉద్దేశ్యంతో వెళ్ళారు. కాని అక్కడ ఆయన నలభై రోజులు ఉండవలసి వచ్చింది. అక్కడ అల్లాహ్ ఆయనతో సంభాషించాడు. మూసా (అలైహిస్సలామ్) కోరికపై తన జ్యోతిని కూడా కాస్త చూపాడు. మూసా (అలైహిస్సలామ్) దాన్ని భరించలేక పోయారు. విశ్వప్రభువు యొక్క బ్రహ్మాండమైన ఈ జ్యోతిని తృటికాలం చూడగానే ఆయన సొమ్మసిల్లిపోయారు. స్పృహరాగానే తన తప్పిదాన్ని గ్రహించి అల్లాహ్‌ను క్షమాపణ వేడుకున్నారు.

ఆ తరువాత మూసా (అలైహిస్సలామ్)కు 'తౌరాత్' గ్రంథం ఇవ్వబడింది. తౌరాత్ ఫలకాలపై వ్రాయబడింది. అందులో అన్నిరకాల ఆజ్ఞలు, హితవులు

సవివరంగా' పొందుపరచబడ్డాయి. అల్లాహ్ ఆజ్ఞాపించాడు, "తౌరాత్‌ను తీసుకు వెళ్ళు, ఇందులోని ఆజ్ఞలను గట్టిగా ఆచరించు. వీటిపై నీ తెగవారిని కూడా స్థిరంగా ఉండమని చెప్పు."

ఈ భాగ్యం పొందాక మూసా (అలైహిస్సలామ్) ఆనందం అవధులు దాటింది. విశ్వాసి అయిన దాసుడికి తన ప్రభువు ఆజ్ఞలను పాలించడమే ఎంతో సంతోషదాయకమయిన విషయం. అతను ఆ ఆజ్ఞలను కష్టమయినవిగా ఎన్నటికీ భావించడు. కాని ఈ సంతోష సమయంలో ఆయన విచారకరమైన విషయం కూడా వినవలసివచ్చింది. "నీవు లేని సమయంలో నీ తెగవారు ఏకేశ్వరోపాసన, దైవభక్తి పరీక్షలో ఓడిపోయారు." అని అల్లాహ్ ఆయనకు తెలియజేశాడు. వారు ఆవుదూడను దైవంగా చేసుకున్నారు. ఈ సంగతి విని మూసా (అలైహిస్సలామ్)కు చాలా దుఃఖం కలిగింది. తన తెగవారిపై చెప్ప లేనంత కోపం వచ్చింది.

మూసా (అలైహిస్సలామ్) తన తెగవారి దగ్గరికి తిరిగి వచ్చారు. రాగానే, "ఏమిటి మీరు చేసిన పని? మీ ప్రభువు మీకు ఎటువంటి మేళ్ళను గురించి వాగ్దానం చేశాడో గుర్తులేదా? ఎంతోకాలం గడిచిపోయిందనా మీరిటువంటి చర్యలకు పాల్పడ్డారు?" అని గద్దించారు ఆయన.

తెగవారు ఇలా జవాబిచ్చారు: "లేదు, లేదు. మేము ఆ వాగ్దానాలను మరచిపోలేదు. కాని జరిగిందేమంటే మేము ఈజిప్టు నుంచి తెచ్చుకున్న పెద్దపెద్ద నగలను ధరించడం మానేశాం. సామిరీ వాటిని తీసుకెళ్ళి కరగబెట్టి ఆవుదూడ విగ్రహాన్ని తయారుచేశాడు. అది మాట్లాడుతుంది కూడా. ఇదే మా దైవమని, మూసా (అలైహిస్సలామ్)దైవం కూడా అని సామిరీ చెప్పాడు. అందువల్ల మేం దాన్ని పూజించడం ఆరంభించాము."

ఇక మూసా (అలైహిస్సలామ్) తన సోదరుని వైపు తిరిగారు, కోపంతో వూగిపోతూ, ఆయన జుట్టు పట్టుకుని, "హారూన్! ఇలా చేస్తుంటే వాళ్ళని నీవు వారించలేదా? నా ఆజ్ఞ అంటే నీకు లెక్కలేకుండాపోయిందా? వాళ్ళు భ్రష్టులవు

తుంటే చూస్తూ ఊరుకున్నావా?" అని గద్దించారు. హజ్రత్ హారూన్ (అలైహిస్స లామ్) జవాబుగా, "లేదు, నేను చెప్పేది కాస్త విన్పించుకో. నీవు నా జుట్టు, గడ్డం పట్టుకుని నాపై కేకలు వేస్తూ నా శత్రువులు నన్ను పరిహసించే అవకాశాన్ని కల్పించకు. అసలు విషయం అదికాదు. నేను వారిని ఎన్నోసార్లు వారించాను. కాని నా మాట ఒక్కటీ వారు పట్టించుకోలేదు! పైగా వారు నన్ను చంపడానికి సిద్ధపడ్డారు. నా ప్రాణం గురించి నాకు లెక్కలేదు. నేనీ విషయంలో కఠిన వైఖరిని అవలంబించకపోవడానికి కారణం నేను బనీ ఇస్రాయీల్ తెగలో చీలిక తెచ్చానని, నే వచ్చేదాకా ఆగనయినా లేదని నీవంటావేమోనని భావించాను. నేను నీ రాకకై ఎదురుచూస్తున్నాను. నేనీ పాపాత్ములతో చేరిపోయానని భావించకు."

మూసా (అలైహిస్సలామ్) పరిస్థితిని అర్థం చేసుకున్నారు. ఆయన తన వల్ల తన తమ్ముని వల్ల జరిగిన పొరపాట్లకు అల్లాహ్ దగ్గర క్షమాపణ వేడు కున్నారు. తర్వాత ఆయన సామిరీ వైపు తిరిగి, "నీ సంగతేమిటో చెప్పు నీకేమొచ్చిందని ఇలా చేశావు?" అని అడిగారు. సామిరీ తన ప్రాణాన్ని కాపాడు కోవడం కోసం చటుక్కున ఒక కథ అల్లాడు. తన పెంకితనానికి పుణ్యకార్యపు రంగు పులుముతూ, "నేను ఇతరులెవరూ చూడని ఒక దృశ్యాన్ని చూశాను. ఫిర్ఔన్ సైన్యం మన వెంటబడినప్పుడు నేను హజ్రత్ జిబ్రీల్‌ను చూశాను. ఆయన ముందు ముందు నడిచిపోతున్నారు. నేలపై ఆయన గుర్రపు గిట్టలు తాకిన చోటల్లా గడ్డి మొలవసాగింది. నేను గుర్రపు గిట్టలు తాకిన మట్టిని ఒక గుప్పెడు తీసుకున్నాను. నగలతో దూడ విగ్రహాన్ని చేసేటప్పుడు ఈ మట్టిని కూడా ఉపయోగించాను. దాంతో ఆ విగ్రహం మాట్లాడసాగింది. నా మనస్సుకు ఈ విషయమే తట్టింది" అన్నాడు.

హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) సామిరీ చెప్పిన ఈ కట్టుకథ విన్నారు. వెంటనే అతని విషయంలో ఒక ఆజ్ఞను జారీ చేశారు. "ఈరోజు నుండి సామిరీతో ఎవరూ ఎటువంటి సంబంధం పెట్టుకోరాదు. తానొక వెలివేయబడ్డవాణ్ణని అతనికి తెలిసిరావాలి. పరలోకంలో వాడికి శిక్ష ఉండనే ఉంది. అది మాత్రం ఏ విధంగానూ తప్పదు" అన్నారు. ఆయన మళ్ళీ సామిరీతో, "నీవు దేని పూజ

అయితే ప్రారంభించి, దానికి లేని పవిత్రతను ఆపాదించావో దాని గతి చూడు. నీ ఎదుటే దాన్ని కాల్చి మసి చేసి సముద్రంలో పారవేయడం జరుగుతుంది" అన్నారు ఆయన.

తర్వాత హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) అక్కడున్న వారిని సంబో ధించి ఇలా చెప్పారు: "సోదరులారా! మీ యజమాని అల్లాహ్ మాత్రమే ఆయన తప్ప ఆరాధనకు, విధేయతకు అర్హులు ఎవరూ లేరు. ఆయనే మీ ప్రభువు. ఆయన జ్ఞానమే సర్వత్రా వ్యాపించి ఉంది. ఇటువంటి విగ్రహాలు దేవతలెలా అవుతాయి? ఈ దూడలో ఏముంది? అందులో అసలు ఎలాంటి పవిత్రతగాని, మహిమగాని లేదు. ఇది ఎటువంటి లాభాన్ని గాని, నష్టాన్నిగాని కలిగించ జాలదు. మేము ఇప్పుడే దాన్ని కాల్చి మసి చేసేస్తాం. ఎక్కడయినా దైవానికి ఇలాంటి దుర్గతి పడుతుందా?"

తలబిరుసుతనం తెచ్చిన తంటా

సామిరీకి శిక్ష సంగతి వినిపించి ఆయన తన తెగవారి కోసం దైవం సమక్షంలో వారి అపరాధాలకు క్షమాభిక్ష కోరారు. అల్లాహ్ ఆయన దుఆను స్వీక రించాడు. అయితే ఒక షరతు విధించాడు. "ఎవరయితే దైవానికి సహవర్తనుల్ని నిలబెట్టారో వారి మార్గభ్రష్టత్వానికి శిక్షగా తెగవారే వారిని తమ చేతులతో చంపాలి. తద్వారా తెగ మొత్తానికి అంటిన దైవతిరస్కారం, షిర్క్‌ల మచ్చ మాసిపోతుంది.

ఈ ఆజ్ఞను వెంటనే అమలుపరచడం ప్రారంభమయింది. బనీ ఇస్రాయీల్ ప్రజలు చాలామంది మృత్యువాతన పడ్డారు. హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) తిరిగి దయాభిక్ష కోసం దైవాన్ని ప్రార్థించారు. అప్పుడు తేలిక పాటి నేరం చేసినవారిని క్షమించి విడిచిపెట్టడం జరిగింది. ఇక షిర్క్, ఎప్పుడు 'షిర్క్' దరిదాపులకు పోవద్దని హెచ్చరించడం జరిగింది.

బానిస బ్రతుకు ఇస్లామీయ జీవిత విధానానికి పొసగదు. ఇస్లామ్ మానవుణ్ణి అన్నివిధాల బానిసత్వాన్నుండి వెలికితీసి కేవలం ఒకే దేవుని దాసునిగా

చేస్తుంది. అందుచేతనే ముస్లిములకు బానిస బ్రతుకు బ్రతకవలసి వచ్చి నప్పుడల్లా ఇస్లామ్‌తో వారి సంబంధం బలహీనమే అవుతూపోయింది. ఇక కాఫిర్లు, ముష్రికుల (దైవ ధిక్కారులు, బహు దైవారాధకుల)కు చేసే బానిసత్వం ఇంకా ప్రమాదకరంగా ఉంటుంది. ఎన్నో దైవధిక్కారానికి సంబంధించిన విషయాలు, బహు దైవారాధనా భావాలు మెల్లమెల్లగా వారి హృదయాల్లో చోటు చేసుకుంటాయి. ఫలితంగా తన విశ్వాసానికి ఎటువంటి చీడపడుతూ ఉంటుందో మోమిన్‌కి తెలియనే తెలియదు. కొద్ది దినాల్లోనే అతడు ఎన్నో ఇస్లామ్ వ్యతిరేక విషయాలు అవలంబిస్తాడు. బనీ ఇస్రాయీల్ ప్రజల స్థితి అచ్చం ఇలాగే అయింది. ఫిరౌనీయుల చేతి క్రింద బానిసలుగా చాలా కాలంగా ఉన్న కారణాన వారిలో ఎన్నో చెడులు చోటుచేసుకున్నాయి. హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) ఇప్పుడు ఈ చెడులన్నింటినీ దూరం చేయడానికి పూను కున్నారు. బనీ ఇస్రాయీల్ ప్రజలకు ఉన్నత ఇస్లామీయ విద్యాశిక్షలు ఏర్పాటు చేశారు. వారు తమ దైనందిన కార్యాలు చూసుకునేందుకు వీలుగా మూసా (అలైహిస్సలామ్) వారిని పన్నెండు విభిన్న వర్గాలుగా విభజించారు. ప్రతి వర్గానికి ఒక పర్యవేక్షకుడిని నియమించారు. ఇస్లామ్‌కు వ్యతిరేకంగా కనబడే ఏ విషయంలోనైనా వారిని హెచ్చరిస్తూ, వారి పరస్పర సంబంధాలను మెరుగు పరచడానికి తగిన మార్గదర్శకత్వం వహించే బాధ్యతను కూడా ఆ పర్యవేక్షకులపై మోపారు.

బనీ ఇస్రాయీల్ ప్రజలు ఫిరౌనీయులతో సహజీవనం చేసి ఎంత దిగజారిపోయారో, అలాంటివారి సంస్కరణ కోసం మూసా (అలైహిస్సలామ్) ఎంత కృషి చేయవలసి వచ్చిందో ముక్తసరిగా తెలుసుకుందాం.

తౌరాత్ గ్రంథం లభించిన తర్వాత జరిగిన సంఘటన. వారిలో కొందరు మూసా (అలైహిస్సలామ్)తో, "మాకు దైవాన్ని చూపండి. ఆయన మీకు తౌరాత్ ఇస్తూ దాని ప్రకారం ఆచరించమని ఆదేశిస్తున్న సన్నివేశాన్ని మేము ప్రత్యక్షంగా చూస్తాము" అన్నారు.

చూశారా వారి తలబిరుసుతనం! దేవుని ఉనికి, ఆయన గుణగణాలను గురించిన వాస్తవిక జ్ఞానంలేని కారణంగానే వారు అలా అడుగుతున్నారు. ఈజిప్టు ప్రజలు తమ దేవతల విషయంలో భావించినట్లే వీరు అల్లాహ్ విషయంలో కూడా భావిస్తున్నారు.

గోవు యొక్క ఔన్నత్యం, దాని పట్ల గౌరవభావం వారి హృదయాలలో కొద్దోగొప్పో ఇంకా తిష్టవేసుకునే ఉంది. ఈ జాడ్యం మూలానే వారు ఆవుదూడను పూజించడానికి పాల్పడ్డారు. కాబట్టి వారి హృదయాలలో నాటుకుపోయిన ఈ భావాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరముంది. అల్లాహ్ ఆజ్ఞతో మూసా (అలైహిస్సలామ్), "మీరొక గోవును జిబహ్ చేయండి" అని ఆదేశించారు వారిని. కాని వారా పని నుండి తప్పించుకోడానికి రకరకాల సాకులు వెదికారు. "దాని రంగు ఎలా ఉండాలి?" అని ఒకసారి, "గోవు ఎలాంటిదై ఉండాలి? అని మరో సారి ప్రశ్నలు వేశారు. నిజానికి అల్లాహ్ ఆజ్ఞ వినగానే గోవును ఖుర్బానీ ఇవ్వడానికి సిద్ధపడవలసింది. కాని దైవాజ్ఞల గొప్పతనం మనస్సులో నాటుకోనంత వరకు మనిషి ఇటువంటి ప్రశ్నలే వేస్తుంటాడు. చివరకు మూసా (అలైహిస్సలామ్) వారడిగిన అన్ని ప్రశ్నలకు జవాబిచ్చి గోవు ఎలాంటిదై ఉండాలో తెలియజేసిన తర్వాతనే వారు తప్పనిసరియై గోవును ఖుర్బానీ చేశారు. లేకపోతే వారు ఖుర్బానీ ఇచ్చేవారా?

హజ్రత్ మూసా (అలైహిస్సలామ్)ను అల్లాహ్ ఆజ్ఞాపించాడు: "బనీ ఇస్రాయీల్ ప్రజలను పాలస్తీనా (పవిత్రభూమి)కు తీసుకువెళ్ళు. అక్కడ వారు వృద్ధివికాసాలు చెందుతారు. వారికి అక్కడ మేము అధికారాన్ని, నాయకత్వాన్ని ప్రసాదిస్తాము. ఇది మా వాగ్దానం."

కాబట్టి మూసా (అలైహిస్సలామ్) తన తెగవారితో అన్నారు:

"సోదరులారా! అల్లాహ్ ఎల్లప్పుడూ మిమ్మల్ని కటాక్షవీక్షణలతోనే చూశాడు. ఈ విషయం మీకు బాగా తెలుసు. మీలో కొందరిని తన ప్రవక్తలుగా చేశాడు. కొందరికి అధికారాన్ని ఇచ్చాడు. ప్రపంచంలో ఎవరికీ లభించని మహా భాగ్యాన్ని మీకు ప్రసాదించాడు. అంటే మిమ్మల్ని దైవధర్మ ధ్వజ వాహకులుగా

చేశాడు. అంచేత ఆయన ఇప్పుడు మిమ్మల్ని పాలస్తీనాకు వెళ్ళి అక్కడ దైవధర్మాన్ని సంస్థాపించమని ఆజ్ఞాపిస్తున్నాడు. ఈ బాధ్యతను తిరస్కరించి నట్లయితే మీరు ఘోరంగా నష్టపోతారు.''

ఇది విని కొందరు పాలస్తీనాకు వెళ్ళడానికి అంగీకరించారు. కొందరు తటపటాయించసాగారు. వారి భీరత్వాన్ని చూసి ఇద్దరు ధైర్యశాలురు పాలస్తీనాలో ప్రవేశించడానికి మార్గాలు సూచించారు. అల్లాహ్‌పై భరోసా ఉంచవలసినదిగా వారికి హితవు చేస్తూ విజయం తమనే వరిస్తుందని వారిలో ధైర్యాన్ని కలిగించారు. కాని శతాబ్దాల తరబడి బానిసత్వాన్ని అనుభవించిన ఈ జాతి దైవప్రవక్త ఆజ్ఞను అంత తేలిగ్గా పాటిస్తుందా? పైగా వారికిస్తున్న శిక్షణ కూడా పూర్తి కాలేదు. అటువంటి జాతి ప్రాణాలకు తెగించి ముందడుగు వేస్తుందని ఎలా ఆశించగలం? ఆ పిరికిపందలు పాలస్తీనాకు బయలుదేరడానికి తిరస్కరించారు. ''అయ్యా! మేము మాత్రం అక్కడికి రాము. కావాలంటే మీరు, మీ దైవం వెళ్ళి పాలస్తీనా వారితో తలపడండి. మేమైతే ఇక్కడే ఉంటాం. మీరు యుద్ధంలో గెలిచి, శత్రువుల్ని పూర్తిగా తరిమివేశాక- అప్పుడు వస్తాం మేము'' అన్నారు వారు.

తన తెగవారి మాటలు విన్న మూసా (అలైహిస్సలామ్)కు దుఃఖం పొర్లి వచ్చింది. అల్లాహ్‌ను ప్రార్థించారు, ''ప్రభూ! నా సోదరుడు, నా వంశస్థులు తప్ప నా మాట ఎవరి మీదా చెల్లదు. ఇక ఈ మూర్ఖ జాతిపై నీ పట్ల వారు కనబరచిన అవిధేయత కారణంగా ఏదైనా శాపం వస్తే దాన్నుండి మమ్మల్ని కాపాడు.'' దైవాజ్ఞ అయింది: ''మరో నలభై ఏళ్ళ వరకు వారికి ఈ పవిత్ర భూమిపై పాదం మోపే అవకాశం లేదు. ఇక్కడే దిక్కుతోచక తిరుగుతూ ఉంటారు.''

ప్రవక్త హితబోధ

ఈ నలభై ఏళ్ళకాలంలో కొత్తతరం వచ్చింది. ఈ తరంలోని వారెవరూ బానిసత్వం, దైవతిరస్కారపు వాతావరణంలో జీవితం గడపలేదు. పైగా వారి పోషణ స్వేచ్ఛాయుత ఇస్లామీయ వాతావరణంలో సాగింది. అల్లాహ్ ధర్మ సంస్థాపనా కార్యం ఈ తరంవారిచేత చేయించాడు.

మొత్తంమీద ఇటువంటి ఎన్నో దుశ్చర్యల వల్ల మూసా (అలైహిస్స లామ్)కు ప్రతిరోజూ ఏదో ఒక రకంగా మనస్తాపం కలుగుతూనే వచ్చింది. కాని ప్రవక్త తన సమాజం పాలిట కారుణ్యమూర్తిగా ఉంటాడు. సమాజం పట్ల ప్రవక్త హృదయంలో ఉండే ప్రేమ ఇతరులలో ఉండదు. హజ్రత్ మూసా (అలైహిస్స లామ్) కూడా తన తెగవారి దుశ్చర్యలన్నింటినీ సహిస్తూ వారి శిక్షణాసంస్కరణల కార్యంలో నిమగ్నులయ్యారు.

హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) ఇచ్చిన ఈ శిక్షణ పర్యవసానంగానే శతాబ్దాల తరబడి బానిసత్వంలో మగ్గినా, బహు దైవారాధనా వాతావరణంలో గడిపి తమ శక్తిసామర్థ్యాలను కోల్పోయినా బనీ ఇస్రాయీల్ జాతి ప్రపంచ నాయ కత్వపు ఉన్నత శిఖరాలను అందుకోగలిగింది. మానవాళికి మరోసారి దైవదత్త జీవన వ్యవస్థ, అది ప్రసాదించే వరాలతో తులతూగే మహాభాగ్యం లభించింది.

హజ్రత్ మూసా (అలైహిస్సలామ్)ను గురించిన సంఘటనలు పూర్తికా వచ్చాయి. దాదాపు 120 ఏండ్ల వయస్సు వచ్చేవరకు ఆయన దైవదౌత్య బాధ్యతను నెరవేర్చారు. ఈ వ్యవధిలో బహు దైవారాధకులకు, దైవధిక్కారులకు దైవ సందేశాన్ని అందజేయడానికి, ఫిర్ఔన్ వంటి రాజుతో తలపడటానికి, బనీ ఇస్రాయీల్ భ్రష్టజాతిలో దైవం పట్ల విశ్వాసాన్ని జాగృతపరచి, దాన్ని పటిష్టం చేసి, వారి పరిపూర్ణ సంస్కరణ కోసం ఏమేమి చేశారో ఆ వైనాన్ని పూర్తి వివరంగా చెప్పడం సాధ్యంకాదు. అయితే వీటి సంక్షిప్త స్వరూపం మీ ముందుకు వచ్చింది. ఇస్లామీయ ఉద్యమాన్ని చేపట్టడం, దాని ఉన్నతి కోసం ఎటువంటి సందర్భా లలో ఎలా ముందుకు సాగాలో, ఎటువంటి కష్టాలను సహించాలో మీకు అర్థమయిది. హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) జీవిత సంఘటనలలో మన కోసం ఎన్నో హితబోధలు, గుణపాఠం ఉన్నాయి. అందుచేతనే పవిత్ర ఖుర్ఆన్‌లో హజ్రత్ మూసా (అలైహిస్సలామ్)కు చెందిన సంఘటనలు తరచుగా ఉటంకించబడ్డాయి.

ఇబ్రాహీమ్ సూరాలో ఆ హితబోధలలో ఒక భాగం ప్రత్యేకంగా ఇలా ఉదహరించబడింది: ''మేము మూసా(అలైహిస్సలామ్) కు మా నిదర్శనాలను

ఇచ్చి పంపాము. ఎందుకంటే ఆయన తన జాతివారిని చీకట్ల నుండి వెలికితీసి వెలుగులోకి తీసుకురావాలని." ఈ చీకట్లు ఏవి? దైవ తిరస్కారం, బహు దైవారాధన, దైవం పట్ల అవిధేయత, అల్లాహ్ తప్ప ఇతరుల దాస్యం, బానిసత్వం, ఇంకా ఇస్లామ్ నుండి మార్గదర్శకత్వం స్వీకరించని మానవుణ్ణి చుట్టుముట్టే ఇతర అంధకారాలు. వాటినుండి బనీ ఇస్రాయీల్ ప్రజలను బయటికు తీసి వెలుగులోకి తీసుకురావాలి. ఎటువంటి వెలుగు అది! దైవధర్మజ్యోతి, అల్లాహ్‌చే పంపబడ్డ హితబోధల వెలుగు. అది ఎటువంటి వెలుగు అంటే, ఇది ఇహలోక జీవిత ప్రయాణంలో వచ్చే ఎదురుదెబ్బల నుండి మనిషిని కాపాడటమేకాక పరలోక సాఫల్యానికి గొనిపోయే మార్గాన్ని కూడా సుగమం చేస్తుంది. తద్వారా అతనికి శాశ్వత జీవితం యొక్క వాస్తవమైన సుఖశాంతులు ప్రాప్తమవుతాయి.

ప్రజలు గుణపాఠాన్ని గ్రహించేందుకు వారికి మానవ చరిత్రలోని ముఖ్య సంఘటనలను కూడా వినిపించమని అల్లాహ్ హజ్రత్ మూసా (అలైహిస్సలామ్)కు చెప్పాడు. అల్లాహ్ గత జాతులకు వారి కర్మలనుబట్టి శిక్ష లేదా సత్ఫలాన్ని ఇచ్చాడు. చారిత్రాత్మకమైన ఆ సంఘటనల్లో గల నిదర్శనాలవల్ల మనిషికి తౌహీద్ (దేవుని ఏకత్వం) సత్యమని నిరూపించే సాక్ష్యాధారాలు, మంచివారికి చెడ్డవారికి పట్టే గతి ఒక్కలా ఉండదనడానికి కావలసిన ఋజువులు కూడా ఉన్నాయి. మనిషి బుర్రకు పని కల్పించి ఆలోచిస్తే ఏ ఏ జాతులు, వ్యక్తులయితే భ్రష్టవిశ్వాసాలతో, తప్పుడు భావాలతో జీవితం గడిపారో, వారికి ఎలాంటి గతి పట్టిందో (ఆ సంఘటనల ద్వారా) మనిషి తెలుసుకోగలడు. ఈ చారిత్రక సంఘటనల్లో గ్రహించేవారికి అసంఖ్యాకమయిన గుణపాఠాలు ఉన్నాయి. అయితే ఇవన్నీ ఓర్పు, కృతజ్ఞతా భావాలు కలవారికే ప్రయోజనం చేకూర్చుతాయి. ఒక వ్యక్తి దేవుని వరాలను గుర్తించి, వాటిని సద్వినియోగమే చేసుకుంటే, అతడు వాటితో ఎలా ప్రయోజనం పొందగలడు? ఇదేవిధంగా దైవాజ్ఞల విషయంలో మనోవాంఛల్ని అణచలేనివాడు, ఆ ఆజ్ఞల పాలనలో ఎదురయ్యే కష్టనష్టాలను ఎదుర్కోడానికి సిద్ధపడనివాడి ముందు ఎన్ని గుణపాఠాలు, హితబోధలు వచ్చినా వ్యర్థమే అవుతాయి.

మూసా (అలైహిస్సలామ్) తన తెగవారితో పలికారు, "సోదరులారా! అల్లాహ్ మీపై చేసిన మేలును గుర్తుంచుకోండి. ఆయన మీకు ఫిర్ఔన్ బారి నుండి విముక్తి కలిగించాడు. ఆ ఫిర్ఔన్ మిమ్మల్ని కఠినంగా బాధించేవాడు. మీ మగ పిల్లల్ని చంపివేసేవాడు, మీ స్త్రీలను వెట్టిచాకిరి కోసం బ్రతకనిచ్చేవాడు. ఈ విషయాలను మీ ప్రభువు తరఫున మీకు ఒక పెద్ద పరీక్షగా చేయడం జరిగింది. కాని ఇప్పుడు, ఆయన మీకు సుఖశాంతులు ప్రసాదించాడు. రకరకాల వరాలను ప్రసాదించాడు. మీకు హితోపదేశం చేశాడు. కాబట్టి అందుకు మాటల తోను, చేతలతోను కృతజ్ఞత చూపడం మీ విధి. 'మీరు ఆయన ఇచ్చిన వరాలకు కృతజ్ఞతలు చెల్లిస్తే మేము మీకు మరిన్ని వరాలిస్తాము. ఒకవేళ కృతఘ్నులవుతే గుర్తుంచుకోండి. మా శిక్ష కూడా కఠినంగానే ఉంటుంది' అని స్పష్టంగా చెప్పిన మీ ప్రభువు మాటలను గుర్తుంచుకోండి".

ఒక మనిషి రెండో మనిషికి ఉపకారం చేస్తే దానికి బదులుగా అతడు తన ఉపకారికి తిరిగి కొంతయినా సరే ప్రత్యుపకారం చేసే అవకాశం ఉంది. కాని అల్లాహ్ అంతకంటే ఎంతో ఉన్నతుడు కదా! ఆయన పనికి తోడ్పాటునిచ్చే వారు కాని, ఆయనకు మేలుచేసేవారుకాని ఎవరూ ఉండలేరు. ఆయన అన్నిరకాల అవసరాలకు అతీతుడు. ఎటువంటి సహాయమూ అక్కరలేనివాడు. కాబట్టి ఆయన వరాలను గౌరవించాలి. వాటిని దైవేచ్ఛకనుగుణంగా వినియో గించాలి. దైవాజ్ఞల ప్రకారం ఆచరించి ఆయన్ని ప్రసన్నుణ్ణి చేసుకోవాలి. ఇదే ఆ వరాలకు కృతజ్ఞత చూపడం అంటే. ఆ కృతజ్ఞతాభావం మనసులో ఎప్పుడూ ఉండాలంటే ఆయన్ని స్తుతించాలి. కృతజ్ఞతావాక్యాలు ఆలోచించి, అర్థం చేసుకుని ఉచ్చరించడం మరీ అవసరం.

ఈ విధంగా కృతజ్ఞతలు చెల్లించడం వల్ల అల్లాహ్‌కు ఒరిగేదేమీ లేదు. ఆయన అన్నిరకాల లాభాలకు అతీతుడు. ఆ లాభం కూడా కృతజ్ఞతలు చెల్లిం చిన వ్యక్తికే లభిస్తుంది. తత్ఫలితంగా అతనికి లభించే దేవుని వరాలు అధికమవు తాయి. ఇంకా ఇహపరాల సాఫల్యాలు కూడా లభ్యమవుతాయి. అటువంటి

మహోపకారి విషయంలో తిరుగుబాటు వైఖరిని అవలంబించేవారు, ఆయన ఇచ్చిన వరాలను తప్పుడు పద్ధతులలో, తప్పుడు మార్గాలలో వినియోగించేవారు, ఆయన ఆజ్ఞల్ని జవదాటేవారు, ఆయన హితవులను పెడచెవినపెట్టేవారు అల్లాహ్‌కు ఏవిధంగానూ చెరుపు చేయలేరు. వీరు తమకే నష్టం కలిగించు కుంటున్నారు. ఎందుకంటే ఎవరు కృతజ్ఞతలు చెల్లించినా, ఎవరు వినయ విధేయతలు చూపినా వాటివల్ల అల్లాహ్‌కు ఎలాంటి ప్రయోజనం చేకూరదు. మూసా (అలైహిస్సలామ్) స్పష్టంగా చెప్పారు, "మీరు తిరస్కార వైఖరిని అవలం బిస్తే, భూమిపైనున్నవారంతా కాఫిర్లు అయిపోయినా అల్లాహ్ దాన్ని ఖాతరు చేయడు. ఒకరు ప్రశంసించినా, ప్రశంసించకపోయినా ఆయన స్వయంగా ప్రశంసనీయుడు. ఏ ఒక్కడి పొగడ్తల అవసరమూ ఆయనకు లేదు. ఒకరు తనను పొగడాలనే కోరిక లేదాయనకు. ఆయన స్వీయ గుణగణాలు కలవాడు. అవి శాశ్వతమయినవి. తాత్కాలికమూ, ఇతరుల చేత ఇవ్వబడినవి ఎంత మాత్రమూ కావు.

మూసా (అలైహిస్సలామ్) చేసిన ఈ ప్రసంగం అధికభాగం 'తౌరాత్' గ్రంథంలో ఉంది. దాన్ని చూసినట్లయితే, బనీ ఇస్రాయీల్ వారి శిక్షణా సంస్క రణలకు మూసా (అలైహిస్సలామ్) ఎటువంటి విధానాలను అవలంబించారో అర్థం కాగలదు. ఆ ప్రసంగంలో నొక్కి చెప్పబడిన ముఖ్య విషయాలు:

- అల్లాహ్‌ను మనస్ఫూర్తిగా ప్రేమించండి. ఆయన చేసిన మేళ్ళను గుర్తుంచుకోండి. ఆయన ఇచ్చిన వరాలను మరచిపోకండి.
- చిత్తశుద్ధితో, పూర్తి అంగీకారంతో దైవదాస్యంపై స్థిరంగా ఉండండి.
- అల్లాహ్‌ను ప్రేమించే, ఆయన ఆజ్ఞలను పాలించే హితవు మీకు ఇవ్వ బడుతూంది. దాన్ని మీ సంతానానిక్కూడా బోధించండి. తద్వారా మీ తర్వాత మీ వంశంలో పుట్టేవారు అల్లాహ్‌కే విధేయులు కావాలి. అవిధే యులు, తిరస్కారులు కారాదు.

- ఇంట్లో ఉన్నా, దారినపోతూ ఉన్నా, కూర్చుని ఉన్నా, పడుకుని ఉన్నా అల్లాహ్ ఆజ్ఞల్ని, హితవుల్ని మననం చేసుకుంటూ ఉండండి- అంటే సందేశ ప్రచార బాధ్యతను నెరవేర్చాలి.
- దైవవాణిని విని ఆ ప్రకారంగా ఆచరిస్తే మీకు శుభాలు కలుగుతాయి. పట్టణాల్లో ఉన్నా పల్లెల్లో ఉన్నా సరే మీ విరోధులకు అపజయం కలుగుతుంది. మీరు చేసే ప్రతి పనిలోనూ శుభం కలుగుతుంది.

❀ ❀ ❀